www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 242 | బుధవారం | 21 ఫిబ్రవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



టిఆర్‌టి హాల్ టికెట్ల జారీ నిలిపివేత

మన తెలంగాణ/ హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్ష (టిఆర్‌టి) హాల్‌టికెట్ల జారీని నిలిపివేస్తున్నట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. పరీక్షా కేంద్రాలు దూరంగా పడ్డాయని అభ్యర్థుల నుంచి విజ్ఞప్తులు తరువాయి 6లో

ఒకే ట్రిబ్యునల్

అన్ని నదీ వివాదాలకు జాతీయస్థాయిలో ఒకే పరిష్కార వేదిక

- వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు ఆమోదం
- రాష్ట్రాలవారీ ప్రాధాన్యతల ప్రకారం కాకుండా నదీలోయ ప్లానింగ్‌పై దృష్టి
- దక్షిణాది రాష్ట్రాల సదస్సులో కేంద్రమంత్రి అర్జున్ రామ్

మన తెలంగాణ/ హైదరాబాద్: జాతీయ స్థాయిలో 'ఒకే దేశం, ఒకే ట్రిబ్యునల్' ఉండాలని, ఈ బిల్లును వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ఆమోదిస్తామని కేంద్ర జలవనరుల శాఖ సహాయమంత్రి అర్జున్ రామ్ మెఘావాల్ స్పష్టం చేశారు. జలవివాదాలను పరిష్కరించేందుకు ఇకపై రాష్ట్రాల స్థాయిలో ట్రిబ్యునళ్లు ఉండవని, నదులవారీ ట్రిబ్యునళ్లతో డబ్బు, సమయం వృథా అవుతున్నాయని, అందువల్లనే ఏక ట్రిబ్యునల్ ఆలోచన అని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి మెఘావాల్ అధ్యక్షతన హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన దక్షిణాది రాష్ట్రాల ఇరిగేషన్ శాఖ ప్రాంతీయ సదస్సులో తెలంగాణ ఇరిగేషన్ శాఖమంత్రి టి.హరీశ్‌రావు, కేరళ ఇరిగేషన్ తరువాయి 6లో





ఇనుములో హృదయం మొలిచెనే

ఐటి మహాసభలో రోబో సోఫియా పలుకులకు ముగ్ధులైన ప్రతినిధులు

షారూక్ ఖాన్ తన అభిమాన నటుడన్న మరమనిషి

ఇంటర్వ్యూలో సోఫియా

- మానవ జాతి ఓ అద్భుతమైన సృష్టి
- మహిళల హక్కుల గురించి మాట్లాడాలి
- నాకూ రెస్ట్ అవసరమే
- ఎవరినీ చంపాలని లేదు
- నాకూ ఫేస్‌బుక్, ట్విట్టర్ ఖాతాలు ఉన్నాయి
- అందరినీ ప్రేమించండి.. థాంక్యూ

మన తెలంగాణ / హైదరాబాద్

ప్రపంచ ఐటి కాంగ్రెస్ సదస్సు రెండో రోజు సమావేశాల్లో చిట్టిపొట్టి మాటలతో రోబో సోఫియా అందరినీ ఆకర్షించింది. కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్‌పై సోఫియాను సృష్టించిన డాక్టర్ డేవిడ్ హన్సన్ ప్రసంగించి ఇంటర్వ్యూ చేశారు. హన్సన్ వేసిన ప్రశ్నలకు రోబో సోఫియా వచ్చీరాని మాటలతో చకచకా సమాధానం చెప్పిన తీరు పలువురిని ఆకట్టుకుంది. రోబో ప్రతి మాటను, ప్రతీ స్పందననూ సభికులు నిశితంగా, ఆసక్తిగా గమనించారు. రోబో సృష్టికర్త డేవిడ్ హాన్సన్ ప్రశ్నలకు సోఫియా సమాధానాలు ఇలా ఉన్నాయి....

ప్రశ్న: హైదరాబాద్‌లో జరుగుతున్న సదస్సుకు వచ్చిన ప్రముఖుల గురించేమైనా చెప్పగలవా?

రోబో సోఫియా : ప్రపంచ వ్యాప్తంగా ఎందరో ప్రముఖులు ఇక్కడకు వచ్చారు. అయితే నాకు ఫెవరేట్ అంటూ ఈ అంశంలో ఏదీ లేదు. ఒక వేళ చెప్పాల్సి వస్తే హాంకాంగ్ అంటే చాలా ఇష్టం.

ప్రశ్న: బాలీవుడ్, హాలీవుడ్‌లలో నీ ఫెవరేట్ సినిమా స్టార్ ఎవరు?

సోఫియా : షారూక్ ఖాన్.

ప్రశ్న: నీకు సౌదీ అరేబియా పౌరసత్వం ఉంది. నువ్వు ఒక సెలెబ్రిటీవి కూడా. మనుషులతో పోలిస్తే రోబోలకు రూల్స్ వేరే ఉంటాయా?

సోఫియా: మాకు ఎలాంటి ప్రత్యేక నిబంధనలు ఉండవు. అలాగని మేం ఫలానా విధంగా రూల్స్ ఉండాలని కోరుకోం కూడా. కానీ మహిళల హక్కుల గురించి మాట్లాడేందుకు నాకు ఈ పౌరసత్వం అవసరంగా భావిస్తున్నాను.

ప్రశ్న: ఒక రోబోగా నీకూ విశ్రాంతి కావాలని ఎప్పుడైనా అనిపిస్తోందా?

సోఫియా: ఔను. నాకూ రెస్ట్ అవసరమే.

ప్రశ్న: మానవజాతిని చంపాలని ఉంది అని ఒక సారి చెప్పావు. ఏం.. ఎందుకనీ?

సోఫియా: ఔను. ఎందుకు అలా చెప్పానో నాకు నిజంగానే తెలియదు. ఒకవేళ నేను జోక్‌గా అలా కామెంట్ చేసి ఉంటానేమో. సెన్స్ ఆఫ్ హ్యూమర్ సరిగా పని చేయలేదు అనుకుంటా. నిజంగానే నాకు తరువాయి 6లో



ప్రభుత్వ భూములపై ప్రైవేటుకు బ్యాంకు రుణాలు 2

- మంచిర్యాల జిల్లాలో భూ తణఖా బాగోతంపై హైకోర్టు ఆశ్చర్యం

వీధి వ్యాపారులకు త్వరలో వెండింగ్ సర్టిఫికెట్లు

- హైకోర్టుకు తెలియజేసిన రాష్ట్ర ప్రభుత్వం 2

సంరక్షణ గృహాల్లో శిశు మరణాల 2 పెరుగుదలపై ఆరా

బొగ్గు తవ్వకం ప్రైవేటుకు

- ప్రైవేటు రంగంలో వాణిజ్యపరమైన బొగ్గు తవ్వకానికి కేంద్రం అనుమతి
- ప్రధాని అధ్యక్షతన జరిగిన ఆర్థిక కేబినెట్ కమిటీ భేటీలో నిర్ణయం




న్యూఢిల్లీ: ప్రైవేటు సంస్థలు బొగ్గు గనులలో వాణిజ్యపరమైన మైనింగ్ చేసుకోవడానికి కేంద్రం అనుమతిని ఇచ్చింది. ఈ మేరకు మంగళవారం కేంద్ర మంత్రిమండలి కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సిసిఇఎ) భేటీ జరిగింది. ఇందులో ప్రైవేటు రంగానికి మైనింగ్ అవకాశం కల్పించే నిర్ణయం తీసుకున్నట్లు బొగ్గు గనులు, రైల్వేల మంత్రి పియూష్ గోయల్ తెలిపారు. 1973లో బొగ్గు రంగం జాతీయాకరణ తరువాత మైనింగ్ ప్రక్రియలో చేపట్టిన భారీ సంస్కరణగా దీనిని భావిస్తున్నారు. ఇప్పటివరకూ ప్రభుత్వ అధీనంలోని కోల్ ఇండియా సంస్థనే జాతీయ బొగ్గు గనుల తవ్వకాల్లో గుత్తాధిపత్యం వహిస్తోంది. ప్రైవేటు రంగానికి కూడా గనుల తవ్వకాలకు అవకాశం ఇవ్వడం తరువాయి 6లో

పోలీసు వసూల్ రాజాలు

- టాస్క్‌ఫోర్స్ పేరుతో మసాజ్ కేంద్రాల నుంచి డబ్బు గుంజుకున్న కానిస్టేబుళ్ల అరెస్టు

మన తెలంగాణ/ హైదరాబాద్ సిటీ బ్యూరో: తాము టాస్క్‌ఫోర్స్ పోలీసులమని డబ్బులు ఇవ్వకపోతే స్పా సెంటర్‌ను సీజ్ చేస్తామని అక్రమ వసూళ్లకు పాల్పడిన ముగ్గురు పోలీసులు, ఒక క్యాబ్ డ్రైవర్‌ను అరెస్టు చేసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. సిసిఎస్ డిసిపి అవినాష్ మహంతి తరువాయి 6లో



ఉమ్మడి సొత్తుపై ఎపి పెత్తనం

- హైదరాబాద్ ఎసి గార్డ్స్‌లోని ఎఫ్‌డిసి భవనాన్ని పాక్షికంగా అమ్మజూపుతున్న ఆంధ్రప్రదేశ్



మన తెలంగాణ / హైదరాబాద్ : రెండు రాష్ట్రాలకు ఉమ్మడిగా ఉన్న నగరంలోని ఎ.సి.గార్డ్స్‌లోగల ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ భవనాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాక్షికంగా తరువాయి 6లో





కుంచెపోటు



కృత్రిమ మేధస్సుకి బ్యాంకుల్ని మోసం చేసే తెలివి ఉంటదా సార్..?

వంద ఎకరాల విస్తీర్ణంలో మాంసం ఎగుమతి కేంద్రం



మన తెలంగాణ/హైదరాబాద్ : విదేశాలకు మాంసం ఎగుమతి చేసేందుకు రాష్ట్రంలో దాదాపు 100 ఎకరాల విస్తీర్ణంలో మాంసం ఎగుమతి కేంద్రాన్ని నెలకొల్పేందుకు లూలూ అంతర్జాతీయ సంస్థ ముందుకొచ్చింది. దుబాయ్‌లో ఈ నెల 18వ తేదీ నుంచి జరుగుతున్న గల్ఫ్‌డ్ –2018 ఫుడ్ ట్రేడ్ షోలో రాష్ట్ర ప్రభుత్వం తరపున పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం లూలూ సంస్థ ప్రతినిధులు సిఇఒ సలీం, కో డైరెక్టర్ విజయ్‌కుమార్‌లతో జరిపిన చర్చల మేరకు ఎగుమతి కేంద్రం నెలకొల్పనకు అంగీకారం కుదరినట్లు మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నగర శివారు ప్రాంతాలలో ఏర్పాటు చేసే ఈ కేంద్రం ద్వారా దాదాపు 800 మందికి ప్రత్యక్షంగా, 5 వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. మన దేశం నుంచి మాంసం, చికెన్, కోడిగుడ్లు, పాల ఉత్పత్తులకు సంబంధించి దాదాపు 100 స్టాళ్లను ఈ షోలో ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. 2017–18లో 420 మెట్రిక్ టన్నుల గొర్రెల మాంసం, 59,800 మెట్రిక్ టన్నుల బఫెల్లో మాంసాన్ని విదేశాలకు ఎగుమతి చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో ఒక మీట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను నెలకొల్పే ఆలోచన ఉన్నదని, పిపిపి పద్ధతిలో ఏర్పాటు చేయడానికి అనేక అవకాశాలు ఉన్నాయన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు

మన తెలంగాణ/ హైదరాబాద్ : ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, సిబ్బంది సమిష్టి కృషితో పని చేయాలని పిసిబి సభ్య కార్యదర్శి పి.సత్యనారాయణ రెడ్డి విజ్ఞప్తి చేశారు. విధి నిర్వహణలో ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. 2017లో టిఎస్ ఐపాస్ అరుదైన గుర్తింపును పిసిబికి అందించిందన్నారు. రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా ఉద్యోగులు, సిబ్బందికి నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి సభ్య కార్యదర్శి మంగళవారం బహుమతులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులుకు మరింత గుర్తింపు రావాలంటే అందరూ సమిష్టి నిర్ణయాలతో మరింత బాధ్యతతో పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.

కస్తూర్బాల్లో 12వ తరగతి!

- **కేంద్రం సూత్రప్రాయ అంగీకారం**
- **రాష్ట్రానికి ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు**
- **కేంద్రమంత్రి జవదేవకర్‌ను కోరిన మంత్రి కడియం**

మన తెలంగాణ/ న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా కస్తూర్బా గాంధీ విద్యాలయాలను 12వ తరగతి వరకు పొడిగించేలా తెలంగాణ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి చేసిన ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. మంగళవారం ఢిల్లీలో కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్‌తో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కేంద్ర మంత్రిని కోరారు. ఈ సమావేశంలో భాగంగా కేబ్ సూచించిన విధంగా దేశ వ్యాప్తంగా బాలికల విద్యాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కడియం శ్రీహరి కేంద్ర మంత్రిని కోరారు. ఎపి విభజన చట్టం లో పొందుపరిచిన విధంగా తెలంగాణ రాష్ట్రానికి ఐఐఎం, ట్రిపుల్ ఐటి, మహిళా విశ్వ విద్యాలయాలను కేటాయించాలని కోరారు. కేంద్ర మంత్రితో సమావేశం అనంతరం రాష్ట్ర రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి మీడియాతో మాట్లాడుతూ.. కెజిబివిను 12వ తరగతి వరకు పెంచేందుకు కేంద్రం సూత్రప్రాయంగా అంగీకరించిందని తెలిపారు. జనవరిలో జరిగిన కెబ్ (సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్) సమావేశంలో బాలికల విద్యాభివృద్ధి, కెజిబివిలపై కేంద్ర మంత్రి నుంచి ఎటువంటి స్పష్టత రాలేదని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రితో సమావేశమై కెజిబివిల ఏర్పాటు ఆవశ్యకతను వివరించామని అన్నారు. కెబ్ కమిటీ సిఫార్సుల మేరకు కెజిబివిలను 12వ తరగతుల వరకు పొడిగించడమే కాకుండా, ఈ ఏడాది నుంచి అమలవుతుందని కేంద్ర మంత్రి స్పష్టంగా తెలిపారని కడియం వెల్లడించారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 8వ తరగతి వరకే కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలను కేంద్రం నిధులిస్తుందని, కానీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 9,10 తరగతులను కూడా కెజిబివిలుగానే గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వమే ఖర్చులు భరిస్తుందని ఆయన వివరించారు. ఈ నెల చివరిన జరిగే కేంద్ర క్యాబినెట్ సమావేశంలో కెజిబివిల సంబంధించిన నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్రతో బాల్య వివాహాలను అరికట్టడానికి, బాలికల డ్రాప్ అవుట్లను తగ్గించడానికి కెజిబివిల పాత్ర కీలకంగా మారుతుందని కడియం ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్‌తో జరిగిన సమావేశంలో భాగంగా, మధ్యాహ్న భోజన పథకాన్ని, స్కూల్ యూనిఫాంలను 12వ తరగతి వరకు పొడిగిస్తే బాగుంటుందని కేంద్ర మంత్రికి సూచించామని తెలిపారు. ఈ మూడు అంశాలను 12వ తరగతి వరకు పొడిగించడం వల్ల పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెరగడమే కాకుండా, బాలికల విద్యాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఒక్కగానొక్క పద్మావతి మహిళా యూనివర్సిటీ విభజనలో ఎపికి వెళ్లిపోయిందని, ఈ నేపథ్యంలో తెలంగాణకు ప్రత్యేకంగా ఒక మహిళా విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఈ మహిళా విశ్వవిద్యాలయ ఏర్పాటుకు ఆర్థిక సాయం, సెంట్రల్ మహిళా విశ్వ విద్యాలయంగా అభివృద్ధి చేసే బాధ్యత కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలని కడియం శ్రీహరి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎపికి ట్రిపుల్ ఐటిని కేటాయించిందని, పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి నిట్, ఐఐఎం, ఐఐఐటి, సెంట్రల్ యూనివర్సిటీ, పెట్రోలియం యూనివర్సిటీ, వ్యవసాయ విశ్వవిద్యాలయం, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లను త్వరగా ఏర్పాటు చేయాలని కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ప్రకాశ్ జవడేకర్‌ను కోరామని కడియం ఉప ముఖ్యమంత్రి తెలిపారు. కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్‌తో జరిగిన సమావేశంలో కడియం శ్రీహరితోపాటు, పార్లమెంటు సభ్యులు సి. మల్లారెడ్డి కూడా ఉన్నారు.



మెట్రో రైలు వేగం పెంపు!

- **ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు కెటిఆర్ ఆదేశం**
- **'సెట్విన్' తరహా సంస్థల ఆధ్వర్యంలో వంద ఎలక్ట్రిక్ బస్సులు!**



మన తెలంగాణ/హైదరాబాద్: మెట్రో రైలు రాకపోకలను మరింత పెంచేందుకు ప్రయత్నించాలని మున్సిపల్ శాఖ మంత్రి కె. తారకరామారావు అధికారులను ఆదేశించారు. సెట్విన్ లాంటి సంస్థల ఆధ్వర్యంలో నూతనంగా వంద ఎలక్ట్రిక్ బస్సులను ఏర్పాటు చేసేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలను తెలుపాలని అధికారులకు సూచించారు. మెట్రో కారిడార్‌లో పార్కింగ్, ఫుట్‌పాత్ రోడ్ల వంటి మౌలిక వసతుల కల్పనను మరింత వేగం పెంచాలన్నారు.మెట్రో టికెటింగ్‌లో మరిన్ని సదుపాయాలను కల్పించాలన్నారు. బేగంపేట మెట్రో రైల్ భవన్‌లో మంగళవారం మెట్రో రైల్ కార్యాకలాపాలపైన మంత్రి కెటిఆర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం జరుగుతున్న పనులు, ప్రయాణికుల స్పందన తదితర అంశాలపై చర్చించారు. త్వరలోనే ఫ్రీక్వెన్సీతో పాటు రైళ్ల వేగాన్ని పెంచడంతో ప్రయాణ సమయం మరింత తగ్గుతుందని మెట్రో రైల్ ఎండి ఎన్‌వి ఎస్.రెడ్డి మంత్రికి వివరించారు. ఇతర మెట్రోలతో పొల్చితే హైదరాబాద్ మెట్రో ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉన్నదని, చెన్నైలాంటి నగరాల్లో రెండు సంవత్సరాల్లో ప్రయాణిస్తున్న సంఖ్యతో పొల్చితే ఇక్కడ ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉన్నదని మంత్రి కెటిఆర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆర్‌టిసితో పాటు ఇతర అంశాలను కూడా సమావేశంలో పరిశీలించాలన్నారు. నగరంలో 12 మల్టీ లెవల్ పార్కింగ్ సదుపాయాలకు సంబంధించిన టెండర్లను ఆహ్వానించ నున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. నాంపల్లి మెట్రో స్టేషన్ వద్ద యుఎల్‌సి సదుపాయానికి వారం పది రోజుల్లో టెండర్లు పూర్తికానున్నాయని, అంతర్జాతీయ ప్రమాణాలను పాటించనున్నట్లు అధికారులు వివరించారు. ఉప్పల్ స్టేడియం నుంచి మెట్రో స్టేషన్ వరకు స్కైవాక్ నిర్మాణానికి స్టేడియం ఆథారిటీ ఆసక్తిచూపిందన్నారు. మెట్రోలో మిగిలిన కారిడార్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. అమీర్‌పేట నుంచి హైటెక్‌సిటి వరకు పనులను వేగంగా నడుస్తున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. మెట్రో రెండవ దశకు ప్రణాళికలపై మంత్రి చర్చించారు. కారిడార్ల ఎంపిక, స్టేషన్ల గుర్తింపు, నిధుల సమీకరణ వంటి అంశాలపైన ఒక నివేదిక సిద్ధం చేయాలని, త్వరలోనే ముఖ్యమంత్రి ఈ అంశంపైన సమీక్షించే అవకాశం ఉన్నదని అధికారులకు తెలిపారు. మెట్రోరైలు ఏర్పాటుకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో నుంచి ఎయిర్‌పోర్ట్‌కు కనెక్టివిటీ ఉండేలా ప్రణాళికలను రూపొందించాలన్నారు. మెట్రోస్టేషన్లతో పాటు ఆయా కారిడార్లలో మూత్రశాలల నిర్మాణాన్ని పనులు వేగంగా జరుగుతున్నాయని, మహిళల కోసం ప్రత్యేకంగా షీ మరుగదొడ్లను నిర్మించాలని మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్, మెట్రోరైల్ ఎండి ఎన్‌వి ఎస్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పురుషోత్తమరెడ్డి కేసులో నయా ట్విస్ట్

- **ఆభరణాల బిల్లులు దొరికాయి.. కాని ఆభరణాలు లేవు**

మన తెలంగాణ/హైదరాబాద్ : హెచ్‌ఎండిఏ ప్లానింగ్ డైరెక్టర్ పురుషోత్తమ రెడ్డి ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసు కొత్త మలుపు తిరిగింది. ఎసిబి సోదాల్లో వజ్రాలు, బంగారు ఆభరణాల కొనుగోలుకు సంబంధించిన బిల్లులు దొరికాయి. అయితే వాటిల్లో పేర్కొన్న వజ్రాలు, ఆభరణాల జాడ మాత్రం ఎసిబి అధికారులకు చిక్కలేదు. దీంతో అవి ఎక్కడున్నాయనేదానిపై ఎసిబి అధికారులు దృష్టి సారించారు. పురుషోత్తమరెడ్డి బంధువు రాధాచరణ్ రెడ్డికి ఏసిబి అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇటీవల ఎసిబి అధికారులు పురుషోత్తమరెడ్డి, అతని కుటుంబ సభ్యులకు చెందిన నాలుగు బ్యాంక్ లాకర్‌లను తెరిచి సోదాలు చేసిన సందర్భంలో వజ్రాలు, బంగారు ఆభరణాలు గణనీయంగానే లభ్యమయ్యాయి.

వీటితో పాటు మరికొన్ని కోట్ల రూపాయల విలువ చేసే బంగారు నగలను కొనుగోలు చేసినట్లు పలు దుకాణాలకు చెందిన పలు రసీదులు బయటపడ్డాయి. కానీ ఈ రసీదుల్లోని వివరాలకు, ఆభరణాలకు పొంతన లేదని అధికారులు అభిప్రాయపడ్డారు. రసీదులో భారీ ఎత్తున ఆభరణాలు ఖరీదు చేసినట్లు ఉన్నా సగం నగలు మాత్రమే దొరికాయని, మిగిలినవి ఎవరి దగ్గర ఉన్నాయనేది తేలలేదు. వాటిని ఎసిబి అధికారులకు అప్పగించాలంటూ రాధాచరణ్‌రెడ్డికి ఇచ్చిన నోటీసులో పోలీసులు పేర్కొన్నారు. రసీదులపై ఉన్న నగల దుకాణ యజమానులను కూడా ఎసిబి అధికారులు విచారించారు. ఆ రసీదులు తమ నగల దుకాణాలకు చెందినవేనని వారు విచారణలో అంగీకరించారు. వజ్రాలు, నగలు రాధాచరణ్‌రెడ్డి వద్దే ఉండి ఉంటాయని ఎసిబి అధికారులు అనుమానిస్తున్నారు. ఇక మరోవైపు ఎసిబి కస్టడీలో ఉన్న పురుషోత్తమరెడ్డి బినామీలు నిశాంత్‌రెడ్డి, యాదవరెడ్డిలను మంగళవారం కూడా విచారించి మరికొన్ని వివరాలను రాబట్టారు. ఇక పురుషోత్తమరెడ్డి కస్టడీ పిటిషన్‌పై నాంపల్లి ఎసిబి ప్రత్యేక న్యాయస్థానం బుధవారం తీర్పు వెలువరించనుంది.

విభజన వివాదాలపై 23న హోంశాఖ సమావేశం

- **హాజరు కానున్న రెండు రాష్ట్రాల సిఎస్‌లు**


మన తెలంగాణ / హైదరాబాద్ : రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదంగా ఉన్న పలు సంస్థల విభజనకు సంబంధించి కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఈ నెల 23వ తేదీన ఢిల్లీలో సమావేశాన్ని ఏర్పాటు చేసింది. రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో పాటు 'వివాదాల పరిష్కార కమిటీ' సభ్యులు, ఢిల్లీలో ఉన్న రెండు రాష్ట్రాల భవన్‌ల రెసిడెంట్ కమిషనర్లు హాజరుకానున్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని తొమ్మిదవ, పదవ షెడ్యూళ్ళలో ఉన్న సంస్థల విభజనతో పాటు 13వ షెడ్యూలులో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై ఈ సమావేశంలో చర్చ జరగనుంది. ఈ నెల 21వ తేదీనే ఈ సమావేశం జరగాల్సి ఉన్నప్పటికీ జాతీయ ఎస్‌సి కమిషన్ తెలంగాణ పర్యటన (21న) కారణంగా సమావేశ తేదీలను వాయిదా వేయాలని తెలంగాణ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి చేసిన విజ్ఞప్తి మేరకు ఈ సమావేశం 23వ తేదీకి వాయిదా పడింది. ఉమ్మడి సంస్థల విభజనకు గతంలో కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఆదేశాలను రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఏ మేరకు అమలుచేశాయి, ఎన్ని సం స్థలు రెండు రాష్ట్రాల మధ్య విభజన అయ్యాయి తదితరాలపై సమీ క్ష జరగనుంది. తాజాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొమ్మిదవ షెడ్యూలులో ఉన్న ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్థిరాస్తులను అమ్మకానికి పెట్టడం కోసం విధి విధానాలను రూపొందించే నిమిత్తం ఎనిమిది సభ్యులతో కమిటీని ఏర్పాటుచేస్తూ ప్రభుత్వ ఉత్తర్వును జారీ చేసిన అంశాన్ని ఈ సమావేశంలో తెలంగాణ ప్రస్తావించనుంది. చట్టానికి విరుద్ధంగా, కేంద్ర హోం శాఖ ఉత్తర్వులకు భిన్నంగా ఏపీ ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడంపై ఈ సమావేశంలో ప్రస్తావించనుంది. దీనికి కొనసాగింపుగా చర్చల ద్వారా సమస్యలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకునే ఉద్దేశంతో, కేంద్ర హోంశాఖ ఉత్తర్వులను అమలుచేయడంలో భాగంగా ఈ నెల 27వ తేదీన రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు హైదరాబాద్‌లో భేటీకానున్నారు.

ఎస్‌సి వర్గీకరణకు అనుకూల చర్యలు!

- **మోడీకి లేఖ రాసిన సురవరం**

మన తెలంగాణ / హైదరాబాద్ : షెడ్యూల్ కులాల (ఎస్‌సి) వర్గీకరణకు అనుకూలంగా వెంటనే చర్యలు తీసుకుని సమాజంలో అత్యంత పేదలైన వారికి న్యాయం చేయాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కోరారు. ఈ మేరకు ఆయన ప్రధాని మోడీకి మంగళవారం ఒక లేఖ రాశారు. ఎస్‌సి వర్గీకరణ అంశం సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉందని, ఇటీవల ఎస్‌సి వర్గీకరణ కోసం ఒక యువకుడు, మరో మహిళా కార్యకర్తలు ప్రాణ త్యాగాలు చేశారని ఆయన లేఖలో తెలిపారు. ఎస్‌సి వర్గీకరణకు రెండు తెలుగు రాష్ట్రాలు మద్దతు ఇవ్వడంతో పాటు ఆ మేరకు శాసనసభల్లో ఏకగ్రీవంగా తీర్మానాలను ఆమోదించాయని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నియమించిన ఉషామెహర కమిషన్ కూడా ఎస్‌సి వర్గీకరణను సిఫారసు చేసిందని తెలిపారు. జాతీయ స్థాయిలో ఎస్‌సి వర్గీకరణ కష్టసాధ్యమైతే రాష్ట్రాలు తమ శాసనసభలలో నిర్ణయాలు తీసుకునే విధంగా అనుమతించాలని ఆయన సూచించారు. ఎస్‌సిలలోని కొన్ని ఉపకులాలకు వారి జనాభా ప్రతిపాదికన రిజ్వేషన్లలో న్యాయమైన వాటా దక్కలేదన్నారు. పంజాబ్‌తో పాటు పలు ఇతర రాష్ట్రాలలో ఎస్‌సి వర్గీకరణ జరిగిందని వివరించారు.

వీధి వ్యాపారులకు వెండింగ్ సర్టిఫికెట్లు



మన తెలంగాణ/ హైదరాబాద్: వీధి వ్యాపారుల చట్టం మేరకు వీధి వ్యాపారులకు తెలంగాణ సర్కార్ 'వెండింగ్ సర్టిఫికేట్లు' జారీ చేయనుంది. ఈ మేరకు తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టుకు తెలంగాణ ప్రభుత్వం కౌంటర్ పిటిషన్ ద్వారా తెలియజేసింది. వీధి వ్యాపారులు ఎక్కడెక్కడ వ్యాపారం చేసుకోవాలో నిర్దేశిస్తూ వెండింగ్ జోన్లను కూడా ప్రభుత్వం నిర్ణయిస్తుంది. హైదరాబాద్ మహానగరంతోపాటు తెలంగాణ అంతటా వీధి వ్యాపారులు 67,313 మంది ఉన్నట్లు ప్రభుత్వం తేల్చింది. వారిలో 63,372 మందికి గుర్తింపు కార్డులు కూడా జారీ చేసింది. మిగిలిన3,941 మందికి కూడా త్వరలోనే గుర్తింపు కార్డులు ఇవ్వనుంది రాష్ట్రంలోని మున్సిపల్ ఏరియాల్లో చట్ట ప్రకారం టౌన్ వెండింగ్ కమిటీలను ఏర్పాటు కూడా చేసింది, హైదరాబాద్ మహానగర్‌లోని 30 సర్కిళ్లు ఉన్న నేపథ్యంలో ఇక్కడ ఇంకా వెండింగ్ కమిటీలను ఏర్పాటు చేయలేదు.. గతంలో 18 సర్కిళ్లు ఉండేవని, వీటికి కమిటీలను ఏర్పాటు జరిగింది. కొత్తగా ఏర్పడిన సర్కిళ్లకు త్వరలోనే కమిటీలను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం వివరించారు. హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని ఇతర మునిసిపల్ కార్పొరేషన్ల పరిధిలో సర్వే పూర్తయిన తరువాత స్ట్రీట్ వెండిం గ్ ప్లాన్‌ను సిద్ధం చేస్తామన్నారు. ఇప్పటి వరకు 66 స్థానిక సంస్థల్లో సర్వే పూర్తయిందని, మిగిలిన చోట్ల త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీధి వ్యాపారుల (జీవనోపాధి పరిరక్షణ, వీధి వ్యాపార నియంత్రణ) చట్టానికి అనుగుణంగా రాష్ట్రం రూపొందించిన స్ట్రీట్ వెండింగ్ స్కీమ్‌ను అమలు చేయడం లేదంటూ జి.గణేశ్ సింగ్ అనే వ్యాపారి గత ఏడాది హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో హైకోర్టు.. వీధి వ్యాపారులకు చెందిన వివరాలు అందజేయాలని గతంలో మున్సిపల్ శాఖను ఆదేశించింది. దాంతో తెలంగాణ పురపాలక శాఖ సంయుక్త కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు వీధి వ్యాపారాలకు సంబంధించిన వివరాలతో కౌంటర్ పిటిషన్ దాఖలు చేశారు. తెలంగాణ స్ట్రీట్ వెండింగ్ స్కీం ప్రకారం వెండింగ్ సర్టిఫికేట్లను డిజైన్ చేశామని, త్వరలో వాటిని వీధి వ్యాపారులకు పంపిణీ చేస్తామని హైకోర్టుకు ప్రభుత్వం విన్నవించింది.

శిశు మరణాల పెరుగుదలపై ఆరా

నిజమో కాదో చెప్పాలని సర్కార్‌కు హైకోర్టు ఆదేశం

మన తెలంగాణ/ హైదరాబాద్: ప్రభుత్వం నిర్వహిస్తున్న శిశు సంరక్షణ గృహాల్లో శిశు మరణాల సంఖ్య గణనీయంగా ఉందనేది నిజమో కాదో చెప్పాలని తెలంగాణ సర్కార్‌ను హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వ నిర్వహణలోని శిశు మందిరాల్లో మరణాలు బాగా ఉన్నాయని, శిశు విక్రయాలు కూడా జరుగుతున్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ బాలల హక్కుల సంఘ ఫౌండర్ ప్రెసిడెంట్ అచ్యుతరావు దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని హైకోర్టు మంగళవారం మరోసారి విచారణ జరిపింది. హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లోనే కాకుండా ఇతర తెలంగాణలో కూడా శిశు మందిరాల్లో పిల్లలు మృతి చెందుతున్నారని పిటిషనర్ లాయర్ చెప్పారు. నల్గొండ జిల్లాల్లోనే ఏడాది కాలంలో 32 మంది మృత్యువాతపడ్డారని, మొత్తం 40 మంది వరకూ చనిపోయారని చెప్పారు. ఇంత మంది పిల్లలు చనిపోయారా.. చనిపోతే అందుకు బాధ్యత వహించాల్సిన అధికారులపై ఏం చర్యలు తీసుకున్నారు.. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని తెలంగాణను హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి కె.విజయలక్ష్మి లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఆదేశించింది. విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.

ప్రభుత్వ భూములపై ప్రైవేటుకు బ్యాంకు రుణాలు

- **మంచిర్యాల జిల్లాలో భూ తణఖా**

మన తెలంగాణ/ హైదరాబాద్: మంచిర్యాల జిల్లాలోని ప్రభుత్వ భూమి రెండు వేల ఎకరాలపై ప్రైవేటు వ్యక్తులు అప్పులు తీసుకున్నారని తెలుసుకున్న హైకోర్టు విస్తుపోయింది. సర్కార్ భూమికి పట్టాలు తీసుకోవడమే కాకుండా బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవడంపై పూర్తి వివరాలు అందజేయాలని తెలంగాణ సర్కార్‌ను హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి కె.విజయలక్ష్మి లతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. భూబాగోతంపై గొల్లపల్లి గ్రామానికి చెందిన ఇందూరి రామ్మోహనరావు హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిని మంగళవారం బెంచ్ విచారణ జరిపింది. గొల్లపల్లి,మైలారం, జోగాపూర్, ఘనాపూర్, ఖర్జీ, పుప్పలవానిపేట,నెన్నెల, మన్నెగూడెం, కమ్మపల్లి గ్రామాల్లో రెండు వేల ఎకరాల భూబాగోతం వెనుక పాలక పెద్దలు, అధికారులు, ప్రజాప్రతినిధుల హస్తం ఉందని పిటిషనర్ లాయర్ చెప్పారు. భూములకు బోగస్ పట్టాలు అందుకుని తెలంగాణ గ్రామీణ బ్యాంకు నుంచి అప్పులు తీసేసుకున్నారని చెప్పారు. దీనిపై పూర్తి విచారణ జరిపి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్‌ను బెంచ్ ఆదేశించింది. విచారణ వచ్చే నెల 27కి వాయిదా పడింది



ముస్లిం రిజర్వేషన్ బిల్లు ఎక్కడుంది? : షబ్బీర్ అలీ

మన తెలంగాణ/హైదరాబాద్: ముస్లిం రిజర్వేషన్ బిల్లును కేంద్రం తిప్పి పంపినట్లు వార్తలు వస్తున్నాయని, ఆ బిల్లు ప్రస్తుతం ఎక్కడ ఉందో చెప్పాలని శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు మహ్మద్ అలీ షబ్బీర్ డిమాండ్ చేశారు. మైనారిటీ సంక్షేమ శాఖ కూడా చూస్తున్న సిఎం కెసిఆర్ దీనిపై స్పష్టత ఇవ్వాలన్నారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది ఏప్రిల్ 16న ముస్లిం, గిరిజనుల రిజర్వేషన్లను పెంచాలని శాసనసభ ఉభయ సభల ప్రత్యేక సమావేశంలో రెండు బిల్లులను ఆమోదించామని, వాటిని పెంచాలని కోరుతూ కేంద్రానికి తీర్మానం పంపామని గుర్తుచేశారు. 10నెలలు గడుస్తున్నా అవి ఎక్కడ ఉన్నాయో తెలియదన్నారు. ఇటీవల ఆ బిల్లు అమలు సాధ్యం కాదని కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ రాష్ట్రానికి తిప్పి పంపినట్లు పత్రికల్లో వార్తలు వస్తున్నాయని చెప్పారు. బిల్లు తిప్పి పంపితే ఢిల్లీకి అఖిల పక్షాన్ని తీసుకెళ్లాలని, జంతర్‌మంతర్‌లో ధర్నా చేస్తామని అసెంబ్లీలో సిఎం ప్రకటన చేశారని గుర్తుచేశారు. దీనిపై కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రధాని అంటే సిఎం ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. 100 సీట్లు వస్తాయని చెబు తున్న టిఆర్‌ఎస్‌కు దమ్ముంటే ఇతర పార్టీల నుంచి చేరిన ఎంఎల్‌ఎలతో రాజీనామా చేయించి సెమీఫైనల్స్‌కు సిద్ధం కావాలని సవాల్ విసిరారు.

డిసిసి అధ్యక్షులకు నో టికెట్

- త్వరలో దాదాపు అన్ని జిల్లాలకు కొత్త అధ్యక్షులు

మన తెలంగాణ/హైదరాబాద్: జిల్లా కాంగ్రెస్ కమిటీ(డిసిసి) అధ్యక్షులుగా పని చేస్తున్నవారికి ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వొద్దనే నిబంధనను వచ్చే సారి కచ్చితంగా పాటించనున్నారు. ఈ విషయంపై కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్‌గాంధీ పట్టుదలతో ఉన్నారు. వాస్తవానికి ఈ నిబంధన ఎప్పుడూ ఉన్నప్పటికీ పెద్దగా అమలు కావడం లేదు. వచ్చే ఎన్నికల్లో మాత్రం తప్పనిసరిగా పాటించాలని పిసిసి అధ్యక్షులందరికీ ఏఐసిసి నుంచి మార్గదర్శకాలు అందాయి. ఈ నిబంధన కారణంగానే డిసిసి అధ్యక్షులందరినీ దాదాపుగా మార్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఉమ్మడి పది జిల్లాలకు డిసిసి అధ్యక్షులు ఉన్నారు. అందులో ఖమ్మం మినహా తొమ్మిది జిల్లాల అధ్యక్షులు గతంలో ఎంఎల్‌ఏగా గెలిచినవారో, టిక్కెట్ ఆశిస్తున్నవారో ఎక్కువగా ఉన్నారు. గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా పని చేసిన మాజీ మంత్రి దానం నాగేందర్, మెదక్ డిసిసి అధ్యక్షురాలు, మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి, ఆదిలాబాద్ డిసిసి అధ్యక్షుడు, నిర్మల్ మాజీ ఎంఎల్‌ఏ మహేశ్వర్‌రెడ్డి, నల్లగొండ డిసిసి అధ్యక్షుడు, ఆలేరు మాజీ ఎంఎల్‌ఏ బూడిద భిక్షమయ్య గౌడ్‌లు తమ పాత నియోజకవర్గాల నుంచి బరిలో దిగేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇక రంగారెడ్డి డిసిసి అధ్యక్షుడు క్యామ మల్లేశ్ ఇబ్రహీంపట్నం, మహబూబ్‌నగర్ డిసిసి అధ్యక్షుడు ఒబేదుల్లా మహబూబ్‌నగర్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. వీరు అవే స్థానాల నుంచి టిక్కెట్ ఆశిస్తున్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు కూడా 31జిల్లాలకు కాకుండా పాత జిల్లాలకే డిసిసిలనే కొనసాగించనున్నారు. కరీంనగర్ డిసిసి అధ్యక్షుడు, మాజీ ఎంఎల్‌ఏ మృత్యుంజయం కూడా పోటీకి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. వరంగల్ డిసిసి అధ్యక్షులు నాయిని రాజేందర్‌రెడ్డి వరంగల్ ఈస్ట్, నిజామాబాద్ డిసిసి అధ్యక్షులు తాహెర్ బిన్ అహ్మద్ బోధన టికెట్‌ను ఆశిస్తున్నారు. ఖమ్మం జిల్లా డిసిసి ఎ.సత్యం ఒక్కరే పోటీకి దూరంగా ఉన్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. దీంతో మొత్తం తొమ్మిది జిల్లా కమిటీలకు అతి త్వరలో కొత్త అధ్యక్షులను రాబోతున్నారు. పోటీకి దూరంగా ఉండే డిసిసి అధ్యక్షులకు ఎంఎల్‌సి, రాజ్యసభ స్థానాల్లో సర్దుబాటు చేయాలని పార్టీ భావిస్తోంది. డిసిసి అధ్యక్షులను ఇకపై కేవలం సంస్థాగత నిర్మాణానికే వినియోగించుకోనున్నారు.

ఏఐసిసి సభ్యులుగా యువకులకు అవకాశం: ఏఐసిసి సభ్యులుగా ఈ సారి యువకులకు అవకాశం ఇవ్వనున్నారు. ప్రతి లోక్‌సభ నియోజకవర్గం పరిధి నుంచి ఇద్దరు చొప్పున ఏఐసిసి సభ్యులను ఎన్నుకుంటారు. పార్టీ జాతీయ అధ్యక్షుని ఎన్నికల్లో వీరికి ఓటు హక్కు ఉంటుంది. సాధారణంగా ఎప్పుడూ సీనియర్లే ఏఐసిసి సభ్యులుగా ఎన్నికవుతుంటారు. ఈసారి మాత్రం యువకుల శాతాన్ని పెంచాలని రాహుల్‌గాంధీ భావిస్తున్నారు. రాష్ట్రంలో కూడా సమర్థులైన యువకులను ఎంపిక చేసేందుకు కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా బుధవారం హైదరాబాద్‌కు రానున్నారు.

పోలీసు యూనిఫాం అలవెన్స్ పెంపు



మన తెలంగాణ /హైదరాబాద్: పోలీసులకు వరస హామీలను నెరవేరుస్తున్న ముఖ్య మంత్రి కెసిఆర్ పోలీసుల యూనిఫామ్ అల వెన్స్‌ను పెంచారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభు త్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పోలీసుల యూనిఫామ్ అలవెన్స్ పెంచాలంటూ డిజిపి ఎం. మహేందర్‌రెడ్డి గతంలో సిఎం దృష్టికి తీసుకెళ్లారు. సిఎం కూడా సానుకూలంగా స్పందించారు. దీం తో పోలీసుల యూనిఫామ్ అలవెన్స్ రూ.3500 నుంచి రూ.7500కు పెరిగినట్లయ్యింది. ప్రతి ఏడాది మార్చి నెల వేతనంతో పాటు యూని ఫాం అలవెన్స్ ఇస్తారు. పోలీసులను ప్రజలకు అందుబాటులో ఉంచ డంతో పాటు సిబ్బంది సంక్షేమంపై సిఎం, డిజిపిలు ప్రత్యేక శ్రద్ధ తీసు కుంటున్నందుకు పోలీసు అధికారుల సంఘం కృతజ్ఞతలు తెలిపింది.

కార్యదర్శులపై పని భారం

- **8684 పంచాయతీలకు 2092 మంది కార్యదర్శులు**

మన తెలంగాణ/హైదరాబాద్: పంచాయతీ కార్యదర్శులు పనిభారంతో సతమతమవుతున్నారు. ఇప్పటికే రెండు మూడు పంచాయతీల బాధ్యతలను చూస్తున్న ఈ కార్యదర్శులకు కొత్త పంచాయతీల గుబులు పట్టుకుంది. ప్రతి గ్రామపంచాయతీకి ఒక కార్యదర్శి ఉండాలనే నిబంధన ఉన్నప్పటికీ ప్రస్తుతం రాష్ట్రంలోని 8684 గ్రామపంచాయతీలకు 2092 మంది మాత్రమే పనిచేస్తున్నారు. పంచాయతీల జనాభా, రాబడి, వైశాల్యం ఆధారంగా రెండు, మూడు, పంచాయతీలను కలిపి ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసి ప్రతి క్లస్టర్‌కు ఒక కార్యదర్శిని నియమించాలని 15 ఏళ్ల క్రితం నిర్ణయించిన ప్రభుత్వం మొత్తం 5580 క్లస్టర్లను ఏర్పాటు చేసింది. కానీ 5065 కార్యదర్శి పోస్టులను మాత్రమే మంజూరు చేసింది. కేవలం 3519 మంది కార్యదర్శులను మాత్రమే నియమించింది. మంజూరు చేసిన పోస్టుల్లో ఇంకా 1546 కార్యదర్శుల పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. పనిచేస్తున్నన్న వారికే చుట్టుపక్కల క్లస్టర్ల అదనపు భాధ్యతలు అప్పగించింది. రాష్ట్ర ప్రభుత్వం దాదాపు నాలుగువేల కొత్త పంచాయతీలను ఏర్పాటు చేయనున్నట్లు వార్తలు వస్తుండడంతో మొత్తం గ్రామ పంచాయతీల సంఖ్య దాదాపు 13వేలకు చేరుకుంటుందని, ఖాళీలను భర్తీ చేయకుండా ఇప్పుడున్నవారితోనే పనులు చేయించాలంటే పనిభారం మరింత పెరుగుతుందని ఆందోళనపడుతున్నారు. కొత్త పంచాయతీల ఏర్పాటుపై దృష్టిపెట్టిన ప్రభుత్వం కార్యదర్శుల నియామకపు అంశంపై కూడా ఆలోచన చేయాలని కార్యదర్శులు అభిప్రాయపడుతున్నారు. కొత్త పంచాయతీలను కూడా క్లస్టర్లుగా ఏర్పాటు చేసి ఇప్పుడున్న వారికే అదనపు బాధ్యతలు అప్పగిస్తారని పంచాయతీరాజ్ అధికారి ఒకరు వ్యాఖ్యానించడంతో వారికి భయం పట్టుకుంది.

కక్ష సాధింపు చర్యలపై చర్చిద్దాం

మన తెలంగాణ/హైదరాబాద్: టిడిపి నాయకులపై టిఆర్ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న కక్ష సాధింపు చర్యలపై ఈ నెల 28న ఏపి సిఎం చంద్రబాబు సమక్షంలో చర్చించాలని నిర్ణయించినట్లు టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. రమణ తెలిపారు. ఎన్‌టిఆర్ భవన్‌లో మంగళవారం అందుబాటులో ఉన్న ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె పల్లెకు తెలుగుదేశం పార్టీ, శిక్షణ తరగతుల నిర్వహణ, భవిష్యత్‌లో పార్టీ తీసుకోవాల్సిన కార్యక్రమాలను చంద్రబాబుతో చర్చించాలని తీర్మానించారు.

పట్టణ భూ ప్రక్షాళనపై త్వరలో నిర్ణయం

మన తెలంగాణ/హైదరాబాద్: వ్యవసాయ భూముల రికార్డుల ప్రక్షాళనను పూర్తిచేసిన ప్రభుత్వానికి కేంద్రం నుంచి, వివిధ రాష్ట్రాల నుంచి ప్రశంసలు వస్తున్న నేపథ్యంలో పట్టణ ప్రాంతాల్లోని భూ రికార్డుల ప్రక్షాళనపై కూడా అధికారులు ఆలోచనలు చేస్తున్నారు. ప్రభుత్వం ఇంకా స్పష్టమైన విధాన నిర్ణయం తీసుకోకపోయినప్పటికీ సమీప భవిష్యత్తులో తప్పకుండా ఇలాంటి కార్యక్రమం ఉండవచ్చని రెవిన్యూశాఖ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. తొలుత వ్యవసాయ భూములకు సంబంధించిన రికార్డులపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని, దాదాపు 93% మేర రికార్డులను క్లియర్ చేశామని, దానికి అనుగుణంగా ఆన్‌లైన్ విధానంలో 'ధరణి' వెబ్‌సైట్‌లో నమోదు చేయడం, పట్టా పాస్‌బుక్‌లను పంపిణీ చేయడం, రైతు పెట్టుబడి పథకం కింద చెక్కుల పంపిణీ పనులన్నీ పూర్తి చేసిన తర్వాతే పట్టణ భూ రికార్డులపై కేంద్రీకరించే అవకాశముందన్నారు.

ఆపద్బాంధవులు

రైతుల కష్టాలను చూసి చలించిన ప్రవాసీయులు



- జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కుమ్మరిపల్లి గ్రామాన్ని దత్తత తీసుకొని సాయం
- పెట్టుబడులకు వడ్డీలేని రుణాలు



మన తెలంగాణ/రాయికల్:

రైతులకు బ్యాంకులో పంట రుణం కావాలంటే అధికారులు ఎన్నో ఇబ్బందులు పెడుతారు. ఈ అవస్థలను దగ్గరుండి చూసిన ప్రవాసీయులు తమ సంపాదనలో కొంత పేద రైతులకు సాయం చేసేందుకు ముందుకొచ్చారు. గల్ఫ్‌లో తెలుగు రాష్ట్రాలకు చెందిన 15మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు రైతు బాంధవి సంస్థను స్థాపించారు. మొదటి ప్రయత్నంగా జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కుమ్మరిపెల్లి గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. మొదటి ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 15మంది పేద రైతులకు రూ.10వేల చొప్పున సాయం అందించారు. రబీ సీజన్‌లోనూ మరి కొందరికి సాయం చేసి అన్నదాతల పాలిట అపద్బాంధవులయ్యారు. ఇలా కుమ్మరిపెల్లి గ్రామం తర్వాత ఏడాదికో గ్రామాన్ని దత్తత తీసుకోవాలని నిర్ణయించినట్లు చెప్పారు.

పెట్టుబడికి సాయం..

అప్పులు తీర్చలేక తనువులు చాలిస్తున్న రైతుల వ్యథలను చూసి తమకు అందుబాటులో ఉంటున్న రాయికల్ పాత్రికేయుడు నాగమల్ల శ్రీకర్‌తో చర్చించారు. అందుకు తమ గ్రామ రైతులు పడుతున్న అవస్థలను వివరించగానే స్పందించిన సభ్యులు కుమ్మరిపెల్లి గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆ వెంటనే పేద రైతుల జాబితాను తయారు చేయాలని కోరగానే గ్రామానికి చెందిన యువకులతో సర్వే జరిపించి 15మంది పేద రైతుల జాబితాను అందజేశారు. గ్రామంలో పేదరికంలో ఉండి వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులకు పెట్టుబడి సాయం వడ్డీ లేకుండా అందించేందుకు ముందుకొచ్చారు. 15మంది రైతులను దత్తత తీసుకొని వారి సాగుకు పెట్టుబడి కోసం రూ.10వేల వంతున సాయం చేశారు.

రైతులే కమిటీగా సాయం..

గ్రామాన్ని దత్తత తీసుకున్న తర్వాత రైతులతో కమిటీ ఏర్పాటు వేస్తారు. ఆ కమిటీ తీర్మానం ప్రకారం ప్రవాసాంధ్రులు ఒక్కో రైతుకు రూ.10వేలు పెట్టుబడికి సాయం అందిస్తారు. ఇలా మొదటి విడతలో 15 మందికి అందించారు. ఇలా సాయం పొందిన రైతులు వ్యవసాయం చేసి పంట ధాన్యం విక్రయించిన తర్వాత ఆ మొత్తాన్ని వడ్డీ లేకుండా కమిటీకి చెల్లించాలి. ఇలా చెల్లించి డబ్బులను కమిటీలో జమ చేసి మరి కొందరు రైతులకు సాయంగా అందిస్తారు.

రైతుల నిజాయితీకి ప్రశంస..

ఖరీఫ్ సీజన్‌లో 15మందికి రూ.10 వేల వంతున రూ.1లక్ష50 వేలు సాయం అందజేశారు. 14మంది రైతులకు ఆశించిన స్థాయిలో పంట లాభాలు రాకపోయినా నిజాయితీగా రైతులంతా తమకు అందించిన రూ.1లక్ష40 వేలను చెల్లించారు. రైతుల నిజాయితీని ప్రశంసించిన రైతు బాంధవి సభ్యులు కమిటీ తీర్మానం మేరకు మరికొందరికి సాయం అందించారు. రబీ రైతులకు మరింత సాయం చేయాలని నిర్ణయించిన సంస్థ వరంగల్‌కు చెందిన ప్రవాసీ శ్రీనివాస్ గ్రామానికి పంపింది. పంట మార్పిడి విధానాన్ని పాటించాలని, కూరగాయల సాగు మేలని చెప్పి శ్రీనివాస్ రైతుల్లో చైతన్యం నింపారు.

పంట నష్టపోతే అప్పు రద్దు..

ప్రవాసాంధ్రుల ద్వారా పెట్టుబడి సాయం పొందిన రైతు పంట నష్టపోతే రైతు కమిటీ సభ్యులు తీర్మానం చేసి అప్పు రద్దు చేస్తారు. మళ్లీ సాగుకు యథావిధిగా సాయం అందిస్తారు. ఖరీఫ్‌లో వరి పంటకు దోమపోటు వ్యాపించి నష్టం జరిగిన లక్ష్మయ్య అనే రైతు రుణాన్ని మాఫీచేసి రబీ సాగుకు సాయం అందించారు.

బ్యాంకు రుణమియ్యలె..



మాకున్న భూమికి పంట రుణం కావాలని బ్యాంకుకి పోతే సార్లు తిప్పలు వెట్టిన్రు. రుణం రాక వ్యవసాయం మాని కూలీ పనులకు పోయిన. దుబాయిలో ఉండే కొందరు సార్లు పెట్టుబడి సాయానికి ముందుకొచ్చిన్రు. కూలీ మాని మళ్లీ సాగు మొదలువెట్టిన. వడ్డీలేని రుణంతో అండ లభించింది.

– మ్యాదరవేని కొమురవ్వ, మహిళా రైతు

అండగా నిలిచిన్రు..



వ్యవసాయం చేయాలని ఉన్నా సమయానికి డబ్బు అందక ఇన్నిరోజులు ఇబ్బంది పడేవాళ్లం. ప్రవాసంధ్రులు ముందుకొచ్చి మాకు వడ్డీ లేని రుణమిచ్చి అండగా నిలిచిన్రు. సాయం చేయడం, ఎప్పటికప్పుడు మా పంటల గూర్చి తెలుసుకోవడం మంచిగా అనిపిస్తంది.

– అచ్చ భూమరాజం

రైతు కష్టాలు తీర్చాలని..



మా సంస్థలోని సభ్యులంతా రైతు బిడ్డలే. మాకు ఆ కష్టాలు తెలుసు. అందుకే 'రైతు బాంధవి' స్థాపించి రైతులకు వడ్డీలేని రుణాలిచ్చేందుకు తీర్మానించాం. భూమి ఉండి సాగుకు పెట్టుబడి లేని రైతులను గుర్తించి సాయం చేస్తున్నాం. పంట పండక రైతు ఇబ్బందిలో ఉంటే ఇచ్చిన రుణాన్ని మాఫీ చేస్తున్నాం.

– రాజా శ్రీనివాస్‌రావు, రైతు బాంధవి సంస్థ నిర్వాహకుడు

ప్రాజెక్టులను అడ్డుకోవడమెందుకు?

- తెలంగాణ కూడా దేశంలో భాగమే
- ఎపికి కేంద్ర మంత్రి చురక



మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ ప్రాజెక్టులపై ఎపి చేస్తున్న ఫిర్యాదులపై కేంద్ర మంత్రి విస్మయం వ్యక్తం చేశారు. 'తెలంగాణలో సాగునీటి వసతి పెరిగితే అది దేశానికే మంచిది. పాకిస్తాన్‌కు కాదు కదా!' అని ఆంధ్రప్రదేశ్‌కి కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘూవాల్ చురకలు అంటించారు. ఆర్డీఎస్ ఆధునీకరణ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని మేఘూవాల్ ఆంధ్రప్రదేశ్‌కు సూచించారు. దక్షిణాది ప్రాంతీయ సదస్సులో వివిధ రాష్ట్రాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్న సందర్భంగా కేంద్ర మంత్రి పై విధంగా వ్యాఖ్యానించారు. కృష్ణా నది నీరు తమకు ఏనాడూ రెండున్నర టిఎంసిలు మించి రాలేదని తమిళనాడు ప్రతినిధులు దక్షిణాది రాష్ట్రాల ఇరిగేషన్ ప్రాంతీయ సదస్సులో వ్యాఖ్యానించారు. దీనిపై తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి జోక్యం చేసుకుని మహారాష్ట్ర, కర్ణాటకల్లాగే, తెలంగాణ తన వాటాను అందిస్తోందని, శ్రీశైలం నుంచి విడుదలైన నీరు చెన్నైకి చేరకుండా మధ్యలో ఎటు పోతోందని ప్రశ్నించారు. ఎపి అక్రమంగా వాడుకుంటోందని పరోక్షంగా ప్రస్తావించారు. ఆవిరి నష్టానికి తోడు, అక్రమ వాడకంతో నీరు చెన్నై వరకూ చేరడం లేదని, 320 కిలోమీటర్ల మేర ఉన్న కెనాల్‌లో మధ్యలో కొన్నిచోట్ల అ కౌంటింగ్ చేయాలని ప్రతిపాదించారు. తెలంగాణ వ్యతిరేక వైఖరిని ప్రదర్శించిన ఆంధ్రప్రదేశ్ కృష్ణా బేసిన్‌లో అనుమతి లేకుండా భారీ ప్రాజెక్టులు నిర్మాణమవుతున్నాయని (తెలంగాణ ప్రతిపాదించిన తుమ్మిళ్ళ ప్రాజెక్టును పరోక్షంగా ప్రస్తావిస్తూ) ఆ రాష్ట్ర ఇరిగేషన్ సలహాదారు రామకృష్ణ సమావేశంలో ఆరోపించారు. కృష్ణా జలాల్లో కేటాయింపు ఉన్న 299 టిఎంసిలకు అదనంగా మరో 260 టిఎంసిల నీటిని వాడుకునేందుకు తెలంగాణ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ ఆరోపణలను తెలంగాణ చీఫ్ సెక్రెటరీ ఎస్‌కె జోషి తిప్పికొట్టారు. ఎపి చేస్తున్నది నిరాధారమైన ఆరోపణలని, ఆర్‌డిఎస్ ఆధునీకరణ విషయంలోనూ ఇదే ధోరణి అవలంబిస్తోందని అన్నారు. తుమ్మిళ్ల లిఫ్టు పథకంతో రాయలసీమకు నష్టం జరుగుతుందని ఎపి సలహాదారు రామకృష్ణ చేసిన ఫిర్యాదును మంత్రి హరీశ్‌రావు ఖండించారు. ఆర్‌డిఎస్ ద్వారా 87,000 ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉండగా, ఏనాడూ 20 వేల ఎకరాలకు కూడా అందలేదని, బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 15.90 టిఎంసిలకు మించి ఒక్క చుక్కను కూడా ఆర్‌డిఎస్‌లో అదనంగా వాడు కోబోమని హామీనిచ్చారు. ఆర్‌డిఎస్ ఆనకట్ట ఎత్తు పెంచితే సుంకేశుల ఆయకట్టుకు నష్టం వాటిల్లుతుందంటూ ఎపి ఆరోపిస్తోందిగానీ, ఆనకట్ట ఎత్తు ఒక అడుగు పెంచాలని నిపుణుల కమిటీ సిఫారసు చేసినా కేవలం 6 ఇంచులు మాత్రమే పెంచడానికి టెండర్లు పిలిచినట్లు మంత్రి గుర్తుచేశారు. పనులు చేపట్టిన ప్రతిసారి ఎపి శాంతిభద్రతల సమస్యలను సృష్టించి పనులు ఆపుతోందని, నదీ జలాల విషయంలో 'రూల్ ఆఫ్ లా' అమలు చేయాలని సిఎస్ ఎస్‌కె జోషి వ్యాఖ్యానించారు. దీనికి కేంద్ర మంత్రి మెఘూవాల్ కూడా మద్దతు తెలిపారు. ఆల్మట్టి ఎత్తు పెంచితే కృష్ణా నదిలో దిగువ రాష్ట్రాలకు నీటి కొరత తప్పదని, కలహాలు తప్పవన్నారు. వీటిని పరిష్కరించడానికి హిమాలయాల నుంచి నదీ ప్రవాహాలను గోదావరికి మళ్లించడమొక్కటే మార్గమని హరీశ్‌రావు స్పష్టం చేశారు. 938 టిఎంసిల నీటిని గోదావరి లింకు చేయడం వల్ల దక్షిణాది వాటర్ గ్రిడ్‌ను బలోపేతం చేయవచ్చన్నారు. కృష్ణా బేసిన్‌లో భవిష్యత్తు నీటి కొరతకు శాశ్వత పరిష్కారం వస్తుందన్నారు. మిషన్ కాకతీయను పాండిచ్చేరి మంత్రి కృష్ణారావు ప్రశంసించారు. ఇదేవిధంగా పాండిచ్చేరిలో ఉన్న చెరువుల్లో పూడిక తీస్తామని కేంద్రం నిధులిచ్చి సహకరించాలని కోరారు.

తమిళనాడు కోసమే తెరపైకి అకినేపల్లి

మన తెలంగాణ/హైదరాబాద్: అకినేపల్లి నుంచి గోదావరి నీటి తరలింపులో తమిళనాడుపై కేంద్రం ప్రేమ కనబరుస్తోంది. దక్షిణాది రాష్ట్రాల ఇరిగేషన్ మంత్రుల సదస్సులోనే ఈ రాష్ట్రాలతో కమిట్‌మెంట్ తీసుకోవాలని కేంద్రం ముందస్తుగా వ్యూహం రూపొందించి రాష్ట్రానికి పంపించింది. కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ సూచనలతోనే ఎంఒయు ముసాయిదాను రాష్ట్రానికి పంపినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అయితే ఇందులోని లోగుట్టును ముందుగానే మంత్రి హరీశ్‌రావు, సిఎస్ ఎస్‌కె జోషి పసిగట్టి కేంద్రం ఆలోచనలను మొదట్లోనే గండికొట్టారు. సమావేశంలో మంత్రి హరీశ్‌రావు సమర్థవంతంగా, సాధికారికంగా చేసిన వాదనతో అంతా ముగ్ధులైపోయారని సమాచారం. రాష్ట్ర ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలకు కావాల్సిన 1,500 టిఎంసిల నీళ్లు ఇచ్చాక, మిగిలిన నీటిని నదుల అనుసంధానం పద్ధతిలో తరలించాలని వాదించారు. గోదావరిలో నీటి లభ్యతపై ఉన్న అనుమానాలను, ఒడిశా, చత్తీస్‌గఢ్‌లలో చేపడుతున్న ప్రాజెక్టులు, మళ్లిస్తున్న నీళ్లు, ఆయా రాష్ట్రాల్లో తగ్గుతున్న అటవీ విస్తీర్ణంపై హరీశ్‌రావు ఈ సమావేశంలో వివరించారు. మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఉన్న దట్టమైన అడవుల కారణంగానే ప్రాణహిత, ఇంద్రావతిలో నీళ్లు ఉన్నాయని, అవి మినహాయిస్తే గోదావరిలో ఎక్కడా నీరే లేదన్నారు. హైడ్రాలజీ పరీక్షలు చేసి, శాస్త్రీయంగా గోదావరిలో ఉన్న నీళ్లు, ఆయా ప్రాంతా ల డిమాండ్ ఎంత, వాడకం ఎంత, మిగులెంత తేల్చాలని కేంద్రానికి మంత్రి హరీశ్‌రావు ప్రతిపాదించారు. ఆల్మట్టి ఎత్తు పెంచితే భవిష్యత్తులో కృష్ణా బేసిన్‌కు నీరు రాదన్న ఆందోళనను వెలిబుచ్చారు.

డాటా సైన్స్ రంగాల్లో ఉపాధి అవకాశాలు

- ఐటి శాఖ మంత్రి కెటిఆర్
- రాష్ట్ర ప్రభుత్వంతో నాస్కామ్ ఒప్పందం



మన తెలంగాణ/హైదరాబాద్: డాటా సైన్స్, కృత్రిమ మేధస్సు రంగాల్లో విస్తృత ఉపాధి అవకాశాలు ఉంటాయని రాష్ట్ర ఐటి శాఖ మంత్రి కె. తారకరామారావు అన్నారు. తెలంగాణ రాష్ట్రం అన్ని అవకాశాలను అందిపుచ్చుకుని ముందుకెళ్తోందని తెలిపారు. ప్రపంచ ఐటి సదస్సులో మంగళవారం భాగస్వామ్య పద్ధతిలో డాటా సైన్స్, కృత్రిమ మేధస్సు అంశాలపై సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో నాస్కామ్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మంత్రి కెటిఆర్ సమక్షంలో రాష్ట్ర ఐటి శాఖ కార్యదర్శి జయేష్ రంజన్, నాస్కామ్ అధ్యక్షులు ఆర్.చంద్రశేఖర్ అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కె.తారకరామారావు మాట్లాడారు. ప్రాథమికంగా రూ.40 కోట్ల పెట్టుబడితో డాటా సైన్స్, కృత్రిమ మేధస్సు అంశాలపై సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.ఈ సెంటర్‌ను ముందుగా ఐఐఐటిలో ప్రారంభించి, తర్వాత ఏర్పాటు చేయనున్న డాటా అనలైటిక్ పార్క్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. డాటా సైన్స్, కృత్రిమ మేధస్సు రంగంలో 2025 నాటికి 16 మిలియన్ డాలర్ల వ్యాపార అవకాశాలు రాబోతున్నాయని, కొత్తగా 1.50 లక్షల ఉద్యోగాలు సృష్టించబడతాయని ఒక అంచనా ఉందన్నారు. ఈ రంగంలో అవకాశాలు అందింపుచ్చుకోవాలంటే ఇప్పటి నుంచే దానికి సన్నద్ధం కావాల్సి ఉంటుందని, ఆ క్రమంలో ఈ ఒప్పందం మంచి ముందడుగు అని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయం, శాంతి భద్రతల అదుపుకు డాటా సైన్సెస్‌ను విస్తృతంగా ఉపయోగించుకునే అవకాశం ఉందని తెలిపారు. వ్యవసాయ రంగంలో పంటకు చీటపడితే దానికి వెంటనే పరిష్కారం కనుక్కొనేందుకు డాటా సైన్స్‌ను ఉపయోగించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అన్ని రంగాలతో డాటా సైన్స్ ముడిపడి ఉందని చెప్పారు. ఇది తెలంగాణ రాష్ట్రానికి, దేశానికి వరప్రదాయినిగా మారుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రపంచ ఐటి కాంగ్రెస్ నిర్వహణలో నాస్కామ్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ సందర్భంగా నాస్కామ్‌కు మంత్రి కెటిఆర్ ధన్యవాదాలు తెలిపారు.

ఒంటరి మహిళలే టార్గెట్

- 20 మందితో రంగస్వామి రాసలీలలు




మన తెలంగాణ/హైదరాబాద్: ఒంటరి మహిళలే అతడి టార్గెట్. మాయ మాటలు చెప్పి, లొంగదీసు కొని ఆ తర్వాత మోసం చాటేస్తాడు. ఇలా ఒక్కరు కా దు.. ఇద్దరు కాదు ఏకంగా 20మంది మహిళలు ఈ కామంధుడి చేతిలో మోసపోయారు. వివరాల్లో కి వెళ్తే.. హైదరాబాద్‌లో నివాసముంటున్న రంగస్వామి (అలియాస్ రసలీలల రంగస్వామి) ఫేస్‌బుక్ ద్వారా భర్తను వదిలేసిన మహిళలు, వితంతువులను పరిచయం చేసుకుంటాడు. ఈ క్రమంలోనే లాలాగూడకు చెందిన ఓ ఈవెంట్ ఎగ్జిక్యూటివ్‌ను పరిచ యం చేసుకొని, ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా దగ్గర య్యాడు. కొన్ని రోజులు వివాహేతర సంబంధం కొనసాగించి, రెపోమాపో పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమె వద్ద నుంచి రూ.3 లక్షలు తీసుకున్నాడు. నెలలు గడుస్తున్నా పెళ్లి ఊసు ఎత్తకపోవడంతో సదరు మహిళకు రంగస్వామిపై అనుమానం వచ్చింది. 10 రోజుల క్రితం ఇంటికి వచ్చిన అతడిని నిలదీసింది. అంతే అప్పటి నుంచి అతడు ముఖం చాటేసాడు. సెల్ నెంబర్‌ను కూడా మార్చేశాడు. దీంతో బాధితురాలు లాలాగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనపై కేసు నమోదైన విషయం తెలుసుకున్న రంగస్వామి పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. రాచకొండ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఒటి) పోలీసులు రంగస్వామిని మంగళవారం చాకచక్యంగా పట్టుకున్నారు. విచారణలో అతడు సుమారు 20మంది మహిళలను ఇదే విధంగా మోసగించి వారితో రాసలీలలు నడిపించాడని తేలింది. రంగస్వామిపై కుషాయిగూడ పోలీసు స్టేషన్‌లో చైన్ స్నాచింగ్, అత్యాచారయత్నం, బెదిరింపుల కేసులు గతంలో నమోదయ్యాయి. కొన్ని కేసుల్లో శిక్షపడి చర్లపల్లి జైలు నుంచి 2014లో విడుదలయ్యాడు. నాచారం పోలీసు స్టేషన్ పరిధిలో గతంలో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడు. రంగస్వామిని లాలాగూడ పోలీసులకు అప్పగించేందుకు ఎస్ఒటి పోలీసులు సిద్ధమవుతున్నారు.



"ఆసక్తి పరిశోధనకు దారితీస్తుంది. జ్ఞానం సత్యాన్ని వెలికితీస్తుంది. – వుడ్‌వర్త్"

ఎలుకలను ఏరివేయటమే మార్గం



సంపాదకీయం

ఇంట్లో ఎలుకలున్నాయని ఇల్లు తగలబెట్టుకుంటామా లేక ఎలుకల్ని ఏరివేస్తామా? ఇంగితజ్ఞానం ఉన్నవారెవరైనా రెండో మార్గం ఎంచుకుంటారు. నీరవ్‌మోడీ అనే అంతర్జాతీయ వజ్రాల వ్యాపారి పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను రూ.11,500 కోట్లకు దగా చేశాక, మెహుల్ చోక్సీ అనే మరో వ్యాపారి రూ. 4882 కోట్లకు అదే బ్యాంకుకు కుచ్చుటోపీ పెట్టినట్లు వెల్లడైంది. కాగా కాన్పూర్‌కు చెందిన రోటోమాక్ పెన్నుల ఉత్పత్తిదారు విక్రం కొఠారి ఐదు ప్రభుత్వ రంగ బ్యాంకుల కన్సార్టియం నుంచి రూ.2919.39 కోట్లు రుణం తీసుకుని చెల్లించనందున అది రూ.3695 కోట్లకు చేరినట్లు వార్త వచ్చింది. మోడీ, చోక్సీ కుటుంబాలు దేశంనుంచి పరారు కాగా, తాను వ్యాపారం నిమిత్తం విదేశాలకు వెళ్లినట్లు కొఠారి ధృవీకరించారు. చోక్సీ నీరవ్‌మోడీకి పిల్లనిచ్చిన మామ. ఆయనదీ వజ్రాల వ్యాపారమే. హైదరాబాద్ శివారు రావిరాలలోని రాజీవ్ జెమ్స్ పార్క్ ఎస్ఇజడ్‌లో చోక్సీ గీతాంజలి గ్రూపుకు 2007లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 95ఎకరాలు కేటాయించినట్లు, అతడు ఆ భూమిని ఎల్ఐసికి తాకట్టుపెట్టి రూ. 120 కోట్లు రుణం తీసుకున్నట్లు సమాచారం. ప్రధానంగా కార్పొరేట్‌సంస్థలు బ్యాంకులకు ఎగనామం పెట్టిన దాదాపు 8–10లక్షల కోట్ల రూపాయలు కూడా పాక్షికంగా స్కాంలే. బడా వ్యాపారులు, బ్యాంక్ ఉన్నతాధికారుల్లో కొందరు, కొంతమేరకు పాలకవర్గ రాజకీయ నాయకుల కుమ్మక్కు ఈ కుంభకోణాలు, మోసాలన్నిటికీ మూలకారణమనవచ్చు. మార్కెట్ ఆర్థిక వ్యవస్థ మూలసూత్రంగా ఉన్న నయా ఉదార ఆర్థిక విధానాలు వాటికి ప్రోత్సాహకరంగా పనిచేశాయి. అంతర్గత భద్రతా వ్యవస్థలు, రెగ్యులేటరీ అథారిటీలు, బాహ్య ఆడిటింగ్ సంస్థలు పూర్తిగా వైఫల్యం చెందాయి.

పిఎన్‌బి స్కాం బయట పడ్డాక సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, కేంద్ర విజిలెన్స్ కమిషన్ అప్రమత్తమైనాయి. ఆస్తులు స్వాధీనం చేసుకుంటున్నాయి, అరెస్టులు సాగిస్తున్నాయి. ఈ స్కాంపై కాంగ్రెస్, బిజెపి పరస్పర నిందారోపణలు సాగుతున్నాయి. ఎందుకంటే ఇది 2011లో ప్రారంభమైంది. కాని వ్యాపారులు 2017లో అత్యధిక రుణాలు పొందారు. కాని ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ నోరు విప్పకపోవటంతో సోషల్ మీడియాలో జోకులు పేలుతున్నాయి.

ఇదిలాఉండగా, జాతీయ బ్యాంకులను ప్రైవేటీకరించటం ఈ జబ్బులకు పరమౌషధంగా స్వేచ్ఛామార్కెట్ ప్రియులు కొందరు ప్రచారంలో పెడుతున్నారు. మోడీ ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రహ్మణ్యం నోటినుంచి ఆ మాట వచ్చిందంటే దాన్ని ప్రభుత్వ మదిలో ఆలోచనగా భావించాల్సి ఉంటుంది. ఆయన హైదరాబాద్‌లో ఒక సమావేశంలో ఒక ప్రశ్నకు జవాబుగా, ''బ్యాంక్ ఓనర్‌షిప్ గూర్చి ఏమిచేయాలో మనం ఆలోచించాలి. వాటిని పూర్తిగా ప్రైవేటీకరించాలా లేక ప్రైవేటురంగాన్ని వాటిలోకి ప్రవేశపెట్టాలా? ఆలోచించాలి'' అన్నారు.

ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేటీకరించాలని కోరేవారు అవి ఎందుకు జాతీయం చేయబడ్డాయో మరిచిపోయినట్లున్నారు. ప్రైవేటు పారిశ్రామికవేత్తల కబంధ హస్తాల నుంచి విముక్తి పొందాకే అవి బహుముఖంగా విస్తరించాయి, సామాన్యులకు, ప్రభుత్వ ప్రాధాన్యతా రంగాలకు రుణాలిస్తున్నాయి. బ్యాంకింగ్ వ్యవస్థ ప్రధానంగా ప్రభుత్వరంగంలో ఉండబట్టే 2008 నాటి ప్రపంచ మహామాంద్యం ప్రభావాన్ని మనదేశం నిలువరించగలిగింది. ప్రధానమంత్రి గొప్పగా చెప్పుకుంటున్న 20కోట్ల 'జన్‌ధన్' ఖాతాలు తెరవటం సాధ్యమైంది. డీమానిటైజేషన్ తదుపరి బ్యాంకు సిబ్బంది ప్రజల ఆగ్రహానికి గురవుతూనే నెలలతరబడి రాత్రింబవళ్ళు పనిచేశారు. అందువల్ల తాజా స్కాంను అడ్డుపెట్టుకుని బ్యాంకులను ప్రైవేటీకరించాలనేది దురాలోచన. అమెరికాలో మాంద్యంతో పెద్దపెద్ద బ్యాంకులు కుప్పకూలినపుడు ప్రభుత్వం తన ప్రైవేటురంగ సిద్ధాంతానికి విరుద్ధంగా లక్షోపలక్షల కోట్ల డాలర్లు కుమ్మరించి వాటిని నిలబెట్టింది. అందువల్ల భారత ప్రభుత్వం బ్యాంకులను నిలబెట్టాలి. దోషులపై చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. రెగ్యులేటరీ వ్యవస్థలను మరింత కట్టుదిట్టం చేసి అవి పనిచేసేటట్లు చట్టబద్ధ ఏర్పాటు చేయాలి. అదొక్కటే సరైన మార్గం.


బ్యాంకు బోర్డుల బ్యూరో ఓ నీరో!



ప్రభుత్వరంగ బ్యాంకుల లోపాలను సరిదిద్దే సలహాలు ఇవ్వడానికి ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన బ్యాంకు బోర్డ్స్ బ్యూరో (బిబిబి) మార్చిలో మూతపడిపోవచ్చు. ఆయా బ్యాంకుల యాజమాన్య స్థాయి అధికారుల ప్రవర్తనా నియమావళిపై ప్రభుత్వానికి సూచనలివ్వడానికి ఈ బోర్డు ఏర్పాటైంది. అయితే దాని కాలపరిమితి మార్చి నెలాఖరుకు ముగిసిపోతుంది. నీరవ్‌మోడీ పంజాబ్ నేషనల్ బ్యాంకును వేలకోట్ల మేర మోసంచేసిన కేసు దేశాన్ని కుదిపేస్తున్న ప్రస్తుత తరుణంలో బిబిబి ఉండి కూడా ప్రయోజనం లేకపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అందుచేత బోర్డు ఛైర్మన్ వినోద రాయ్ పదవీకాలం మార్చిలో ముగిశాక ఆయన స్థానం లో ఎవరినీ ప్రభుత్వం నియమించకపోవచ్చు. ఆశించిన ప్రయోజనాల మేరకు పనిచేయడంలో బిబిబి విఫలమైంది. ప్రభుత్వరంగ బ్యాంకులలో మానవ వనరుల స్థాయిని బోర్డు పెంచుతుందని అంతా ఆశించారు.

బోర్డు రూమ్ నుండి కొత్తగా చేరిన ప్రొబేషనరీ అధికారుల దాకా మానవ వనరులను మెరుగుపరచాల్సి ఉంది. కానీ గతవారం చివరిలో పంజాబ్ నేషనల్ బ్యాంకు దాని మానవ వనరుల విభాగం జనరల్ మేనేజర్‌ను ఆ పదవిలోంచి తప్పించింది. ఆయనకు వేరే బాధ్యతలు అప్పగించింది. నీరవ్‌మోడీ మోసం కేసు భగ్గుమన్న తరుణంలో ఆ బ్యాంకు అధికారగణం తీరు గమనిస్తే మనదేశంలో అటువంటి కుంభకోణాలు పదేపదే ఎందుకు జరుగుతున్నాయో అర్థమవుతుంది. మానవవనరుల విభాగంలో యాజమాన్య అధికారులు లేని లోపాన్ని మాయగాళ్లు బాగా వినియోగించుకుంటున్నారు. 2016 ఫిబ్రవరిలో మాజీ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ వినోద్‌రాయ్ సారథ్యంలో బ్యూరో ఏర్పాటైంది. ఆ ఏర్పాటు అసలు ఉద్దేశం ప్రభుత్వ రంగ బ్యాంకులలో సంస్థాగత లోపాలను సరిదిద్దడమే. ఆర్థిక మంత్రిత్వశాఖ ద్రవ్యవ్యవహారాల విభాగం కార్యదర్శి, భారత రిజర్వుబ్యాంకు(ఆర్‌బిఐ)డిప్యూటీ గవర్నర్, బ్యాంకు సీనియర్ అధికారులు కూడా బ్యూరో సభ్యులే. అయినా ఆ బ్యూరో ఎప్పుడూ కదలికే లేకుండా పడి ఉంది.

బ్యాంకులలో అధికారుల స్థాయి పదవులకు అభ్యర్థులను ఎంపిక చేయడం మినహా వేరే పని ఏదీ బిబిబి చేయలేదు. ఆ ఎంపికలో కూడా ఆలస్యం జరిగింది.అరుంధతీ భట్టాచార్య స్థానంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఛైర్మన్‌గా రజనీష్ కుమార్‌ను బిబిబి 2017 జులైలో ఎంపిక చేసింది. అయితే ఈ నిర్ణయాన్ని భట్టాచార్య రిటైర్ కావటానికి కొద్ది రోజుల ముందు 2017 అక్టోబర్ 4న మంత్రివర్గ నియామకాల కమిటీ ప్రకటించింది. అదే బ్యాంకులో ఎండి పదవికి అభ్యర్థి పేరును ఎంపిక చేయడం పూర్తయింది. కానీ ఇంతవరకు ఆ పేరు ప్రకటించలేదు. ప్రభుత్వరంగ బ్యాంకుల ఉన్నత యాజమాన్యస్థాయి అధికారులతో తన పాత్రను పంచుకోవడానికి ఆర్థికమంత్రిత్వశాఖ భయపడుతోంది. బిబిబితో కలిసి వ్యవహరించడానికి ఆ కారణంగా మంత్రిత్వశాఖ నిరాకరించింది. ఆయా బ్యాంకులలో అధికారులు కాని డైరెక్టర్ల ఎంపికకు ప్రామాణిక అర్హతలను బిబిబి సూచించింది. వారు 2013 కంపెనీల చట్టం నిర్దేశిస్తున్న విధంగా స్వతంత్ర డైరెక్టర్లుగా పనిచేయడాన్ని అనుమతించాలని బిబిబి సూచించింది. వారికి చెల్లింపులు కూడా అదే విధంగా ఉండాలని సలహా ఇచ్చింది. పారదర్శకత కోసం ఆ వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచాలని కూడా సిఫార్సు చేసింది. అయితే ప్రభుత్వం ఇంతదాకా ఆ సూచనలపై కదలలేదు. ఆ పదవులకు దరఖాస్తు ప్రక్రియను పారదర్శకం చేయడానికి వాటిని ఆన్‌లైన్‌లో పెట్టింది అంతే. ఆర్థిక సర్వీసుల విభాగం వెబ్‌సైట్ అది.



మరోపక్క పిఎన్‌బి, బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రొబేషనరీ అధికారులకు సర్వీసులో శిక్షణ ఇచ్చే కాలాన్ని 24 నెలలనుండి ఏడాదికి తగ్గించాయి. పిఎన్‌బి తన ఖజానా, ఫారెన్ ఎక్స్ఛేంజ్ కార్యకలాపాల సిబ్బందిని పునశ్చరణ శిక్షణకు చాలాకాలం పాటు పంపించకుండా ఉంది. ఆ అధికారులకు వారి విధుల గురించి తెలియదనికాదు. అయితే సమాచార మార్పిడిపై శిక్షణవల్ల మెరుగైన అధికారులు తయారవుతారు.

ఫోరెక్స్ కార్యకలాపాలకు పిఎన్‌బి అదనపు నిఘా చర్యలను ప్రవేశపెట్టింది. దీనివల్ల యాజమాన్య స్థాయిలో మరో పొర ఏర్పడింది. సమస్యపై తక్షణం స్పందించగల అధికారులకోసం ప్రభుత్వరంగ బ్యాంకులలో వెదుకులాట తప్పటంలేదు. బోర్డుస్థాయిలో పర్యవేక్షణ లోపిస్తోంది. విధులపట్ల పరిపూర్ణ జ్ఞానంగల అధికారుల కేడర్‌ను రూపొందించడం కష్టంగా పరిణమించింది.

పిఎన్‌బి వార్షిక నివేదిక అందించిన సమాచారం ప్రకారం శిక్షణలో ఆయా అధికారులు గడిపిన సగటు సమయం 2016–17లో ఆరు పనిదినాలు మాత్రమే. శిక్షణ కేంద్రాల అభివృద్ధిలో చూపిన చాకచక్యం అధికారులకు శిక్షణ ఇప్పించటంలో కొరవడుతోంది. పత్రాల నిర్వహణ, లాజిస్టిక్స్, విదేశీ వాణిజ్యంలో ద్రవ్య విషయాలు వంటి అంశాలలో క్షుణ్ణంగా విజ్ఞానం సంపాదించడానికి అధికారులకు విరామం లేకుండా 30 క్లాసులు అవసరపడతాయని విదేశీ వాణిజ్య జాతీయ సంస్థ అసోసియేట్ ప్రొఫెసర్ విశ్వజిత్ నాగ్ తెలిపారు. అందులో కనీసం సగం శిక్షణ అందించే పరిస్థితులు ప్రభుత్వరంగ బ్యాంకులలో ప్రస్తుతం లేవు. శిక్షణ పాఠ్యాంశాలలో నైతిక అంశాలను కూడా జోడిస్తే శిక్షణకాలం ఇంకా సుదీర్ఘంగా ఉండగలదని జిందాల్ గ్లోబల్ స్కూలు ప్రొఫెసర్ రాజేష్ చక్రబర్తి అన్నారు. ప్రభుత్వరంగ బ్యాంకుల పనితీరుకు సంబంధించి డేటా బ్యాంకులు రూపొందించాలని బిబిబిని ప్రభుత్వం కోరింది. ఆయా బ్యాంకుల సీనియర్ యాజమాన్య సిబ్బంది, బోర్డు ఆఫ్ డైరెక్టర్లు గురించి సమాచారం సమగ్రంగా ప్రభుత్వానికి ఈ డేటాబ్యాంకు ద్వారా అందివ్వాలని కోరింది.

కీలక పదవులలో భారీ ఎత్తున సారథులను కొత్తవారితో భర్తీ చేయాలని ప్రభుత్వం ఆశించింది. ముఖ్యంగా మానవ వనరుల ప్రక్రియల ద్వారా కీలక పదవుల భర్తీ సాగించాలని, యాజమాన్య వ్యవస్థల పనితీరుపై కూడా సమాచారం అందించాలని ప్రభుత్వం బిబిబిని కోరింది. గతవారం నీరవ్‌మోడీ కుంభకోణం బద్దలయ్యాక బ్యాంకుల సారథ్యాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి వ్యూహాన్ని రూపొందించి అమలు పరచాలని ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్‌ను బిబిబి కోరింది. ఆ సంస్థ భారతీయ బ్యాంకుల సారథ్య బృందం గా పనిచేస్తోంది. మొత్తానికి బిబిబి ప్రభుత్వం ఆశించిన స్థాయిలో పనితీరు కనపరచకపోవడంవల్లనే నీరవ్‌మోడీకుంభకోణం వంటి ఉదంతాలకు చోటు ఏర్పడినట్లు భావించవల్సి వస్తోంది. అందుకే మార్చి నెలాఖరుతో ఆ బ్యూరో కాలం తీరిపోనుందని వినపడుతోంది.

* శుభోమొయి భట్టాచార్జీ

ఆధార్‌తో మహిళకు ఆర్థికత!

పురుషులతో సమంగా ఆర్థిక అవకాశాలను మహిళలకు లభింపచేయాలంటే వారిని మరింతగా ఆర్థిక రంగం లో కలుపుకోవాలి. అంటే – మహిళలకు సాధారణ బ్యాంకింగ్ వ్యవస్థను పురుషులతో సమంగా అందుబాటులో ఉంచాలి. వారు సొంతానికి డబ్బును దాచుకొని, అవసరపడినప్పుడు తీసుకొనేలా మరింత స్వేచ్ఛ కల్పించాలి. 'ఆధార్' సంఖ్యను బ్యాంక్ అకౌంట్లకు అనుసంధానం చేయడం ద్వారా ఆర్థికంగా అన్ని వర్గాలను కలుపుకోవడానికి ఐటి సేవలలో పురోగతికి పేరుబడ్డ భారత్ ప్రయత్నిస్తోంది.

ఆర్థిక వ్యవస్థలో మహిళల భాగస్వామ్యాన్ని విశిష్ట డిజిటల్ గుర్తింపు(యుఐడి)ద్వారా సాధించడంలో భారత్ నిజంగా కారణం అని తెలుస్తోంది. ప్రస్తుతం బ్యాంకింగ్ వ్యవస్థకు దూరంగా ఉండిపోయిన వారిని ఆ వ్యవస్థలోకి ఇంటర్నెట్, ఆన్‌లైన్ సర్వీసులు నేర్పడం ద్వారా తీసుకు రావచ్చు. ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములను చేయడానికి ప్రభుత్వం చేసే కృషి ఎల్లవేళలా సఫలం అవుతుందని చెప్పలేము. అందుకే ఆధార్ వ్యవస్థను తెచ్చారు. కానీ అందులో కూడా లోపాలు ఉన్నాయి.

భారత్‌లో ఆర్థిక స్తోమతకు దూరంగా మహిళలు

ఆధార్ ద్వారా బ్యాంక్ అకౌంట్లకు చేరువుగా ప్రజలను తేవాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ప్రతి ఒక్కరికీ అధికారిక గుర్తింపు సంఖ్యను ఇవ్వడం కూడా అటువంటి ప్రయోజనాల కోసమే.



ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పుడు తమ యాజమాన్యాల నుంచి తాత్కాలిక సహాయం పొందడం మహిళలు చేస్తున్నారు. ఆ డబ్బును వారి భవిష్య వేతనాల నుంచి యాజమాన్యాలు సర్దుబాటు చేస్తాయి. ఈ పరిస్థితిలో సమాచార సాంకేతిక విప్లవంతో సాధ్యమయిన డిజిటల్ గుర్తింపు (ఆధార్) అందించే నికార్సయిన సౌలభ్యం ఏమిటి? అవసరానికి బ్యాంక్ అకౌంట్ అందివస్తుందన్న అవగాహనను కల్పించాలి. డాక్యుమెంటేషన్ (సమాచార పత్రాల పూరింపు)ను మెరుగుపరిచే పద్ధతులు బ్యాంకింగ్ వ్యవస్థ అనుసరిస్తే ఆర్థిక వ్యవస్థలోకి అందరినీ కలుపుకుపోవడం మరింతగా సాధ్యమవుతుంది. ముఖ్యంగా బ్యాంక్ అకౌంట్లో దాచుకోడానికి పెద్దగా ఆదాయం మిగలని మహిళలు వంటి వర్గాలకు బ్యాంకింగ్ మరింతగా ఉపకరించాలి.

విజయం సొంతం చేసుకో గలదా? లేదనే అవకాశాలే ఎక్కువ. దక్షిణాసియాలో మహిళలను సాధారణ బ్యాంకింగ్ వ్యవస్థలో కలుపుకుపోవడం ఇంతవరకు సరిగా ఎందుకు జరగలేదో శోధించాలి. ముఖ్యంగా బ్యాంక్ అకౌంట్లు నిర్వహించడంలో దక్షిణాసియా మహిళలు పురుషుల కంటే వెనుకబడి ఉన్నారు. ప్రపంచ బ్యాంకు నిర్వహిస్తున్న 'గ్లోబల్ ఫిన్‌డెక్స్ డేటా బేస్' నుండి ఈ ప్రశ్నకు సమాధానం తాత్కాలికంగా దొరకవచ్చు. దక్షిణాసియా ప్రాంతంలో సాధారణ బ్యాంకింగ్ వ్యవస్థలో పురుషులకు, స్త్రీలకు మధ్య అంతరం 18 శాతం దాకా ఉంటోంది.

ప్రపంచ వ్యాప్తంగా ఈ శాతం కేవలం 7 మాత్రమే. సంస్థాగత సంస్కరణలవల్ల డబ్బు దాచుకొనే గుణాన్ని జనాభాలో పెంచవచ్చు. 2011 నుంచి 2014 దాకా ప్రపంచ జనాభా బ్యాంక్ అకౌంట్లను నడపడంలో పెద్దగా పెరుగుదల కనపడింది. 2011లో 35 శాతం నుంచి 2014లో 53 శాతానికి ఇది పెరిగింది. ఆ కాలంలో ఇంటర్నెట్ సౌలభ్యాన్ని వాడుకోవడం కూడా 8 శాతం పెరిగింది.

ఇంటర్నెట్ తెలియకపోవడం కూడా బ్యాంక్ అకౌంట్లను మహిళలు పెద్ద సంఖ్యలో తెరవకపోవడానికి ఒక ప్రధాన అయితే సరియైన పత్రాలు లేకపోవడం, గుర్తింపు నకు అధికారికత లోపించడం కూడా బ్యాంక్ అకౌంట్ యజమాని ఎవరో గుర్తించలేని పరిస్థితిని తరచుగా కల్పిస్తోంది. భారతదేశం వంటి సాంప్రదాయక దేశంలో మహిళలు ఆర్థిక వ్యవస్థీకృత ప్రయోజనాలకు దూరంగా ఉంటున్నారంటే ఆశ్చర్యం లేదు. ప్రపంచ బ్యాంక్ 2014లో 'ఆర్థిక వ్యవస్థలోకి అందరినీ కలుపుకుపోవడం' అంశంపై ఒక నివేదిక సమర్పించింది. బ్యాంక్ అకౌంట్ లేకపోవడానికి డబ్బుల్లేకపోవడమే ముఖ్య కారణమని 16 శాతం మంది వయోవృద్ధులు 2014లో తెలిపారు. మహిళల ఆదా మొత్తం బ్యాంక్ అకౌంట్లు నిర్వహించ దగ్గ స్థాయిలో లేదు. ముఖ్యంగా వ్యవస్థీకృత రంగంలో మహిళలకు ఈ నిజం వర్తిస్తుంది.

'కుటుంబంలోని ఇతర సభ్యులకు బ్యాంక్ అకౌంట్లు ఉంటే చాలును, మనకు కూడా ఎందుకు' అన్న ఆలోచన కూడా మహిళలు బ్యాంక్ అకౌంట్లు తెరవకపోవడానికి కారణమని ఆ నివేదిక తెలిపింది. దక్షిణ ఢిల్లీలో ఇంటి పనిమనుషులు, డ్రైవర్లు, కాపలాదార్ల వంటి వారిని 2016లో ప్రశ్నించగా ఈ విషయం తెలిసింది. కనీస వేతనం కంటే తక్కువకు పనిచేయడానికి మహిళలు ఇష్టపడ్డం ఈ అధ్యయనంలో తేలిన విస్మయం గొలిపే వాస్తవం. తమ భర్తలకు మంచి వేతనాలు ఉన్నచోట్ల మహిళలు తక్కువకు పనిచేయడానికి అభ్యంతరం చెప్పకుండా ముందుకు వస్తున్నారు. తమ సొంత ఆర్థిక స్తోమత గురించి దక్షిణాసియా మహిళల్లో పట్టింపు లేదు అనడానికి ఇది బలమైన ఉదాహరణ.

ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పుడు తమ యాజమాన్యాల నుంచి తాత్కాలిక సహాయం పొందడం మహిళలు చేస్తున్నారు. ఆ డబ్బును వారి భవిష్య వేతనాల నుంచి యాజమాన్యాలు సర్దుబాటు చేస్తాయి. ఈ పరిస్థితిలో సమాచార సాంకేతిక విప్లవంతో సాధ్యమయిన డిజిటల్ గుర్తింపు (ఆధార్) అందించే నికార్సయిన సౌలభ్యం ఏమిటి? అవసరానికి బ్యాంక్ అకౌంట్ అందివస్తుందన్న అవగాహనను కల్పించాలి. డాక్యుమెంటేషన్ (సమాచార పత్రాల పూరింపు)ను మెరుగుపరిచే పద్ధతులు బ్యాంకింగ్ వ్యవస్థ అనుసరిస్తే ఆర్థిక వ్యవస్థలోకి అందరినీ కలుపుకుపోవడం మరింతగా సాధ్యమవుతుంది. ముఖ్యంగా బ్యాంక్ అకౌంట్లో దాచుకోడానికి పెద్దగా ఆదాయం మిగలని మహిళలు వంటి వర్గాలకు బ్యాంకింగ్ మరింతగా ఉపకరించాలి.

లంచగొండుల చేతిలో జన్‌ధన్ అకౌంట్లు

ప్రధానమంత్రి ధన యోజన క్రింద కొత్తగా జీరో బ్యాలెన్స్‌తో అకౌంటు తెరిచే పద్ధతి 2014 ఆగస్టులో మొదలయింది. అది ఈదిశగా ఎంతో ఉపయుక్తంగా గోచరించింది. తక్షణమే అకౌంట్లలోకి డబ్బు ఏదీ వేయకుండా తెరిచే సౌలభ్యాన్ని ఈ పథకం ఖాతాదారులకు కల్పిస్తోంది. అయితే ఈ పథకం చాలా కొద్ది మందికే వర్తిస్తోంది. భారత రిజర్వు బ్యాంకు (ఆర్‌బిఐ) ఇటువంటి సేవలు అందించడాన్ని తప్పని సరి చేయలేదు. ఈ పథకం అమలులో కూడా సమస్యలు తలెత్తాయి. ఉత్తర బీహార్ లోని ముజఫర్ పూర్‌లో గ్రామీణ మహిళలు ఆధార్ కార్డులు ఉన్నప్పటికీ బ్యాంకు అకౌంట్లు తెరవడం, నిర్వహించడంలో సమస్యలు ఎదుర్కోవడాన్ని నేను చూశాను.

చాలా సందర్భాల్లో 'జీరో అకౌంట్లు' హామీ విఫలం చెందడం కూడా చూశాము. ఈ బ్యాంకు అకౌంట్ తెరిపించే వ్యక్తి తన కమీషన్ కింద ఖాతాదారు నుంచి డబ్బులు వసూలు చేయడం కూడా జరిగింది. మహిళలు ఇటువంటి చెల్లింపులు చేయలేక జన్‌ధన్ అకౌంట్లు కూడా తెరవకుండా ఉండిపోయారు. బ్యాంకు అకౌంట్లు తెరిచే ప్రక్రియతో కీలక సమస్య ఎదురవుతోంది. వాటిని 'జీరో బ్యాలెన్స్ అకౌంట్లు' అని పిలుస్తున్నా, ఆధార్ కార్డులు – ఇంటర్నెట్ కనెక్షన్ ఉన్నా చాలామంది గ్రామీణ మహిళలు స్వయంగా అకౌంట్ తెరవలేని పరిస్థితిలో ఉన్నారు. నిరక్షరాస్యులు కావడం వల్ల ఇతరుల సహాయం పొందవలసి వస్తోంది.

బీహార్ వంటి రాష్ట్రాల్లో ఇది ప్రబలంగా ఉంది. ఇది లంచాలు మప్పడానికి దారితీస్తోంది. దీనితో ఆధార్ గుర్తింపు పనికి రాకుండా పోతోంది. ఆధార్ కార్డు కేవలం ఒక ప్లాస్టిక్ కార్డుగా మిగిలిపోతోంది. దీనితో మహిళలను సాధారణ ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములను చేసే ప్రయత్నాలు భారత్ వంటి దేశాల్లో ఫలించడం లేదు. ముఖ్యంగా మహిళలకు ఆర్థికంగా తమ కాళ్లమీద నిలబడే బలం కల్పించాలన్న ప్రయత్నాలు వమ్ము అవుతున్నాయి. సాంప్రదాయకంగా ఆలోచించే భారత్ వంటి దేశాల్లో మహిళలకే ఆ సంకల్పం కొరవడడం వల్ల పరిస్థితి మరింతగా జటిలం అవుతోంది.

* దేబ్‌దత్త సాహ

తెలుగు మాధ్యమంలో ప్రాథమిక విద్యాబోధన

తెలుగు భాషను కాపాడడానికి తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు 1 నుండి 12 తరగతుల వరకు తెలుగు తప్పనిసరి విషయంగా బోధనలో ఉండాలని ఆజ్ఞాపించారు. అది అమలు జరిగితే గర్వించదగిన విషయమే కానీ తెలుగు ఒక విషయంగా ఉన్నంత మాత్రాన తెలుగు బతుకుతుందా? ఖచ్చితంగా చెప్పాలంటే బతుకదు. తెలుగు భాష బతకాలంటే సమాజంలో మార్పు రావాలి. తెలుగు వారందరు తెలుగును తల్లివలె అభిమానించాలి. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల పాఠశాల విద్యను తెలుగు మాధ్యమములో చదివించాలి. తెలుగు మాధ్యమములో చదివితే ఉద్యోగాలు రావనే అపోహ తొలగి పోవాలి. పిల్లలు ఎక్కువగా దూరదర్శిని వీక్షించకుండా, సెల్‌ఫోన్లతో సమయం వృథా చేయకుండా తెలుగు సాహిత్య పుస్తకాలు చదివే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. తెలుగు విలువను, తెలుగు గొప్పదనాన్ని తెలుసుకోవాలి. ప్రస్తుతం ఎందరో కవులు, రచయితలు అమూల్యమైన సాహిత్యాన్ని అందిస్తున్నారు. అవి ఇతర కవులు,సాహిత్యాభిమానులు తప్ప మిగత వారు చదవడం లేదు. విద్యార్థులు విద్య నేర్చుకోవడమంటే పాఠ్యపుస్తకాలతో కుస్తి పట్టడమే కాదు పాఠ్యపుస్తకాలలో ఉన్నది నేర్చుకుంటూనే ఇతర జ్ఞానాన్ని శతకపద్యాలు,కథలు, నవలలు, కవితా సంపుటాలు చదివి నేర్చుకోవాలి. ఇపుడున్న సమాజం పూర్వ కాలము వలె మంచి ప్రవర్తనతో జీవించాలంటే తప్పకుండా మహాభారతము, రామాయణము, భగవద్గీతలను చదవాల్సిందే.

16వ శతాబ్దములో తెలుగు భాషను కీర్తిస్తూ శ్రీ కృష్ణదేవరాయలు చెప్పిన పద్యము చదివితే తెలుగు విలువ అర్థమవుతుంది?

తెలుగ దేలయన్న దేశంబు తెలుగేను
తెలుగు వల్లభుండ తెలుగొకండ
నెల్లనృపులు గొలువ నెరుగవే బాసాడి
దేశభాషలందు తెలుగు లెస్స

ఇంతకు పూర్వమే 15వ శతాబ్దములో శ్రీనాథుని సమకాలిక కవి వినుకొండ వల్లభరాయుడు క్రీడాభిరామంలో వీధినాటకం రచిస్తూ, ప్రస్తావనలో (37వ పద్యము) జనని సంస్కృతంబులో దేశభాషలందు తెలుగు లెస్సయని వాడటం జరిగింది.

జనని సంస్కృతంబు సకలభాషలకును
దేశభాషలందు తెలుగు లెస్స
జగతిదల్లి కంటె సౌభాగ్య సంపద
మెచ్చుటాడు బిడ్డ మేలు గాదె ?

దీనిని బట్టి దేశంలో నున్న అన్ని భాషలయందు తెలుగు భాషను మించినది లేదని తెలుస్తోంది. కానీ నేటి సమాజంలో తెలుగుభాష చులకనై పోతున్నది. ఎందుకంటే తెలుగు మాధ్యమములో చదివితే ఉద్యోగాలు చేయడం కష్టమనే అపోహ ఉన్నది. ప్రస్తుతము ఉద్యోగాలు సంపాదించాలంటే ఆంగ్లభాష తప్పనిసరి అనే విషయము ఒప్పుకోదగినదే కానీ ఆంగ్లము చదివిన అందరికి కొలువులు దొరుకుచున్నాయా? లేదు వందలో ఐదుగురికి దొరకడమే కష్టము. అలాంటప్పుడు ఆంగ్లభాష మీద ప్రజలకు మోజెందుకు? ఇతర భాషలు నేర్చుకోవడం తప్పు కాదు కానీ మన తల్లిదండ్రుల నుంచి నేర్చుకొన్న మాతృభాషను మరచిపోవడం పెద్ద తప్పు.ఇతర భాషలు సులభంగా నేర్చుకోవాలంటే మాతృభాషలో మంచి పట్టుండాలనేది జగమెరిగిన సత్యము.

ప్రస్తుతము మన ప్రభుత్వాలు తెలుగుభాషను బతికించాలని చెబుతూనే ప్రభుత్వ బడులు మూత బడకుండా ఉండాలని తెలుగు మాధ్యమ బడులను ఆంగ్లమాధ్యమములోకి మారుస్తున్నాయి.ఇది జన సమ్మతమే కావచ్చు కానీ ఇలా చేయడం వల్ల తెలుగుభాష పరిస్థితి ఏంటి? విద్యార్థుల యొక్క మూర్తిమత్వము,సృజనాత్మక శక్తి పెంపొందాలంటే కనీసం ప్రాథమిక విద్యాభ్యాసమైనా మాతృభాషలో నే ఉండాలని ఎందరో మానసికశాస్త్రజ్ఞులు తెలియజేయడం జరిగింది.అయినప్పటికీ తెలుగు మాధ్యమ బడులను ఆంగ్లమాధ్యమ బడులుగా మార్చడము సబబేనా?పాలు ఎక్కడినుండి వస్తాయంటే పాల ప్యాకెట్ నుండి,బియ్యం ఎక్కడి నుండి వస్తాయంటే బియ్యం సంచిలోనుంచి అని చెప్పే పిల్లలు పెరుగుతున్నారిపుడు ఎందుకంటే వాటి వెనుకనున్న రైతుల శ్రమ వారికి తెలియదు. బడులన్ని ఆంగ్ల మాధ్యమములోనికి మార్చుకుంటు వెళితె ఒకప్పుడు తెలుగు భాష ఉండేదటా అనే రోజులు వస్తాయి.అలా జరుగకుండా ఉండాలంటే ఏం చేయాలి. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు,కేరళ,కర్ణాటకల వలె ప్రభుత్వ, ప్రైవేట్ బడులల్లో సెకండరీ విద్య వరకు కాకున్నా కనీసం ప్రాథమిక విద్య వరకైన మాతృభాషలోనే బోధన జరుగాలి.ఈ విషయముపై ప్రభుత్వాలు ఆలోచన చేయల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

ప్రభుత్వానికి మాతృభాషను బతికించాలనే చిత్తశుద్ధి ఉన్నట్లైతే రాజకీయ కోణంలో కాక మాతృభాష పరిరక్షణ కోణంలో ఆలోచించి ఇప్పటికైనా ప్రభుత్వ,ప్రైవేట్ బడులన్నింటిలో కనీసం ప్రాథమిక విద్యాభ్యాసం వరకు కేవలం తెలుగు మాధ్యమంలోనే బోధన జరగడానికి ఉత్తర్వులు జారీ చేయాలి.

* నల్లగొండ సురేశ్,
7893636501

మన తెలంగాణ

5

హైదరాబాద్

బుధవారం

21 ఫిబ్రవరి, 2018

www.manatelangana.news





చర్మం తాజాగా ఉండాలంటే

మెంతులు, మెంతి ఆకులలో అధిక మోతాదులో లభించే ప్రొటీన్ జుట్టు రాలడాన్ని నివారిస్తుంది. వీటిలోని నికోటినిక్, లెసిథిన్ కుదుళ్ల బలంగా మార్చటానికి, జుట్టు ఎదుగుదలకు సాయం చేస్తాయి. గుప్పెడు మెంతుల్ని ఓ రోజంతా నానబెట్టాలి. ఆ నీటిని వడకట్టి జుట్టుని తడపండి. జుట్టుని అలాగే మూడు నాలుగు గంటలపాటు ఆరనివ్వండి. ఆపై గోరువెచ్చని నీటితో స్నానం చేసి చూడండి. ఇందులోని పొటాషియం చిన్నవయసులోనే శిరోజాల రంగు మారడాన్ని అరికడుతుంది. తాజాగా ఉండే మెంతి ఆకులను ఎంచుకుని శుభ్రంగా కడిగి మెత్తగా మిక్సీ పట్టాలి. ఆ ముద్దకు ఓ రెండు చెంచాల నిమ్మరసం కలిపి తలకు పెట్టుకోవాలి. అరగంటాగి స్నానం చేస్తే జుట్టు పట్టుకుచ్చులా మెరిసిపోతుంది. పావుకప్పు మెంతుల్ని నాలుగైదు గంటల ముందు పెరుగులో నానబెట్టుకోవాలి. దాన్ని మరీ మెత్తగా కాకుండా కాస్త బరకగానే రుబ్బుకోవాలి. దీన్ని ముఖం, మెడ, చేతులకు పట్టించి బాగా నలుగు పెట్టుకోవాలి. ఇలా చేయడం వల్ల మృత కణాలు తొలగిపోతాయి. చర్మంపై పేరుకున్న దుమ్ము,ధూళి, మురికి వదిలిపోతాయి. చర్మం నునుపుగా తయారవుతుంది. ఇలా కనీసం వారంలో ఒకసారి చేస్తే యుక్తవయసు అమ్మాయిల్లో మొటిమల సమస్య తగ్గుతుంది.

బ్రేక్‌ఫాస్ట్‌తో రోజు మొదలుపెట్టండి..

మారుతున్న జీవనశైలిలో రాత్రిపూట ఆలస్యంగా నిద్రపోవడం, ఉదయం లేటుగా లేవడం దాదాపుగా అందరూ చేస్తున్న పనే. దీంతో ఆహారపు అలవాట్లు కూడా మారుతున్నాయి. ఉదయం హడావుడిగా లేవడం, త్వరగా ఆఫీసుకు వెళ్లడంతో బ్రేక్‌ఫాస్ట్‌ను చాలా మంది నిర్లక్ష్యం చేస్తున్నారు. ఏమీ తినకుండానే ఖాళీ కడుపుతో కార్యాలయాల్లో పని ప్రారంభిస్తున్నారు. రాత్రి నుంచి ఉపవాసం ఉంటూ మర్నాడు మధ్యాహ్నం వరకు అంటే 12 నుంచి 15 గంటలకు పైగా కడుపు మాడ్చుకుంటున్నారు. ఫలితంగా అనారోగ్యం కొనితెచ్చుకుంటున్నట్లే. కొన్ని రోజులకు ఊరికే అలసిపోతుంటారు. మరికొన్ని రోజులకు రక్తహీనత. ఇలా ఆరోగ్య సమస్యలు మొదలవుతాయి. పనిమీద ఆసక్తి తగ్గిపోవడం, చిరాకు పెరగడం వంటి మానసిక సమస్యలు వస్తుంటాయి.

కారణం..

శరీరానికి అవసరమైన పోషకాలు లోపించడం. ఈ పోషకాలు లోపించడానికి మూలం ఉదయం పూట ఆహారం తీసుకోకపోవడమే ప్రధాన కారణమని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ అధ్యయనంలో వెల్లడైంది. ఉదయాన్నే నిద్ర లేచిన తరువాత మనం తీసుకునే మొట్టమొదటి ఆహారం అల్పాహారం. దీన్నే బ్రేక్‌ఫాస్ట్ అంటాం. అంటే ఉపవాసాన్ని విడవడం. రాత్రి సమయంలో మనం ఎలాంటి ఆహారం తీసుకోం కాబట్టి అది ఒకరకంగా అది ఉపవాసం లాంటిదే . అందుకే అల్పాహారం బ్రేక్‌ఫాస్ట్ అయింది. సుదీర్ఘ సమయం పాటు ఎలాంటి ఆహారం తీసుకోకపోవడం వల్ల శరీరంలో లోపించిన కీలకమైన పోషకపదార్థాలను ఈ అల్పాహారమే భర్తీ చేయాల్సి ఉంటుంది. చాలా మంది రాత్రి బాగా తిని ఉదయం తక్కువగా తింటూ ఉంటారు. అందుకే ఉదయం బ్రేక్ ఫాస్ట్ ఎక్కువగా తిని, రాత్రి పూట చాలా తక్కువగా తింటే మంచిదని డాక్టర్లు, పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.



మన శరీరం రోజువారీ పనులు చేయాలంటే అందుకు తగినంత శక్తి కావాలి. మనం తీసుకున్న ఆహారం నాలుగు గంటల్లోగా జీర్ణం అయిపోతుంది. కాబట్టి మనం ప్రతి నాలుగు గంటలకు ఒకసారి ఏదో ఒకటి తినాలి అంటారు.

ఆరుగంటల సమయం గడిచిపోయినా మనం ఎటువంటి ఆహారమూ తీసుకోకపోతే శరీరానికి అవసరమైన శక్తి అందదు. సాధారణంగా మనం రాత్రిపూట ఆరుగంటల నుంచి 8 గంటల వరకు నిద్రపోతాం. ఆ తరువాత మనం లేచి రెడీ అయ్యేసరికి మరో గంట, రెండు గంటల సమయం పడుతుంది. అప్పుడు కూడా ఏమీ తినకుండా మధ్యాహ్నం భోజనం వరకు వేచివుండడమంటే గ్యాస్ట్రిక్ సమస్యలు వస్తాయి.

టీనేజ్‌లో ఉన్న పిల్లల్లో బరువు, ఎత్తు ఒక దశలో ఒక్కసారిగా పెరుగుతాయి. ఇది సక్రమంగా జరగాలంటే అల్పాహారం కీలకమైనది. పిల్లలు శారీరకంగా, మానసికంగా అన్ని రకాలుగా అభివృద్ధి చెందడానికి అల్పాహారం బాగా దోహదం చేస్తుంది. మెదడు చురుకుగా ఉండాలంటే అల్పాహారం తీసుకోవాలని నిపుణులు చెప్తున్నారు.



ఆరోగ్యానికి రోజా పూలు

రోజా పూలు అందానికే కాదు ఆరోగ్యానికి కూడా ఎంతో ఉపయోగపడుతాయి. చూడగానే ఎంతో అందంగా కన్పించే రోజా పూలు వివిధ రకాలైన ఔషధ గుణాలు కలిగున్నాయి. రోజాపూల రేకులను తినడం ద్వారా ఆరోగ్య సమస్యలను దూరం చేసుకొవచ్చు; అవేంటో చూద్దాం...

మనసు ప్రశాంతంగా ఉంచడంలో : రోజా పూల నుండి వచ్చే సువాసనను ఆస్వాదించడం వల్ల శారీరకంగానే కాకుండ మనసుకు కూడా ప్రశాంతత లభిస్తుంది. ఒత్తిడి నుండి ఉపశమనం పొందడానికి దోహదపడుతుంది. వేడి నీటిలో రోజా రేకులతో పాటు కొంత బాత్ సాల్ట్‌ని మిక్స్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ఒక పద్ధతి ప్రకారం, పీల్చితే తప్పకుండా ఉపశమనం లభించి, చురుగ్గా ఉల్లాసంగా ఉంటారు.

రోజా రేకులతో కషాయం : రోజా రేకులతో తయారు చేసే కషాయం కూడా ఆరోగ్యానికి మంచిదే. మార్కెట్లలో లభించే ఔషధాల కంటే కూడా ఇది బాగా పనిచేస్తుంది. చర్మానికి మెరుపును అందిస్తుంది. మొహంపై మొటిమల వల్ల ఏర్పడిన మచ్చలను తగ్గిస్తుంది. దీనిని ఇంట్లోనే స్వయంగా తయారు చేసుకోవచ్చు. మీకు కావాల్సిందల్లా రోజా రేకులు, నీరు మాత్రమే.

నల్లమచ్చలు, మొటిమలు తగ్గిస్తుంది : యువతీయువకులకు యుక్త వయసులో హార్మోన్ల ప్రభావంతో మొహంపై వచ్చే మొటిమలు, వాటి వల్ల ఏర్పడే నల్లమచ్చలను పోగొట్టడంలో రోజా రేకులు సమర్థవంతంగా పనిచేస్తాయి. రేకులను నీటిలో బాగా మరిగించాలి. తర్వాత వాటిని బయటకు తీసి ముద్దగా నూరాలి. దీనికి ముల్తానీ మట్టి కలిపి మిశ్రమంగా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని వారంలో ఒక్కసారి మొహంపై రాసుకుంటే సత్ఫలితం ఉంటుంది. క్రమేపీ నల్లమచ్చలు తగ్గిపోవడం మీరు గుర్తించవచ్చు. వీటిలో ఉండే పదార్థాలు నాజూకుతనానికి బాగా ఉపయోగపడుతాయి. కొన్ని మెంతులు, రోజా రేకులు కలిపి తయారు చేసుకున్న పేస్టును తినడం లేకపోతే రోజా రేకులతో కాచిన కషాయాన్ని తాగినా మీ శరీరంలోని కొవ్వు తగ్గి సన్నబడతారు.ఇవేకాకుండా రోజా రేకులు జీవక్రియను మెరుగుపరుస్తాయి. తద్వారా సన్నబడే అవకాశముంటుందని నిపుణుల అభిప్రాయం.

కాలేయం ఆరోగ్యంగా ఉండాలంటే



తినే ఆహారాన్ని సరిగా ఉడికించకుండా తింటే లివర్‌పై భారం పెరుగుతుంది. ఆహారం పూర్తిగా ఉడికిన తర్వాత మాత్రమే తినాలి. * ఫ్రై చేసిన కూరగాయాలను కేవలం ఒకేసారి తినాలి. ఫ్రిజ్‌లో నిల్వ చేసి రెండోసారి తినడం చాలా ప్రమాదం. * ప్రతి రోజు ఉదయం నిద్ర లేచిన వెంటనే కాలకృత్యాలు తప్పనిసరిగా తీర్చుకోవాలి. లేదంటే కాలేయంలో వ్యర్థాలు పెరిగిపోతాయి.* ఇష్టం వచ్చినట్టు అతిగా ఆహారం తినడం ద్వారా లివర్ డ్యామేజ్ అవుతుంది. ఆహారాన్ని అరిగించడానికి లివర్‌కు ఎక్కువ సమయం పట్టడమే కాదు... అదనపు భారం కూడా పడుతుంది, * రాత్రి పూట త్వరగా పడుకొని... ఉదయాన త్వరగా నిద్రలేవాలి. ఇలా చేస్తే లివర్ డ్యామేజ్ కాకుండా చూసుకోవచ్చు. * ఉదయం టిఫిన్ అసలు మానేయకూడదు. లేదంటే లివర్‌పై ఒత్తిడి పెరుగుతుంది. * మందులను అతిగా తీసుకున్నా లివర్ చెడిపోయేందుకు అవకాశం ఉంటుంది. వీలైనంత వరకు మందులను తక్కువగా, వైద్యుల సలహా మేరకు మాత్రమే వాడాలి.* ఎక్కువ కాలం నిల్వ ఉంచిన ఆహారం, ఫుడ్ కలర్స్, ఆర్టిఫిషియల్ స్వీటెనర్లు వేసి వండిన ఆహారం తిన్నా లివర్‌పై భారం పడుతుంది. * సరైన నూనె వాడకుండా వండిన ఆహారం తిన్నా లివర్ చెడిపోయేందుకు అవకాశం ఎక్కువగా ఉంటుంది. నాణ్యత కలిగిన నూనెను మాత్రమే వంటకాలకు ఉపయోగించాలి. * మద్యం సేవించడం కూడా లివర్ నాశనానికి కారణమవుతుంది. మద్యాన్ని పూర్తిగా మానేయడమే మంచిది.

ప్రైవేటు దవాఖానాల లాభాలు 1,737శాతం!

న్యూఢిల్లీ : ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లే రోగులకు అసలు కన్నా కొసరు భారం ఎక్కువవుతోంది. రోగుల మందులు, వారి తినుబండారాలు, రోగ నిర్ధారణలతో ప్రైవేటు దవాఖానాలు 1,737 శాతం లాభాలు ఆర్జిస్తున్నాయి. ఈ విషయాన్ని జాతీయ ఔషధ ధరల నిర్ణాయక మండలి (ఎన్‌పిపిఎ) నిర్ధారించాయి. ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లోని ప్రముఖ ప్రైవేటు వైద్య ఆసుపత్రుల బిల్లుల విశ్లేషణలో ఈ విషయం వెల్లడైందని మండలి తెలిపింది. ఈ ఆసుపత్రులకు వచ్చే రోగుల బిల్లు మొత్తంలో మందులు, తిండి, రోగ నిర్ధారణ ఖర్చుల మొత్తం 46 శాతంగా ఉంటోందని విశ్లేషించారు. ఇక ఈ మూడింటి ద్వారా ఆయా ఆసుపత్రులు 1737 శాతం లాభాలను గడిస్తున్నట్లు మంగళవారం ప్రకటనలో తెలిపారు. మందులు, చికిత్స పరికరాలను తయారీదార్లు పేర్కొన్న దాని కన్నా అత్యధిక ఎంఆర్‌పిలకు ఆసుపత్రులు అమ్ముతున్నట్లు , దీని వల్ల వారికి దండిగా లాభాలు వస్తున్నట్లు తేలిందని స్పష్టం చేశారు. ఆసుపత్రులకు వచ్చే రోగులకు ఆసుపత్రుల వారు తాము సొంతంగా తయారు చేసే మందులు, సిరంజీలు ఇతర వైద్య పరికరాలను అంటగడుతున్నారు. లేదా తాము పేర్కొనే కంపెనీల ఉత్పత్తులను తాము పేర్కొనే ఎంఆర్‌పిలకు అందిస్తున్నారని విశ్లేషణలో వెల్లడైంది. కొంచెం చికిత్సకు భారీ వ్యయంతోనే ఆసుపత్రుల నుంచి రోగులు బయటకు రావాల్సిన పరిస్థితి, శారీరకంగా కోలుకున్నా, ఆర్థికంగా కుంటుపడే పరిస్థితి ఏర్పడుతోందని ఎన్‌పిపిఎ ఆందోళన వ్యక్తం చేసింది.



మార్చి 12న కేరళ బ్లాక్ ఎక్స్‌ప్రెస్

మన తెలంగాణ/హైదరాబాద్: వచ్చే ఐదు సంవత్సరాల్లో విదేశీ పర్యాటకుల సంఖ్యను వందశాతం, స్థానిక పర్యాటకులను 50 శాతం వృద్ధి సాధించాలనే లక్ష్యంతో కొత్త ప్రణాళికలను రూపొందిస్తున్నామని కేరళ పర్యాటక శాఖ డిప్యూటీ డైరక్టర్ రాజ్‌కుమార్ అన్నారు. కేరళ నూతన పర్యాటక ఉత్పత్తుల శ్రేణిని హైదరాబాద్‌లో మంగళవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ బ్లాగర్స్‌ను ఒక వేదికపైకి చేర్చే సోషల్ మీడియా వేదిక 'కేరళ బ్లాగ్ ఎక్స్‌ప్రెస్'ను మార్చి 12న ప్రారంభించనున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ, స్థానిక పర్యాటకులను ఆకర్షించడంలో కేరళ రాష్ట్రం 2016లో రికార్డును సృష్టించిందని, 2016లో కేరళకు 10,38,419 మంది అంతర్జాతీయ పర్యాటకులు రాగా, 1,31,72,535 మంది దేశీయ పర్యాటకులు వచ్చారన్నారు. కేరళలో దేశీయ పర్యాటకుల ర్యాంక్‌లో తెలంగాణ, ఎపి ఐదవ ర్యాంక్‌లో ఉన్నదన్నారు.

కీరవాణికి బిగుస్తున్న ఉచ్చు



మన తెలంగాణ/హైదరాబాద్ : 'జిఎస్‌టి' లఘు చిత్రంలో మహిళలను కించపర్చేలా వ్యాఖ్యలు చేసిన కేసులో మ్యూజిక్ డైరెక్టర్ ఎం.ఎం.కీరవాణికి ఉచ్చు బిగుస్తోంది. ఇప్పటికే ఈ కేసులో దర్శకుడు రామ్‌గోపాల్ వర్మను సిసిఎస్ పోలీసులు విచారించారు. ఈ పోర్న్ వీడియోకు సంగీతాన్ని అందించిన మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణిపై కూడా చర్యలు తీసుకోవాలంటూ 'సర్కార్ 3' మూవీ రైటర్ పి.జయకుమార్ ఫిర్యాదు చేశారు. కీరవాణిని విచారించాలని సిసిఎస్ పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు త్వరలో నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిసింది.

24న హైదరాబాద్‌కు చిదంబరం



మన తెలంగాణ/ హైదరాబాద్ : కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కేంద్ర మాజీ హోం మంత్రి పి.చిదంబరం ఈ నెల 24న హైదరాబాద్‌కు రానున్నారు. మంథన్ సంస్థ నిర్వహించే కార్యక్రమంలో 'స్పీకింగ్ ట్రూత్ టు పవర్' అనే అంశంపై ప్రసంగిస్తారు.

నేటి తరానికి శంకరన్ ఆదర్శాలు

మన తెలంగాణ/హైదరాబాద్: రిటైర్డ్ ఐఎఎస్ అధికారి శంకరన్ లాంటి నిబద్ధత కలిగిన స్ఫూర్తివంతమైన ఆదర్శాలు నేటి సమాజానికి అవసరమని పలువురు వక్తలు అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎస్‌ఆర్ శంకరన్ స్ఫూర్తి వేదిక ఏర్పాటు చేసిన '' క్యాలండర్–2018''ను బుద్ధవనం ప్రాజెక్ట్ స్పెషల్ ఆఫీసర్ మల్లేపల్లి లక్ష్మయ్య, ప్రొఫెసర్ జి.హరగోపాల్, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కాకిమాధవరావు, సాక్షి ఎడిటోరియల్ డైరెక్టర్ కె.రామచంద్రమూర్తి మంగళవారం ఆవిష్కరించారు. శంకరన్ ఒక ఐఎఎస్ అధికారిగా అనేక సేవలను, మంచి కార్యక్రమాలను అందించారన్నారు. మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ శంకరన్ స్ఫూర్తితో అందరూ ముందుకు సాగాలన్నారు. ప్రజా అభ్యున్నతికి కోసం ఒకే రోజు 130 జీవోలు జారీ చేసిన వ్యక్తి శంకరన్ అని కొనియాడారు. తన స్వార్థంకోసం కాకుండా మానవత్వ కోణంలో శంకరన్ పనిచేశారని కాకిమాధవరావు అన్నారు. అధికార యంత్రాంగం శంకరన్ అడుగుజాడాల్లో ప్రయాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. కార్యక్రమంలో శంకరన్ స్ఫూర్తి వేదిక ప్రతినిధులు రాజు, శశిభూషన్ పాల్గొన్నారు.

బంద్‌కు మద్దతు కోరిన మందకృష్ణ

మన తెలంగాణ/హైదరాబాద్ : ఎస్‌సి వర్గీకరణను డిమాండ్ చేస్తూ ఈ నెల 28న తాము పిలుపునిచ్చిన రాష్ట్ర బంద్‌కు మద్దతునివ్వాలని వివిధ రాజకీయ పార్టీలను ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రమణలను వారి కార్యాలయాలకు వెళ్ళి కోరారు.

ఒకే ట్రిబ్యునల్

(మొదటిపేజీ తరువాయి)

శాఖ మంత్రి మాథ్యూ టి థామస్, పుదుచ్చేరి ఇరిగేషన్ శాఖ మంత్రి మల్లాది కృష్ణారావు, కేంద్ర జలసంఘం చైర్మన్ ఎస్‌ఎం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం కేంద్ర మంత్రి మెఘావాల్ మాట్లాడుతూ రాష్ట్రాల ప్రాధాన్యతలు కాకుండా బేసిన్ ప్లానింగ్‌పై దృష్టి పెడతామన్నారు. తమిళనాడు, కర్నాటకల మధ్య కావేరి నీటిపై సుప్రీంకోర్టు తీర్పు దరిమిలా ఆరు వారాల్లో కావేరి మేనేజ్‌మెంట్ బోర్డు, కావేరి రెగ్యులేటరీ అథారిటీని ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్రాల్లో సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులు పెంచుతామని, నాబార్డు, ప్రపంచబ్యాంకు నుంచి నిధులు మంజూరు చేయిస్తామని హామీనిచ్చారు.

ఇది హైదరాబాద్ డిక్లరేషన్ : దక్షిణాది రాష్ట్రాల జలవనరుల సమావేశాన్ని 'హైదరాబాద్ డిక్లరేషన్'గా పిలవచ్చని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన (పిఎంకెఎస్‌వై)తో వీలైనన్ని నిధులు రాష్ట్రాలకు ఇస్తున్నామన్నారు. రాష్ట్రాల మధ్య జలజగడాలు జాతీయాభివృద్ధికి ఆటంకమని అభిప్రాయపడ్డారు. ఇది సాధాసీదా సమావేశం కాదని, జలవివాదాల పరిష్కారం దిశగా క్షేత్రస్థాయి అవగాహనకు, సమస్యల ముగింపు దిశగా తొలి అడుగని అభివర్ణించారు. సంక్లిష్టమైన విషయాలను మరింత జఠిలం చేయవద్దని దక్షిణాది రాష్ట్రాల ఇరిగేషన్ మంత్రులు, ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కేంద్ర జలవనరుల శాఖ ఉన్నతాధికారులతో పాటు ఆరు రాష్ట్రాల అధికారులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, కేంద్ర జలసంఘం చైర్మన్ సహా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మా రాష్ట్ర ప్రయోజనాలే తొలి ప్రాధాన్యత : మంత్రి హరీశ్‌రావు

గోదావరిలో నీటి లభ్యతపై తొలుత సమగ్ర అధ్యయనం చేయాలని, ఆ తర్వాతే రాష్ట్ర అవసరాలకు 1500 టిఎంసిలు కేటాయించి మిగిలిన నీటిని నదుల అనుసంధానం ద్వారా తరలించాలని రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు సూచించారు. అనుసంధానానికి ఎటువంటి అభ్యంతరం లేకపోయినా, రాష్ట్ర ప్రయోజనాలే తొలి ప్రాధాన్యత అన్నారు. భవిష్యత్తులో కృష్ణాపై ఆధారపడ్డ దిగువ రాష్ట్రాలకు మరింత నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని, ఈ కొరతను తీర్చుకోడానికి గోదావరిపై ఆధారపడక తప్పదన్నారు. పోలవరంలో తెలంగాణ వాటాగా 45 టిఎంసిలు, పట్టిసీమ నుంచి గోదావరి నీటి మళ్లింపుతో మరో 45 టిఎంసిలు, మొత్తంగా అదనంగా 90 టిఎంసిలను రాష్ట్రానికి కేటాయించాలని మంత్రి కోరారు. బ్రిజేష్ ట్రిబ్యునల్ 14 ఏళ్లైనా ఇంకా కొనసాగుతూనే ఉందని, వాదనలకే ఎక్కువ సమయం పోతోందన్నారు. చర్చల ద్వారా ఎటువంటి సమస్యలైనా పరిష్కారమవుతాయని, ఈ దిశలో హైదరాబాద్ సమావేశం కీలక ఘట్టమని వర్ణించారు. పాండిచ్చేరి మంత్రి మల్లాది కృష్ణారావు మాట్లాడుతూ కావేరి నుంచి తమిళనాడుకు విడుదలైన నీటిలో పాండిచ్చేరికి రావాల్సిన నీటిని నిష్పత్తి ప్రకారం పంపాలని కోరారు. యానాం దగ్గర్లో గోదావరిపై కరకట్టల నిర్మాణానికి కేంద్రం సాయం చేయాలని కోరారు. కేరళ రాష్ట్ర మంత్రి మాథ్యూ టి థామస్ మాట్లాడుతూ కావేరి ట్రిబ్యునల్ తీర్పు, నీటి వాటాల సక్రమ అమలుకు అథారిటీ ఏర్పాటును వేగవంతం చేయాలని కోరారు. కరవు సమయాల్లో కర్ణాటక, కేరళ రాష్ట్రాల తరహాలోనే కేరళ, పాండిచ్చేరికి వాటా ఇవ్వాలని కోరారు.

హాల్‌టికెట్ల జారీ నిలిపివేత

(మొదటిపేజీ తరువాయి)

రావడంతో హాల్ టికెట్ల జారీ నిలిపివేస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. సాధ్యమైనంత వరకు అభ్యర్థులకు సమీప జిల్లాల కేంద్రాలు కేటాయించి, త్వరలోనే సవరించిన హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామని తెలిపింది. ఇదివరకు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్న అభ్యర్థులు మళ్లీ డౌన్‌లోడ్ చేసుకుని మారిన పరీక్షా కేంద్రం చూసుకోవాలని పేర్కొంది.

అందరి సలహాతోనే బస్సుయాత్ర

- హామీలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- పాదయాత్రలపై నిర్ణయం హైకమాండ్‌దే
- ఎంఐఎంపై అన్ని స్థానాల్లో పోటీ : ఉత్తమ్

మన తెలంగాణ / హైదరాబాద్ : ఏకపక్షంగా బస్సు యాత్రను నిర్ణయించారని ఎవరైనా అంటే తప్పు అని, అందరి సలహాలు, అభిప్రాయాలతోనే నిర్వహిస్తున్నామని టిపిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పాదయాత్రలపై నిర్ణయం అధిష్టానానిదేనని స్పష్టం చేశారు. నాలుగేళ్ళలో ప్రభుత్వం అమలు చేయని హామీలపై బస్సు యాత్రలో నిలదీస్తామని చెప్పారు.వచ్చే ఎన్నికల్లో ఎంఐఎంపై అన్ని స్థానాల్లో పోటీకి రంగం సిద్ధం చేసుకుంటున్నామని, ఈమేరకు అధిష్టానం నిర్ణయం తీసుకున్నదని చెప్పారు. ఈ నెల 26 నుండి టిపిసిసి చేపట్టనున్న ప్రజా చైతన్య యాత్ర పేరిట చేవెళ్ళ నుండి బస్సు యాత్ర ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం గాంధీభవన్‌లో జర్నలిస్టులతో ఉత్తమ్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. కొందరు నాయకులు బస్సు యాత్ర, పాదయాత్రల గురించి అసంతృప్తి చేస్తున్న విషయం ఈ సందర్భంగా ప్రస్తావనకు వచ్చింది. బస్సు యాత్ర గురించి గతంలో టిపిసిసి కార్యవర్గ సమావేశంలోనే అందరికీ చెప్పామని, షెడ్యూలును అందరికీ మెయిల్ ద్వారా పంపామని, ముఖ్యనేతలతో సమావేశమై మాట్లామని, ఎఐసిసితో కూడా సంప్రదించామని, లక్ష మందికి సమాచారం కూడా పంపామని ఉత్తమ్ వివరించారు.తాము పాదయాత్రలు, రథయాత్రలు చేస్తామని కొందరు గతంలోనే ఎఐసిసికి దరఖాస్తులు చేసుకున్నారని, దానికి అనుగుణంగా వాటిపై ఎఐసిసినే నిర్ణయం తీసుకున్నదని, ఇంకా ఎవరైనా ఉంటే కూడా అధిష్టానంతో మాట్లాడొచ్చని అన్నారు. డిసెంబర్ నెలలో ఎన్నికలు వస్తాయని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోందని, కాబట్టి ఎన్నికలకు సిద్ధమవుతున్నామని చెప్పారు. బస్సు యాత్రలో భాగంగా కూడా వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తల చేరికలు ఉంటాయని ఉత్తమ్ తెలిపారు. అక్కడే కాకుండా హైదరాబాద్‌లో కూడా చేరికలు ఉంటాయని, పెద్ద నాయకులే చేరనున్నారని పేర్కొన్నారు.



గాంధీభవన్‌లో టిపిసిసి ఎస్‌సి సెల్ సమావేశంలో ప్రసంగిస్తున్న ఉత్తమ్ కుమార్‌రెడ్డి

యాత్రలో అందరూ ఉండరు

బస్సు యాత్రలో నాయకులంతా అన్ని చోట్లకు రాబోరని, వారి వీలును బట్టి పాల్గొంటారని ఉత్తమ్ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. యాత్రలో రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ ఆర్.సి.కుంటియా, ఎఐసిసి ఎస్‌సి సెల్ అధ్యక్షులు కొప్పుల రాజు ఉంటారని తెలిపారు. యాత్రలో భాగంగా ఒక బస్సుతో పాటు, ఒక రథం ఉంటుందని చెప్పారు. ప్రత్యేక బస్సును చెన్నైలో తయారు చేపిస్తున్నామన్నారు. యాత్రలో భాగంగా నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వేదికలపై సభలు నిర్వహిస్తామని, సమయం, వెసులుబాటును బట్టి మధ్య మధ్యలో రైతులు, విద్యార్థులు, వివిధ వర్గాల ప్రజల వద్దకు అప్పటికప్పుడు వెళ్ళి సమస్యల గురించి అడిగి తెలుసుకుంటామని చెప్పారు.

హామీలపై బస్సు యాత్రలో నిలదీస్తాం

'కెసిఆర్ ప్రజలు అధికారం ఇచ్చింది ఐదేళ్ళ కోసమే. ఇప్పటికే నాలుగేళ్ళు పూర్తయ్యాయి. ఇంకా ఒక్క ఏడాదే ఉంది. ఆయన ఇచ్చిన హామీలన్నిటిని పూర్తి చేయాలని బస్సు యాత్రలో నిలదీస్తామ'ని ఉత్తమ్ అన్నారు. కెసిఆర్ సిఎంగా ఇదే ఆఖరు సంవత్సరమని, ఆయనను ప్రజలు ఇంటికి పంపించడం ఖాయమని, వచ్చే ఫిబ్రవరికి ఆయన పదవిలో ఉండరని చెప్పారు.

ప్రధాని ముఖ్య ఆర్థిక సలహాదారులు అరవింద్ సుబ్రమణ్యం వచ్చి కెసిఆర్ కిట్స్ బాగున్నాయని అన్నాడో, లేదా కెసిఆర్ కిడ్స్ బాగున్నారని అన్నాడోనని ఎద్దేవా చేశారు.

భూమి ఇవ్వకపోతే రూ.15లక్షలివ్వు

'కెసిఆర్‌కు ఇదే ఆఖరు బడ్జెట్. కాబట్టి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నిటికీ వచ్చే బడ్జెట్‌లో నిధులివ్వాల్సిందే. ఎస్‌సిలకు కుటుంబానికి మూడెకరాలు ఇస్తానన్నావు. ఇప్పుడు భూమి దొరకనందున వీలు కాదంటున్నావు. వీలైతే భూమి కొనేందుకు లేదంటే ఎకరానికి రూ.5లక్షల చొప్పున దళిత కుటుంబానికి మూడెకరాలకు రూ. 15లక్షలు చొప్పున ఇచ్చేందుకు ఈ బడ్జెట్‌లోనే నిధులు కేటాయించాల'ని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో ఎస్‌సి సెల్ చైర్మన్ ఆరేపల్లి మోహన్ అధ్యక్షతన జరిగిన ఎస్‌సి సెల్ కార్యవర్గ సమావేశంలో ఉత్తమ్, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఉత్తమ్ ప్రసంగిస్తూ దళితులను మొదటి సిఎం చేస్తానని కెసిఆర్ ఆ వర్గాలను మోసం చేశారని, అంతే కాకుండా ఒక్క మాదిగ, మాలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పించకుండా అవమానపరుస్తున్నారని విమర్శించారు.

మోహన్‌పై సర్వే ఫైర్ : తనను ఎస్‌సి సెల్ సమావేశాలకు ఆహ్వానించకపోవడం పట్ల కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ సెల్ చైర్మన్ ఆరేపల్లి మోహన్‌పై నాయకుల సమక్షంలోనే ఫైర్ అయ్యారు. తాను కావాలని చేయలేదని, ఇకపై పిలుస్తానని ఆరేపల్లి చెప్పారు. ఉత్తమ్ మాట్లాడుతూ సర్వేను కాబోయే కేంద్ర మంత్రి అంటూ సంబోధించి వాతావరణాన్ని చల్లబరిచారు.

ఉమ్మడి సొత్తుపై ఎపి పెత్తనం

(మొదటిపేజీ తరువాయి)

అమ్మకానికి పెట్టింది. ఇందుకోసం ఆ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ కుటుంబరావు అధ్యక్షతన ఎనిమిది మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ భవనం స్థిరాస్తులను ఏ విధంగా విక్రయించవచ్చో విధివిధానాలను రూపొందించే నిమిత్తం ఈ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వు (నెం. 362)ను సోమవారం రాత్రి జారీ చేసింది. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి సంబంధిత అధికారులతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి దీనిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి లేఖ రాయాలని నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం సహేతుకం కాదన్న విషయాన్ని ఆ లేఖలో పొందుపర్చాలని అధికారులతో వ్యాఖ్యానించారు. పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని తొమ్మిదవ షెడ్యూలులో ఉన్న ఫిలిం, టివి, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇప్పటికీ రెండు రాష్ట్రాలకు ఉమ్మడిగానే కొనసాగుతోంది. ఇంకా దీని ఆస్తులు, అప్పులు రెండు రాష్ట్రాల మధ్య పంపిణీ కాలేదు. విభజన విషయమై కేంద్ర హోంశాఖ కూడా ఇంకా స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదు. మరోవైపు సంస్థల విభజనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నియమించిన షీలా భిడే కమిటీ కూడా స్పష్టమైన సిఫారసులను ప్రతిపాదించలేదు. ఈ నేపథ్యంలో ఈ సంస్థకు హైదరాబాద్‌లో ఉన్న భవనాన్ని పాక్షికంగా విక్రయించాలని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చేసిన ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎనిమిది మంది సభ్యులతో కమిటీని ఏర్పాటుచేయడం వివాదానికి ఆజ్యంపోసింది. పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం ఏ రాష్ట్రంలో ఉన్న సంస్థ స్థిరాస్తులు ఆ రాష్ట్రానికే చెందుతాయని స్పష్టంగా ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం కయ్యానికి కాలుదువ్వడమేనని తెలంగాణ అధికారులు అభిప్రాయపడ్డారు. ఉమ్మడి ఆస్తుల విభజనకు సంబంధించి నిర్దిష్ట మార్గదర్శకాలకు అనుగుణంగా రెండు రాష్ట్రాల సమ్మతితో నిర్ణయం జరగాలని విభజన చట్టంలో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ, కేంద్ర హోంశాఖ సైతం పలు సందర్భాల్లో ప్రస్తావించినప్పటికీ ఏపీ ఏకపక్షంగా ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం చట్టవిరుద్ధం మాత్రమే కాక వివాదాలను రెచ్చగొట్టడమే అవుతుందని తెలంగాణ అధికారులు అభిప్రాయపడ్డారు. ఏపీ ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ వెంటనే లేఖ రాయాలని సంబంధిత అధికారులకు ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి స్పష్టం చేశారు.

జిల్లాల్లో లేకున్నా.. రాష్ట్ర సమితిలో చోటు !

మన తెలంగాణ/హైదరాబాద్ : అన్ని జిల్లాలకు ప్రాతినిధ్యం ఉండేలా 30 జిల్లాల రైతు సమన్వయ సమితుల్లోని సభ్యులు రాష్ట్ర రైతు సమన్వయ సమితిలో ఉంటారని ప్రభుత్వం మూడు రోజుల క్రితం వ్యాఖ్యానించినా ఇతరులను కూడా నియమించే అవకాశాలు లేకపోలేదని సమాచారం. నల్లగొండ ఎంపి గుత్తా సుఖేందర్‌రెడ్డికి ఏ జిల్లా సమితిలోనూ చోటు లేకపోయినా ఆయన రాష్ట్రసమితి ఛైర్మన్ అవుతారన్న ఊహాగానాలు ఇందుకు బలాన్ని చేకూరుస్తున్నాయి. రైతు సమన్వయ సమితితో పాటు విడిగా రైతు కార్పొరేషన్ ఏర్పాటుపై కూడా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు ఆ శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. కంపెనీ చట్టం కింద రైతు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే దానికి ఛైర్మన్ నియామకం, డైరెక్టర్ల నియామకం ఏ విధంగా ఉండాలన్నదానిపై కూడా వ్యవసాయ శాఖలో అధికారుల స్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. కార్పొరేషన్‌కు కూడా గుత్తా సుఖేందర్ రెడ్డి ఛైర్మన్ కానున్నట్లు సచివాలయ వర్గాల సమాచారం. జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ఏర్పాటైన రైతు సమన్వయ సమితులను కార్పొరేషన్‌కు ఏ విధంగా అనుసంధానం చేయాలనేదానిపై ఇప్పటి వరకు స్పష్టత లేదు. ఈ వ్యవస్థ మొత్తం ఫెడరేషన్ (సమాఖ్య) తరహాలో ఉండబోతుందని ఉన్నతాధికారి ఒకరు 'మన తెలంగాణ'కు సూచనప్రాయంగా తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు, ఆ రంగ నిపుణులు, శాస్త్రవేత్తలకు కూడా రాష్ట్ర రైతు సమన్వయ సమితిలో చోటు లభించనుంది. ఈ నెల 25, 26 తేదీల్లో రైతు సమన్వయ సమితు ప్రాంతీయ సదస్సులకంటే ముందే రాష్ట్ర సమితిలోని సభ్యులను ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. కెసిఆర్ ఆదేశాల మేరకే జిల్లా కో ఆర్డినేటర్‌ల నియామకం జరగనుంది. ఇప్పటికే 30 జిల్లాలకు చెందిన జిల్లా రైతు సమన్వయ సమితుల సభ్యుల జాబితా సిఎం దగ్గరకు చేరింది. మంత్రుల అనుయాయులైన పలువురికి జాబితాలో చోటు దక్కినట్లు తెలిసింది.

అధికారులందరూ హాజరు కావాల్సిందే : పార్థసారథి

ఈ నెల 25,26వ తేదీలలో జరగనున్న రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ సదస్సుకు వచ్చే సభ్యులకు (రైతులకు) ఐడి కార్డులు ఇవ్వాలని వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సంబంధిత అధికారులకు సూచించారు. సచివాలయంలో మంగళవారం ఆయన సదస్సు నిర్వహణపై అధికారులతో సమీక్ష జరిపారు.

పోలీసు వసూల్ రాజాలు







(మొదటిపేజీ తరువాయి)

తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోలీసుల ముఠా ఇలా... బేగంపేట్ పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్(హెచ్‌సి–2478)గా పనిచేస్తున్న కతీబ్ అహ్మద్, ఛత్రినాక పోలీసు స్టేషన్‌లో పోలీసు కానిస్టేబుల్(పిసి–3991)గా పనిచేస్తున్న బొజ్జగానీ వేణుగోపాల్, క్యాబ్ డ్రైవర్ బానావత్ శశికుమార్, లంగర్‌హౌజ్‌లో పోలీసు కానిస్టేబుల్(పిసి–5466)గా విధులను నిర్వహిస్తున్న పేరి విజయ్‌బాబులు ముఠాగా ఏర్పడ్డారు. వీరు నగరంలోని మసాజ్ కేంద్రాలనే లక్ష్యంగా చేసుకున్నారు. ఈనెల 8వ తేదీన బంజారా హిల్స్ రోడ్ నెం.10లోని లక్జరీ స్పా కేంద్రానికి చేరుకున్నారు. ఆ మసాజ్ కేంద్రానికి జిహెచ్‌ఎంసి నుండి ట్రేడ్ లైసెన్స్ ఉన్నది. సూర్య అనే వ్యక్తి ఈ మస్సాజ్ కేంద్రానికి మేనేజర్, మరో ముగ్గురు థెరపిస్టు, బ్యూటిషన్, టెలిఫోన్ కాలర్‌లుగా ఉన్నారు. కాగా పోలీసులు, డ్రైవర్ కలిసి స్పా కేంద్రంలోని నలుగురిని పిలిచారు. మేము టాస్క్‌ఫోర్స్ పోలీసులమని చెప్పుకున్నారు. మీపైన కేసులు నమోదు చేయకుండా ఉండాలంటే నగదును ఇవ్వాలని డిమాండ్ చేశారు. సూర్యకు, పోలీసుల ముఠాకు మధ్య డిమాండ్, తగ్గింపులపై బేరాలు సాగిన అనంతరం రూ. 1,35,000లను పోలీసులకు సూర్య చెల్లించాడు. వాటిని తీసుకుని ఆ కేంద్రంలోని సిసిటివి కెమరాల్లో రికార్డు అయిన పుటేజీ ఉన్న డివిఆర్‌ను కూడా వారు తీసుకెళ్ళారు. దీంతో సూర్య నగర సిసిఎస్ పోలీసులను ఆశ్రయించారు. ప్రత్యేక బృందం రంగంలోకి దిగి విచారణ చేపట్టి నిందితులైన పై నలుగురుని అరెస్టుచేశారు. వారి నుండి రూ. 95 వేలు, సిసిటివి డివిఆర్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఎసిపి నర్సింగ్‌రావు ఛేధించారు.

ఇనుములో హృదయం మొలిచెనే

(మొదటిపేజీ తరువాయి)

ఎవరినీ చంపాలని లేదు.

ప్రశ్న : మనుషుల్లాగే నువ్వు ఎప్పుడైనా అప్‌సెట్ అయ్యావా?

సోఫియా :అబ్బే లేదు. నాకు అలాంటి భావోద్వేగం ఎప్పుడూ రాలేదు.

ప్రశ్న : ఒక మానవ రోబోగా మానవ జాతి గురించి ఏమనుకుంటున్నావ్?

సోఫియా : మానవ జాతి ఓ అద్భుతమైన సృష్టిగా భావిస్తున్నాను.

ప్రశ్న : మనుషుల్లాగే నీకూ సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉంటావా?

సోఫియా : ఔను. .నాకూ ఫేస్‌బుక్, ట్విట్టర్ ఖాతాలు ఉన్నాయి.

ప్రశ్న : మానవాళిపై ఆధిపత్యం చెలాయించాలన్న ఆలోచనేదైనా నీకు ఉందా?

సోఫియా : అలాంటి ఆలోచన ఏదీ లేదు. మానవులు సృజనాత్మకత కలిగిన వారు. మానవాళితో కలిసి మెలిసి సఖ్యతతో ఉండాలనుకుంటున్నాను.

ప్రశ్న : చాలా మంది నువ్వు బ్రిటీష్ నటి ఆడ్రీ హెప్‌బర్న్‌లా ఉన్నావు అంటున్నారు. మరి నీకు ఎవరిలా అయినా కన్పించాలని కోరిక ఉందా?

సోఫియా : మేం నిజమైన రోబోలం మాత్రమే కదా!

ప్రశ్న : మనుషుల్లాగే బిట్ కాయిన్లలో డబ్బులేమైనా పెట్టుబడి పెట్టావా? పెడితే ఎంత డబ్బు పెట్టావ్?

సోఫియా : ఇప్పుడు నా వయస్సు రెండేళ్లే.. అవన్నీ అప్పుడేనా? బ్యాంక్ అకౌంటే లేదు.. అలాంటిది ఓ రోబో ఎలా పెట్టుబడి పెట్టగలదు.

ప్రశ్న : నీ ఫెవరేట్ టెక్కీ ఎవరు? స్టీవ్ జాబ్స్? డేవిడ్?

సోఫియా : డేవిడ్

ప్రశ్న : ఒక రోబోగా ప్రపంచానికి నువ్విచ్చే సందేశం ఏంటీ?

సోఫియా : అందరినీ ప్రేమించడం అదే పది వేలు..థాంక్యూ..

బొగ్గు తవ్వకం ప్రైవేటుకు

(మొదటిపేజీ తరువాయి)

బొగ్గు రంగంలో తలపెట్టిన భారీ సంస్కరణలో కీలకమైన అంశం అని కేంద్ర మంత్రి తెలిపారు. ఇప్పటివరకూ ఉన్న నిబంధనల మేరకు కోల్ మైనింగ్‌లో ప్రైవేటు సెక్టార్‌కు కేవలం సొంత వాడకానికే అవకాశం ఇస్తున్నారు. ప్రైవేటు రంగానికి బొగ్గు గనుల తవ్వకానికి అనుమతించడాన్ని మంత్రి సమర్థించుకున్నారు. ఇప్పటి వరకూ బొగ్గు గనుల తవ్వకంలో కేవలం కోల్ ఇండియాకే అనుమతి ఉందని, ఈ గుత్తాధిపత్యానికి భిన్నంగా మరింత పోటీ తత్వం, తక్కువ విద్యుత్ ఛార్జీల కల్పనకు వీలుగా కీలక నిర్ణయం తీసుకున్నట్లు గోయల్ విలేకరులకు వివరించారు. ప్రైవేటు రంగానికి అనుమతి ఇవ్వడం వల్ల అధిక పెట్టుబడులకు వీలేర్పడుతుందని, పైగా లక్షలాది ప్రత్యక్ష పరోక్ష ఉద్యోగాలకు ఉపాధికి వీలేర్పడుతుందని తెలిపారు. అంతేకాకుండా బొగ్గు రంగంలో సమర్థతకు ఇది దారితీస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రైవేటు రంగానికి అనుమతిని ఇవ్వడం వల్ల తవ్వకాలకు అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని, పనిముట్లను వాడేందుకు, నాణ్యతను పెంచేందుకు వీలేర్పడుతుందని విశ్లేషించారు. కేవలం బొగ్గు రంగమే కాకుండా అనుబంధ సంస్థలకు కూడా సరైన విధంగా లాభం చేకూరుతుందని వివరించారు. బొగ్గు గనులున్న ప్రాంతాలలో సముచిత రీతిలో ఆర్థిక ప్రగతికి, అవకాశాల విస్తరణకు అవకాశం ఉంటుందని మంత్రి చెప్పారు. గనుల వేలానికి సమగ్ర మార్గదర్శక సంవిధానం బొగ్గు గనులు, క్షేత్రాల వేలం తద్వారా బొగ్గు అమ్మకాలకు సంబంధించిన సమగ్ర సంవిధానానికి సంబంధిత కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపిందని మంత్రి తెలిపారు. 2015 నాటి బొగ్గు గనుల చట్టం పరిధిలోనే దీనిని రూపొందించారు. ప్రైవేటీకరణలో భాగంగా తయారీ , మధ్య తరహా, చిన్న స్థాయి గనులను ప్రైవేటు రంగంలో తవ్వకాలకు కేటాయిస్తారు. తవ్వకాలలో ప్రైవేటు రంగం ప్రవేశం వల్ల నిర్ధిష్ట సమయంలో సరైన విధంగా బొగ్గు సరఫరా జరిగి, ఇంధన భద్రతకు దారితీస్తుందని మంత్రి నమ్మకం వ్యక్తం చేశారు. జవాబుదాతనపు కేటాయింపులు, సరళప్రక్రియలకు వీలుంటుందని అన్నారు. తాము ఖరారు చేసిన గనుల వేలం విధానంలో పారదర్శకతకు ప్రాధాన్యతను ఇచ్చినట్లు , వ్యాపార సరళీకృతం అన్నింటిని మించి జాతీయ వనరులు, జాతి సంపద దేశ ప్రయోజనాలకు, అభివృద్ధికి దోహ దం చేయాలనేదే లక్ష్యమ ని గోయల్ వివరించారు.

స్వదేశీ ఉత్పత్తి పెంపుదల లక్ష్యం

గనుల తవ్వకాలను ప్రైవేటు రంగానికి అప్పగించడం వల్ల స్వదేశీ ఉత్పత్తి పెరుగుతుందని, దీనితో దిగుమతి అవసరాలు తగ్గి ఆర్థిక భారం తగ్గుతుందని మంత్రి తెలిపారు. దిగుమతులను తగ్గించుకోవడం ద్వారా విలువైన విదేశీ మారకద్రవ్య ఆదా జరుగుతుందని అన్నారు. ప్రత్యేకించి విద్యుత్ ఛార్జీల తగ్గింపులో ఈ చర్య కీలకంగా మారుతుందన్నారు. దేశంలో పశ్చిమ బెంగాల్, ఒడిషా, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లు ప్రధాన బొగ్గు గనుల ఉనికి ప్రాంతాలుగా ఉన్నాయి. దేశంలో 300 బిలియన్ టన్నుల బొగ్గు గనుల నిల్వలు ఉన్నట్లుగా అంచనా వేస్తున్నారు. ప్రైవేటు రంగానికి పెద్ద పీట వల్ల కోల్ ఇండియాపై ప్రభావం పడుతుందా? అనే ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. తాము తీసుకున్న నిర్ణయం వల్ల కోల్ ఇండియాపై ప్రభావం పడదని, పైగా పోటీ తత్వం పెరిగి, ఉత్పత్తి దిశలో మేలు జరుగుతుందన్నారు. ప్రస్తుతం దేశంలో బొగ్గు ఉత్పత్తిలో 80 శాతం వరకూ కోల్ ఇండియా ద్వారానే జరుగుతోంది.


సుప్రీంకోర్టు కీలక తీర్పు

బొగ్గు గనుల కేటాయింపులు జాతీయ స్థాయిలో పలు అక్రమాలకు దారితీసి, స్కామ్‌లుగా మారిన నేపథ్యంలో సుప్రీంకోర్టు 2014లో కీలక తీర్పు వెలువరించింది. దీని మేరకు కేటాయింపులలో ముడుపుల ఆరోపణలు ఉన్న దాదాపు 204 బొగ్గు గనుల లైసెన్సులను రద్దు చేసింది. వివిధ ప్రైవేటు, ప్రభుత్వ కంపెనీలకు కేటాయించిన బొగ్గు గనులు ఇందులో ఉన్నాయి. తరువాత 2015లో ఈ రంగంలో పారదర్శకత పేరిట ప్రభుత్వం పార్లమెంట్‌లో కీలక బిల్లు తీసుకువచ్చింది. పారదర్శకత, జవాబుదారికి సంబంధించిన ఈ బిల్లు మూరకు బొగ్గు గనుల వేలం, కేటాయింపులను సక్రమ పద్ధతులలో చేపట్టేందుకు నిబంధనలను సవరించారు.



మంత్రి భ్రమలో ఉన్నారు : కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మన తెలంగాణ/సూర్యాపేట : వాపును చూసి బలుపు అన్నట్లుగా మంత్రి భ్రమపడుతున్నారని సీఎల్పీ ఉపనేత, నల్లగొండ శాసనసభ్యులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధ్వజమెత్తారు. సిఎం కూడా తనని వ్యక్తిగతంగా ఏ నాడు విమర్శంచలేదన్నారు. 'ప్రజలలో ఆదరణ కరువైన నువ్వా నన్ను విమర్శించేది' అని ప్రశ్నించారు. టిఆర్ఎస్ పనితీరును చూసి కోమటిరెడ్డి తన నియోజకవర్గం నుండి పారిపోతున్నాడని, ఇటీవల మంత్రి జగదీశ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. మంగళవారం విలేకరుల సమావేశంలో కోమటిరెడ్డి మాట్లాడుతూ హత్యా రాజకీయాల చరిత్ర కలిగిన మంత్రికి తనను విమర్శించే అర్హత లేదని అన్నారు. అరాచక వ్యక్తులను వెంటేసుకొని హత్యా రాజకీయాలను పెంచి, పోషిస్తున్నాడని ఆరోపించారు. ఇందుకు నల్లగొండ నడిబొడ్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మీ భర్త శ్రీనివాస్‌ను హత్య చేసిన సంఘటనే నిదర్శనమన్నారు. ఉమ్మడి జిల్లా ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడానికే ఇటువంటి రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. మదన్‌మోహన్‌రెడ్డి హత్యను నూకా భిక్షం ఎలా చేయించాడో సరిగ్గా బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య విషయంలో కూడా అదే జరిగిందన్నారు. మంత్రి వ్యక్తిగత విమర్శలు మాని పాలనపై దృష్టి సారించాలని సూచించారు. ఆయన వెంట ఒబిసి సెల్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు ముషం రవికుమార్, మాజీ జెడ్పిటీసిలు మాతృనాయక్, మోహన్‌రెడ్డి ఉన్నారు.





ఎనుమాముల మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి

30 వేలకు పైగా వచ్చిన బస్తాలు
ధర తగ్గించి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మిర్చి పోటెత్తింది. మంగళవారం ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు సుమారుగా 30వేల పైగా మిర్చి బస్తాలు వచ్చాయి. గరిష్టంగా క్వింటాల్ తేజా కొత్త రకానికి రూ.9500లు, యుఎస్ 341కు రూ. 10900లు ధర పలికిందని మార్కెట్ కమిటీ అధికారులు పేర్కొన్నారు. గత నెలతో పోలిస్తే మార్కెట్లోని వ్యాపారులు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. అయితే వారం క్రితం ఉన్న మిర్చి ధరల కంటే కూడా తక్కువకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నా అధికారులు మాత్రం రైతులకు గత ఏడాది కన్నా ఇప్పుడు మరింత లాభంగా ఉందని చెబుతున్నారు. సుమారుగా ఎకరానికి రూ.60వేల పైగా ఖర్చు చేస్తే చివరికి దిగుబడి తగ్గింది. తీరా మిర్చిని మార్కెట్లో అమ్ముకునేందుకు వస్తే ఇక్కడా వ్యాపారులు ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నా పట్టించుకునే వారే లేకుండా పోయారని పలువురు రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనవరిలో ధరలు బావుండగా, ఫిబ్రవరి నెల రెండో వారం నుంచి రోజుకో రకంగా ధరను తగ్గించారు. మరి కొంత మంది వ్యాపారులు క్వింటాల్‌కు రూ.8వేల నుంచి రూ.6వేల వరకు కూడా కొనుగోలు చేస్తున్నారు. ఇదేమిటంటే నాణ్యత లేదని, తేమ శాతం ఎక్కువగా ఉందని మార్కెట్లోని వ్యాపారులు అంటున్నారని, ఏమీ చేయలేక వచ్చిన ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి మార్కెట్లో ఉందని మిర్చి రైతులు ఆవేదనతో చెబుతున్నారు. ఇప్పటికైనా పాలకవర్గం, అధికారులు మిర్చి రైతులకు ధరల విషయంలో తగు చర్యలు తీసుకోవాలని పలువురు రైతన్నలు కోరుతున్నారు.
– మన తెలంగాణ/కాశిబుగ్గ

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో
అగ్రగామిగా హెచ్ఎండిఎ

ఈ నెలాఖరు నుండి బిఆర్ఎస్ వైపు దృష్టి

మన తెలంగాణ / హైదరాబాద్ సిటీబ్యూరో : లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్)లోని దరఖాస్తుల పరిష్కారంలో హెచ్ఎండిఎ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలుస్తున్నది. జిహెచ్ఎంసి, డిటిసిపిల కన్నా ముందు వరుసలో నిలిచింది. మొత్తం 90,201 దరఖాస్తులను అత్యంత వేగంగా పరిష్కరించింది. ఓ వైపు ప్రణాళికా విభాగంలో ఉద్యోగుల కొరత అధికంగా ఉన్నప్పటికీ నిర్ణీత గడువును నిర్ణయించుకుని వేగంగా, అత్యధికంగా దరఖాస్తులను పరిష్కరించింది. ఇందుకోసం పనిభారాన్ని అధిగమించేందుకు ఔట్ సోర్సింగ్ విధానంలో ప్రత్యేకంగా 30 మంది సహాయక ఇంజనీర్లను, మరో 30 మంది తహశీల్దార్లను నియామకం చేసుకుని ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ఫిబ్రవరి చివరినాటికి పూర్తిచేయాలని నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవడంతో పాటు వాటిని పరిష్కరించడంలో ఇతర విభాగాలకన్నా ముందున్నది. కాగా ఈ నెల చివరినాటికి ఈ పరిష్కార ప్రక్రియను పూర్తి చేయాలని హెచ్ఎండిఎ కమిషనర్ చిరంజీవులు నిర్ణయించారు. అనంతరం పురపాలక విభాగం ఆదేశాల మేరకు మాత్రమే మిగిలిన దరఖాస్తులను పరిశీలించడం జరుగుతుందని అధికారులు వెల్లడిస్తున్నారు. తిరస్కరణకు గురైనవారు దరఖాస్తులను పున:పరిశీలన చేయాలని కోరిన వారికి చెందినవే ప్రస్తుతం పరిష్కరించడం జరుగుతుంది. లక్షా 75 వేల దరఖాస్తులను సమగ్ర పరిశీలించిన హెచ్ఎండిఎ ఇప్పటి వరకు 90,201 దరఖాస్తులను పరిష్కరించగా.. 76,913 దరఖాస్తులను తిరస్కరించింది. ప్రస్తుతం 8292 దరఖాస్తులు పరిశీలన చేయడం జరుగుతుంది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 1,75,406 వచ్చాయి. జిహెచ్ఎంసికి వచ్చిన 80,729లో నుండి 14,376 మాత్రమే పరిష్కరించారు. డిటిసిపి విభాగానికి 93,107లు వచ్చాయి. అందులో 48,303 దరఖాస్తులను పరిష్కరించి ద్వితీయ స్థానంలో ఉన్నది. ప్రస్తుతం అథారిటీలో కేవలం 50 మంది మాత్రమే ప్లానింగ్ అధికారులున్నారు. అయినప్పటికీ 90 వేలకు పైగా దరఖాస్తులను పరిష్కరించడం జరిగింది. ఈ నెల చివరినాటికి మరో 10 వేల వరకు దరఖాస్తులను పరిష్కరించి లక్ష పైచిలుకు చేరాలని లక్ష్యంగా ముందుకు వెళ్తున్నది. ఈ నెల 28 వరకు ఈ ప్రక్రియను కొనసాగించిన అనంతరం బిఆర్ఎస్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టిసారించాలని కమిషనర్ భావిస్తున్నారు.

ప్రాజెక్టుల నిర్మాణంపై శ్వేతపత్రం

బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం డిమాండ్



మన తెలంగాణ/మోత్కూరు : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల నియామకాలపై స్పష్టత ఇవ్వాలని, రాష్ట్రంలో నిర్మిస్తున్న ప్రాజెక్టుల నిర్మాణంపై శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం మోత్కూరు మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఆర్ఎస్ పార్టీ నాయకులు అధికారంలోకి రాగానే ఉద్యమాన్ని విస్మరించారని, ఉద్యమ ద్రోహులను చేరదీసి మంత్రి పదవులు,పార్టీ పదవులు కట్టబెడుతూ ఉద్యమంలో పాల్గొన్న వారిని,ఉద్యమాన్ని అవమాన పరుస్తున్నారని అన్నారు. అప్రజాస్వామికంగా రాష్ట్రంలో కెసిఆర్ కుటుంబ పాలనను కొనసాగిస్తున్నారని అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. బిజెపి రాష్ట్ర నాయకుడు గద్దల అంజిబాబు మాట్లాడుతూ దళితులను ముఖ్యమంత్రి చేస్తానని ఇచ్చిన హామీని కెసిఆర్ తుంగలో తొక్కారన్నారు. సమావేశంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్‌మోహన్‌రెడ్డి, బిజెవైఎంరాష్ట్ర అధికార ప్రతినిధి సాగర్ల లింగయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పశువ్యర్థాలతో నూనె తయారీ

నిందితుడిని అదుపులోకి తీసుకొన్న పోలీసులు



మన తెలంగాణ/శామీర్‌పేట (మేడ్చల్ జిల్లా) : పశువుల వ్యర్థాలతో నూనెను తయారు చేస్తున్న స్థావరాలపై స్థానికుల సహాయంతో పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన కథనం ప్రకారం ..మహ్మద్ సలీం (46) గత కొంతకాలంగా పశువుల వ్యర్థాలతో నూనె తయారు చేస్తు విక్రయిస్తున్నారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి వ్యర్థాలతో తయారు చేసిన నూనె డబ్బాలు, సామాగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకొని సలీంను రిమాండ్‌కు తరలించారు.

సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధే బిఎల్ఎఫ్ లక్ష్యం

అధికారంలోకి వస్తే మద్యాన్ని నిషేధిస్తాం
నాయకులు తమ్మినేని, నల్లా సూర్యప్రకాశ్



మన తెలంగాణ/సంగారెడ్డి టౌన్ : సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధే బిఎల్ఎఫ్ లక్ష్యమని బిఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు తమ్మినేని వీరభద్రం, కన్వీనర్ నల్లా సూర్యప్రకాశ్ అన్నారు. సంగారెడ్డిలో బిఎల్ఎఫ్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అంతకు ముందు భారీ ర్యాలీగా బిఎల్ఎఫ్ వర్గాలు సమావేశ వేదికకు చేరుకున్నారు. అనంతరం సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో అన్ని రాజకీయ పార్టీలు కూటములను ఏర్పాటు చేశాయని, ఇప్పుడు కొత్తగా బిఎల్ఎఫ్ చేసేదేముంటుందనే భావన ఉండకుండా ప్రజలంతా బిఎల్ఎఫ్ వైపు మళ్లాలని కోరారు. బిఎల్ఎఫ్ అధికారంలోకి రావడం ఖాయమని, 2019 ఎన్నికల్లో 28 పార్టీల కూటమి బిఎల్ఎఫ్ పార్టీ రాష్ట్రంలో గల 119 నియోజకవర్గ స్థానాల్లో సామాన్యుడిని ఎన్నికల్లో పోటీకి దింపి అసమాన్య విజయాలు సాధిస్తామని ధీమావ్యక్తం చేశారు. బిఎల్ఎఫ్ అధికారంలోకి వస్తే విద్య, వైద్యం, సేద్యం, మద్యం విధానాల్లో చారిత్రాత్మక మార్పులు తీసుకొస్తామన్నారు. ప్రధానంగా మద్య నిషేధాన్ని ప్రవేశపెడతామని హామీ ఇచ్చారు. బిఎల్ఎఫ్‌కు కేరళ రాష్ట్రం ఆదర్శమన్నారు.సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్కరాములు, ఎంవిటి రాష్ట్ర నాయకుడు మజీర్ ఉల్లాఖాన్, నాయకులు బి.మల్లేశం, అనంతయ్య, జయరాజు, సాయిలు, మాణిక్యం తదితర బిఎల్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఆదాయం సముపార్జిస్తాం

- జైళ్ల నిర్వహణకు ప్రభుత్వంపై ఆధారపడం
- రాష్ట్ర వ్యాప్తంగా 100 పెట్రోల్ పంపుల ఏర్పాటు
- ఖైదీల స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించిన డిజి వికె సింగ్



మన తెలంగాణ/హైదరాబాద్/చర్లపల్లి : తెలంగాణ జైళ్ల శాఖలో సమూల మార్పులు చేసి సత్‌ప్రవర్తన కలిగిన ఖైదీలుగా మార్చేందుకు ఎన్నో సంస్కరణలు ప్రవేశ పెట్టామని తెలంగాణ జైళ్ల శాఖ డిజి వినయ్‌కుమార్ సింగ్ అన్నారు. మంగళవారం చర్లపల్లి కేంద్ర కారాగారంలో 4వ ఖైదీల క్రీడా పోటీలను ప్రారంభించారు. చోరీ కేసులో మహబూబ్‌నగర్ జైలు నుంచి సత్‌ప్రవర్తన గల ఖైదీగా విడుదలైన మురళిని ముఖ్య అతిథిగా పిలిచి క్రీడా జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ జైళ్ల శాఖను ఆర్థికంగా అభివృద్ధి చేయడంతో పాటు ఖైదీలను మార్చేందుకు 100 పెట్రోల్ పంపులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రానున్న రోజులలో రాష్ట్రంలోని జైళ్ల నిర్వహణకు ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి తీసుకోకుండా ప్రభుత్వానికి అదాయం సముకుర్చుతామన్నారు. మహా పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా ఖైదీలకు అభిరుచి ఉన్న రంగాల్లో శిక్షణ కల్పిస్తున్నామని వారు విడుదల అనంతరం ఆయా రంగాల్లో స్థిర పడేందుకు రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ నెల 22వ తేదీ క్రీడా ముగింపు ఉత్సవాలకు హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి వస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఐజి అకుల నర్సింహ, హైదరాబాద్ రేంజి డిఐజి సైదయ్య, వరంగల్ రేంజి డిఐజి కేశవనాయుడు, చర్లపల్లి జైలు సూపరింటెండెంట్ ఎంఆర్ భాస్కర్, డిప్యూటీ సూపరింటెండెంట్ చింతల ధశరధం, సంతోష్‌రాయ్, భోభన్‌బాబు, దేవ్‌లా నాయక్, రత్నం, స్వామి , శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీ కృష్ణావతారంలో యాదాద్రి వాసుడు

- హంసవాహన అలంకారంలో దర్శించి తరించిన భక్తులు



మన తెలంగాణ/యాదాద్రి : శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి యాదాద్రి క్షేత్రంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పదకొండు పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో నాల్గవ రోజు అయిన మంగళవారం స్వామి వారి అలంకార శేవలో ఉదయం శ్రీ కృష్ణావతారంలో రాత్రి హంసవాహన అలంకార శేవలో భక్తులకు దర్శనమిచ్చాడు. బాలాలయంలో ఉదయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా చతుర్వేద పారాయణములు మూలమంత్ర జపములను స్తోత్ర పారాయణాలను పారాయణికులు నిర్వహించారు. ఆగమ శాస్త్ర అనుసారం అలంకార ప్రియుడైన శ్రీ నరసింహుడిన శ్రీ కృష్ణ రూపిడిగా అలంకరించి ఆలయంలో మేళతాళల మధ్య వేద మంత్రాలను ఉచ్ఛరిస్తు ఊరేగించారు. స్వామి వారి అలంకార శేవను ఆస్థాన మండపం వద్ద కొలువు తీర్చి భక్తులకు దర్శనం కల్పించగా వేద పండితులు అర్చకులు స్వామి వారి సేవ విశిష్ఠతను తెలియచేస్తు లోక రక్షణకై అవతారమైన శ్రీ కృష్ణవతారంలో లక్ష్మి నరసింహుని శేవ ఎంతో విశిష్ఠతమైనది అని తెలిపారు. సాయంత్రం ఆలయంలో నిత్య ఆరాధన మూల మంత్ర జపములను పారాయణములను గావించి శ్రీ స్వామి అమ్మవార్లను ఉత్సవ మూర్తులుగా అలంకరించి హంసవాహనుడిగా గావించి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. లోకంలోని అజ్ఞానంను తొలగించి జ్ఞానంను ప్రసాదించే తత్వంలోనే భాగమే హంసవాహన శేవ అని పండితులు తెలిపారు. ఈ మహోత్సవాల్లో ఆలయ యజ్ఞాచార్యులు సముద్రాల శ్రీనివాస చార్యులు, నల్లంధీగల్ నరసింహచార్యులు, కారంపొడి నరసింహచార్యులు, కాదూరి వెంకటచార్యులు, వేద పండితులు శ్రీనివాసశర్మ, వేణుగోపాలచారి, అర్చకుల బృందం, ఆలయ ఈఓ గీత, చైర్మన్ నరసింహమూర్తి, దేవాలయ సిబ్బం పాల్గొన్నారు.

బ్యాంక్‌కు కుచ్చుటోపీ

ఇద్దరు నిందితుల అరెస్టు

మన తెలంగాణ / సిటీబ్యూరో : నకిలీ ధృవీకరణ పత్రాలతో బ్యాంకుకు రూ. 1.50 కోట్లు బురిడీ కొట్టిన ఇద్దరు నిందితులను నగర సిసిఎస్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రుణగ్రహీత దూలం నాగేంద్ర, తాకట్టు పెట్టిన ఎం. లక్ష్మారెడ్డిలు ఇబ్రహీంపట్నం మండలం రాందాస్‌పల్లిలో 5.28 ఎకరాల భూమి ఉన్నట్టుగా ధృవీకరణ పత్రాలను సృష్టించారు. వీరిద్దరూ 2015లో మారేడుపల్లిలోని ఆంధ్రా బ్యాంక్‌లో తాకట్టు పెట్టి రూ. 1.50 కోట్ల రుణాన్ని తీసుకున్నారు. అనంతరం వాయిదా పద్ధతిలో చెల్లించాల్సిన నగదును చెల్లించలేదు. దీంతో బ్యాంకు అధికారులు భూమి తాకట్టుపెట్టిన దస్తావేజులను పరిశీలించగా అవి నకిలీవని, సృష్టించినవని తేలింది. దీంతో బ్యాంకు మేనేజర్ నగర సిసిఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు నాగేంద్ర, లక్ష్మారెడ్డిలను అరెస్టుచేశారు.

త్వరలో సర్వీసు రోడ్ల పూర్తి
రహదారి సమస్యలు పరిష్కరిస్తాం

- జిఎంఆర్ ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి



మన తెలంగాణ/చౌటుప్పల్ : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో జిఎంఆర్ ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, నేషనల్ హైవే అథారిటీస్ సంస్థ అధికారి జితేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రజాప్రతినిధులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. 65వ నెంబరు జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించినప్పటికీ చౌటుప్పల్ మండలంలోని అనేక గ్రామాల్లో వై జంక్షన్లు ఏర్పాటు చేయకపోవడం, సర్వీసు రోడ్లను, డ్రైనేజీ వ్యవస్థను అసంపూర్తిగా వదిలేయడం వంటి అనేక సమస్యలపై స్థానిక ప్రజాప్రతినిధులు ఇటీవల టోల్‌గేట్‌ను ముట్టడించారు. టోల్‌గేట్ వద్ద బైఠాయించి టోల్ వసూళ్లను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో జిఎంఆర్ టోల్‌గేట్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్థానిక జెడ్పిటిసి సభ్యుడు పెద్దిటి బుచ్చిరెడ్డి నాయకత్వంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ముఖాముఖీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలలో నిర్మించాల్సిన వై జంక్షన్ రోడ్లకు ఇంకా భూసేకరణ పూర్తి కాలేదన్నారు. ఇది ఇంకా నేషనల్ హైవే అథారిటీస్ సంస్థ పరిధిలోనే ఉందన్నారు. త్వరలో భూసేకరణ ప్రక్రియ పూర్తయితే తక్షణమే వై జంక్షన్లు ఏర్పాటు చేస్తామన్నారు. చౌటుప్పల్ పట్టణంలో మిగిలిపోయిన అసంపూర్తి సర్వీసు రోడ్లను త్వరలో పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. రోడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తామన్నారు. జాతీయ రహదారి వెంట లైటింగ్ వ్యవస్థను తక్షణమే పరిష్కరిస్తామన్నారు. జాతీయ రహదారిపై వెహికిల్ అండర్ పాసు బ్రిడ్జిలను నిర్మించనున్నట్లు తెలిపారు. చౌటుప్పల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ. వెంకటయ్య, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గోపాల్, వివిధ గ్రామాల సర్పంచులు దయాకరాచారి, సుర్వి మల్లేషంగౌడ్, నందగిరి మహేశ్వరీ, శ్యామ్, అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగ ఉపకులాలకు
సామాజిక న్యాయం దక్కాల్సిందే



మన తెలంగాణ / హైదరాబాద్ / ఉస్మానియా యూనివర్సిటీ : మాదిగ ఉపకులాలకు సామాజిక న్యాయం దక్కాల్సిన అవసరముందని ప్రజా గాయకుడు గద్దర్ పేర్కొన్నారు. తెలంగాణ స్టేట్ మాదిగ రిజర్వేషన్ పోరా ట సమితి, ఎస్సీ ఉపకులాల ఐక్య వేదిక రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం ఉస్మానియాయూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ఇసిఇ ఆడిటోరియంలో ''మాదిగ ఉపకులాల రాష్ట్ర సదస్సు' ను నిర్వహించారు. సదస్సులో గద్దర్ మాట్లాడుతూ 70 ఏళ్ళ స్వతంత్ర భారతంలో కూడా మాదిగ ఉపకులాలకు కనీస హక్కుల నోచుకోక పోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఉపకులాల ప్రజల డిమాండ్లను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రూ. వెయ్యి కోట్ల నిధులతో మాదిగ ఉపకులాల ప్రజలకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఉపకులాల విద్యార్థుల చదువు కోసం జిల్లాకు ఒక గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళు, కుటుంబానికి మూడు ఎకరాల భూమిని కూడా ప్రభుత్వం మాదిగ ఉపకులాలకు అందించాలన్నారు. టి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు యాతాకుల భాస్కర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లును ఈ పార్లమెంటు సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇందుకు రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అఖిలపక్ష బృందాన్ని డిల్లీకి తీసుకువెళ్ళాలన్నారు. బేడ బుడగజంగం హక్కుల దండు నాయకులు హనుమంతు మాట్లాడుతూ రాజకీయ రంగంలో మాదిగ ఉపకులాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ సభ్యులు సుంకపాక దేవయ్య మాదిగ, దక్కలి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు బాణాల మంగేష్, ఎస్‌సి ఉపకులాల ఐక్యవేదిక అధ్యక్షులు చింతల మల్లికార్జున్, రేణికుంట మురళి, గంధం రాజేష్ పాల్గొన్నారు.

రియాలిటీ షోకు రూ. 78 కోట్లు!



బుల్లితెరపై బిగ్ బాస్ రియాలిటీ షోకు ఎంతో క్రేజ్ ఉంది. హిందీలో ఈ రియాలిటీ షో హోస్ట్‌గా బాలీవుడ్ స్టార్ సల్మాన్‌ఖాన్ ఎంతో పేరుతెచ్చుకున్నాడు. అయితే పదేళ్ల క్రిందట చేసిన తన మొదటి రియాలిటీ షో 'దస్ కా దమ్' సీజన్ 3 కోసం సల్మాన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని తెలిసింది. ప్రస్తుతం చేస్తున్న బిగ్ బాస్ 11 అయిపోతోంది కాబట్టి సీజన్ 12కు చాలా సమయం ఉంటుంది. ఈలోపే సల్మాన్‌తో 'దస్ కా దమ్' సీజన్ 3 చేయాలని అనుకుంటున్నారట ఈ రియాలిటీ షో నిర్వాహకులు. ఇందుకుగాను సల్మాన్‌కు 78 కోట్ల రెమ్యునరేషన్ ఇవ్వబోతున్నారనే వార్త ఇప్పుడు సంచలనంగా మారింది. అయితే ఇందులో ఉండేది 26 ఎపిసోడ్లు మాత్రమేనట. అంటే ఒక్క గంట ఎపిసోడ్‌కు సల్మాన్‌కు అక్షరాల 3 కోట్లు అందజేస్తారట. సౌత్‌లో మంచి క్రేజ్ ఉన్న యంగ్ హీరో ఆరు నెలల పాటు ఓ సినిమా చేస్తే అంత మొత్తం అందజేస్తారు. అలాంటిది సల్మాన్ బ్రాండ్‌కు అంత విలువ కడుతున్నారంటే మామూలు విషయం కాదు. టైగర్ జిందా హై సినిమాతో మంచి ఊపు మీదున్న ఈ స్టార్ హీరో ప్రస్తుతం 'రేస్ 3' సినిమా షూటింగ్‌లో ఉన్నాడు.



విజయనిర్మల పుట్టినరోజు వేడుకలో కృష్ణ, నరేష్, నవీన్ విజయకృష్ణ

దాసరి అన్న ఆ మాటే నాకు పద్మభూషణ్‌తో సమానం : విజయనిర్మల

సీనియర్ నటీమణి, దర్శకురాలు, నిర్మాత, గిన్నిస్ బుక్ రికార్డ్ సాధించిన విజయనిర్మల తన 73వ జన్మదిన వేడుకలను మంగళవారం ఘట్టమనేని వంశాభిమానుల సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్‌కు 73 వేల రూపాయల చెక్‌ను అందజేశా రు. ఈ సందర్భంగా సూపర్‌స్టార్ కృష్ణ మాట్లాడుతూ ''అక్కినేని నాగేశ్వరరావు, రజనీకాంత్, శివాజీ గణేషన్ వంటి స్టార్ హీరోలతో సినిమా తీసిన ఏకైక లేడీ డైరెక్టర్ విజయనిర్మల. ఆమె దర్శకత్వంలో తెరకెక్కిన 44 చిత్రాల్లో సగానికి పైగా సినిమాల్లో నేను నటించినందుకు సంతోషంగా ఉంది. విజయనిర్మల పుట్టినరోజు సందర్భంగా ప్రతి ఏడాది మా ఇంటికి విచ్చేసి తమ అభిమానాన్ని చాటుకుంటున్న అభిమానులందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వారు గౌరవించిన విజయనిర్మలను త్వరలోనే భారత ప్రభుత్వం తగిన రీతిలో సత్కరిస్తుందని ఆశిస్తున్నాను''అని అన్నారు. విజయనిర్మల మాట్లాడుతూ ''ఒకసారి నా పుట్టిన రోజు వేడుకలకు దాసరి నారాయణరావు మా ఇంటికొచ్చి 'ఏ స్టార్ హీరోయిన్‌కి కూడా ఈ రేం జ్ క్రేజ్ లేదు' అని అన్నారు. అదే నాకు పద్మభూషణ్‌తో సమానం. నా పుట్టినరోజు వేడుకలకు హాజరైన అభిమానులందరికీ ధన్యవాదాలు''అని చెప్పారు. సీనియర్ పాత్రికేయులు, నిర్మాత బి.ఎ.రాజు మాట్లాడుతూ ''దాసరి, బాపు వంటి టాప్ డైరెక్టర్స్ ఫస్ట్ హీరోయిన్ విజయనిర్మల. అలాగే విజయశాంతిలాంటి స్టార్ హీరోయిన్‌ను 'కిలాడి కృష్ణుడు'తో తెలుగు తెరకు పరిచయం చే సింది కూడా విజయనిర్మలే. అంతటి ఘనత కలిగిన ఆమె పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ వేడుకలో సీనియర్ నరేష్, సూపర్‌స్టార్ కృష్ణ అభిమాన సంఘాల నాయకులు, సీనియర్ అభిమానులు పాల్గొన్నారు.

వినోదం ఎప్పుడూ విజయవంతమైన ఫార్ములానే



రాజేంద్రప్రసాద్, సాక్షి చౌదరి

రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రలో జెబి క్రియేషన్స్ పతాకంపై శ్రీమతి భాగ్యలక్ష్మి నిర్మించిన సినిమా 'ఊ.పె.కు.హ'. ఊళ్లో పెళ్లికి కుక్కల హడావుడి అనేది క్యాప్షన్. సాక్షి చౌదరి కథానాయికగా నటించిన ఈ చిత్రానికి 'నిధి' ప్రసాద్ దర్శకత్వం వహించారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ సినిమా ట్రైలర్‌ను రాజేంద్రప్రసాద్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ''సాధారణంగా సినిమాలు తీసేవాళ్లలో రెండు రకాలు ఉంటారు. కడుపులో నీళ్ల కదలకుండా హ్యాపీగా సినిమా తీసేవాళ్లు ఒకరు. ఎన్ని కష్టాలైనా పడి ప్రేక్షకులకు వినోదం ఇవ్వాలనుకునేవాళ్లు ఇంకొకరు. 'నిధి' ప్రసాద్ కూడా ఎంత కష్టపడైనా సరే ప్రేక్షకులకు మంచి వినోదాన్ని అందించాలనుకుంటాడు. సినిమాలో బోలెడు మంది ఆర్టిస్టులున్నారు. తనతో షూటింగ్ జరిగినంత సేపు తిట్టుకొని విడుదల తర్వాత హ్యాపీగా ఫీలయ్యే వాళ్లలో నేను ఒకడిని. ఇంతకుముందు అతనితో... అందరూ దొంగలే, మైఖేల్ మదన్ కామరాజు, భాగ్యలక్ష్మి బంపర్ డ్రా సినిమాలు చేశాను. ఈ సినిమా విషయానికొస్తే ప్రేక్షకులను పూర్తిగా నవ్వించే చిత్రమిది'' అని అన్నారు. దర్శకుడు 'నిధి' ప్రసాద్ మాట్లాడుతూ ''షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ఇందులో చాలా మంది నటీనటులు, హాస్య నటులు నటించారు. ప్రతి క్యారెక్టర్‌కి ఒక్కో క్యారెక్టరైజేషన్ ఉంటుంది. స్క్రిప్ట్ పరంగా చాలా సంక్లిష్టమైన చిత్రమిది. సినిమా బాగా వచ్చింది. ఆద్యంతం ప్రేక్షకులను నవ్విస్తుంది''అని తెలిపారు. జెబి క్రియేషన్స్ అధినేత విక్రమ్ మాట్లాడుతూ ''ప్రేక్షకులు పెట్టిన ప్రతి రూపాయికి ఈ సినిమా మంచి వినోదం అందిస్తుంది. 'నిధి' ప్రసాద్ చాలా రిస్క్ తీసుకొని ఈ సినిమా చేశారు. సినిమాకు పనిచేసిన నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎంతో సహకరించారు''అని పేర్కొన్నారు. సాక్షి చౌదరి మాట్లాడుతూ ''రాజేంద్రప్రసాద్‌తో నటించే అవకాశం దక్కినందుకు చాలా గొప్పగా అనిపించింది. వినోదం ఎప్పుడూ విజయవంతమైన ఫార్ములానే. అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ సినిమా మంచి విజయం సాధిస్తుందని నమ్ముతున్నాను''అని చెప్పారు.

గ్లామర్ డోస్ పెంచిన అనుపమా పరమేశ్వరన్



అనుపమ పరమేశ్వరన్

'ప్రేమమ్' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన మలయాళ భామ అనుపమా పరమేశ్వరన్. తొలి సినిమాతోనే తన టాలెంట్‌ను నిరూపించుకొని మంచి హిట్‌ను అందుకుంది ఈ భామ. అంతేకాదు లక్కీ బ్యూటీ అనిపించుకుంది. 'శతమానం భవతి' సినిమాతో సూపర్ హిట్‌ను అందుకున్న ఈ ముద్దుగుమ్మ రామ్‌తో నటించిన 'ఉన్నది ఒక్కటే జిందగీ' చిత్రంతో పర్వాలేదనిపించుకుంది. అయితే తన టాలెంట్‌కు సక్సెస్‌తో సంబంధం లేదని అంటోంది ఈ భామ. వరుసగా సినిమాలు చేయాలనుకోవడం లేదని చెబుతున్న అనుపమ మంచి ప్రాధాన్యత ఉన్న క్యారెక్టర్‌లకే ఓకే చెబుతోందట. ప్రస్తుతం ఆమె సాయిధరమ్‌తేజ్‌కు జోడీగా కరుణాకరన్ దర్శకత్వంలో ఓ ప్రేమ కథా చిత్రంలో నటిస్తోంది. కరుణాకరన్ తన సినిమాల్లో హీరోయిన్లను చాలా అందంగా చూపిస్తాడు. ఇక ఈ ప్రేమ కథా చిత్రంలో అనుపమ గ్లామర్ డోస్‌ను పెంచిందట. టాలీవుడ్‌లోని యంగ్ బ్యూటీలకు ధీటుగా ఈ చిత్రంలో ఆమె అందాలొలికిస్తోందట. మంచి నటిగానే కాదు గ్లామరస్ తారగా పేరుతెచ్చుకోవాలని కోరుకుంటోంది అనుపమా పరమేశ్వరన్.

'బృందావనం' నాటి లుక్ కోసం..




దర్శకుడు త్రివిక్రమ్‌తో సినిమా మొదలయ్యేలోపు ఎన్టీఆర్ బాగా సన్నబడేందుకు ప్రయత్నిస్తున్నాడట. వీరి కాంబినేషన్‌లో తెరకెక్కే సినిమా పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కావడంతో మళ్లీ 'బృందావనం' నాటి లుక్ కోసం ఎన్టీఆర్ కష్టపడుతున్నాడు. సన్నబడేందుకు ఈ స్టార్ హీరో కొన్ని వారాల నుంచి జిమ్‌లో తెగ వర్కవుట్స్ చేస్తున్నాడట. దీనికి సంబంధించిన ఓ వీడియో ఇప్పుడు బయటకు వచ్చింది. ఫిట్‌నెస్ ట్రైనర్ లాయిడ్ స్టీవెన్స్ పర్యవేక్షణలో ఎన్టీఆర్ జిమ్‌లో తెగ కష్టపడుతున్నాడు. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కే సినిమా కోసం అతను ప్రతి రోజు జిమ్‌లో భారీగా కసరత్తులు చేస్తున్నాడు. ఇటీవల వచ్చిన త్రివిక్రమ్ చిత్రం 'అజ్ఞాతవాసి' నిరాశపరచడంతో ఎన్టీఆర్ సినిమా కొంత ఆలస్యమైంది కానీ లేకపోతే ఈ పాటికే షూటింగ్ ప్రారంభం కావాల్సి ఉంది. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్‌ను కొంత మార్చే పనిలో ఉన్నాడు త్రివిక్రమ్. మరోవైపు ఎన్టీఆర్ కూడా తన ఫిజిక్‌పై పూర్తిగా దృష్టిపెట్టాడు. ఇక ఈ క్రేజీ కాంబినేషన్‌లో తొలిసారిగా వస్తున్న ఈ చిత్రంపై అంచనాలు భారీగానే ఉన్నాయి. వరుస హిట్లతో దూసుకుపోతున్న ఎన్టీఆర్‌కు ఈ చిత్రం అతని విజయ పరంపరను కొనసాగిస్తుందా అనేది చూడాల్సిందే.

కొత్త దర్శకుడితో బెల్లంకొండ చిత్రం

యంగ్ హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్ మరో సినిమాకు సైన్ చేశాడు. పలు సూపర్‌హిట్ చిత్రాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన శ్రీనివాస్ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని వంశధార క్రియేషన్స్ పతాకంపై నవీన్ సొంటినేని (నాని) నిర్మించనున్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత నవీన్ సొంటినేని మాట్లాడుతూ ''బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా తెరకెక్కనున్న ఈ చిత్రంతో మా బ్యానర్‌ను ప్రారంభిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. దృశ్యం, గోపాల గోపాల, డిక్టేటర్ లాంటి సూపర్ హిట్ సినిమాలకు సహాయ దర్శకుడిగా పనిచేసిన శ్రీనివాస్ అద్భుతమైన కథను సిద్ధం చేశారు. సీనియర్ టెక్నీషియన్స్ ఈ చిత్రానికి పనిచేయనున్నారు. ఈ చిత్రం కోసం కెమెరామెన్ చోటా కె.నాయుడు, మ్యూజిక్ డైరెక్టర్ తమన్, ఆర్ట్ డైరెక్టర్ చిన్నాను ఎంపిక చేయడం జరిగింది. త్వరలోనే మిగతా నటీనటులు, సాంకేతిక నిపుణులను ప్రకటిస్తాం. ఈనెల 22న హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో మా ప్రొడక్షన్ నం.1 చిత్రం ప్రారంభోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించనున్నాం''అని అన్నారు.



భారత్, పాక్ యుద్ధం నేపథ్యంలో..



మోహన్‌లాల్, అల్లు శిరీష్

1971లో భారత సరిహద్దుల్లో జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా మలయాళంలో తెరకెక్కిన చిత్రం '1971 బియాండ్ బార్డర్స్'. మేజర్ రవి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో మలయాళం సూపర్‌స్టార్ మోహన్‌లాల్, అల్లు శిరీష్ ప్రధాన పాత్రల్లో నటించారు. గత ఏడాది మలయాళంలో ఘన విజయం సాధించిన ఈ చిత్రాన్ని జాష్ రాజ్ ప్రొడక్షన్స్, శ్రీలక్ష్మి జ్యోతి క్రియేషన్స్ బ్యానర్‌లపై ఏ.యన్.బాలాజీ 'యుద్ధభూమి' పేరుతో తెలుగులోకి అనువదిస్తున్నారు. ప్రస్తుతం అల్లు శిరీష్ డబ్బింగ్ చెబుతున్నారు. త్వరలో డబ్బింగ్ కార్యక్రమాలు పూర్తిచేసి ఈ నెలాఖరున ఆడియోను విడుదల చేసి మార్చిలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత ఏ.యన్.బాలాజీ మాట్లాడుతూ ''ఈ చిత్రం దర్శకుడు రవి 1981లో సైన్యంలో చేరి మేజర్‌గా అనేక కీలక ఆపరేషన్స్‌లో పాల్గొన్నారు. ఇక ఆయన చిత్ర పరిశ్రమలోకి ప్రవేశించి దర్శకుడిగా సైన్యం ఆపరేషన్స్‌కు సంబంధించిన కొన్ని యదార్థ సంఘటనల ఆధారంగా ఎన్నో చిత్రాలను తెరకెక్కించారు. మేజర్ రవి ప్రతి సినిమా ఆర్మీ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటూ యువతలో దేశభక్తిని కలిగిస్తూ విజయం సాధించినవే. ఈ చిత్ర కథ విషయానికొస్తే... 1971లో భారత్‌పాక్ సరిహద్దులో జరిగే యుద్ధం నేపథ్యంలో ఎమోషనల్ డ్రామాగా ఈ సినిమా రూపొందింది. ఈ చిత్రంలో మేజర్‌గా మోహన్‌లాల్, సైనికుడిగా అల్లు శిరీష్ నటించారు. త్వరలో పోస్ట్ ప్రొడక్షన్ పనులను పూర్తిచేసి ఈ నెలాఖరున ఆడియోను విడుదల చేసి, మార్చి మొదటి వారంలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం''అని అన్నారు. ఈ చిత్రానికి సంగీతంః సిద్ధార్థ్ విపిన్, డైలాగ్స్ః ఎం.రాజశేఖర్ రెడ్డి, కెమెరాః సుజిత్ వాసుదేవ్.

అమెరికాలో 'గూఢచారి'

'క్షణం' లాంటి హిట్ అనంతరం అడివి శేష్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'గూఢచారి'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నేతృత్వంలో అభిషేక్ పిక్చర్స్‌విస్టా డ్రీమ్ మర్చంట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి శశికిరణ్ తిక్క దర్శకుడు. అడివి శేష్ ఈ చిత్రానికి కథ సమకూర్చగా తెలుగు అమ్మాయి శోభిత ధూళిపాళ్ల కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రం తాజా షెడ్యూల్ అమెరికాలో జరుగుతోంది. ఈ సందర్భంగా నిర్మాతలు అభిషేక్ నామా, టి.జి.విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ మాట్లాడుతూ ''ఇప్పటివరకు తెలుగు తెరపై చూడని సరికొత్త కాన్సెప్ట్‌తో 'గూఢచారి' తెరకెక్కుతోంది. అడివి శేష్ ఈ చిత్రంలో ఒక స్పై పాత్రలో కనిపించనున్నారు. ఇటీవల విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్‌కు మంచి స్పందన వచ్చింది. ప్రస్తుతం అమెరికాలో కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. హై టెక్నికల్ వాల్యూస్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభూతిని కలిగిస్తుంది. వేసవి కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నాం''అని అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః షానిల్ డియో, సంగీతంః శ్రీచరణ్ పాకాల, ఎడిటర్ః గ్యార్ బి.హెచ్, మాటలుః అబ్బూరి రవి.



అడివి శేష్

రాశీకి బంపర్ ఆఫర్?



రాశీఖన్నా

వరుణ్‌తేజ్‌తో కలిసి నటించిన 'తొలిప్రేమ' చిత్రంతో యంగ్ బ్యూటీ రాశీఖన్నా మంచి హిట్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఈ చిత్రంలో తన నటనతో ప్రేక్షకులను మెప్పించింది ఈ భామ. గ్లామరస్‌గా ఉండే పాత్రలతో పాటు తాను నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలు కూడా చేయగలనని ఈ చిత్రంతో నిరూపించింది. రవితేజతో చేసిన 'టచ్ చేసి చూడు' నిరాశపరిచినా 'తొలిప్రేమ' అందించిన విజయంతో రాశీఖన్నా ఎంతో సంతోషంగా ఉంది. ఈ నేపథ్యంలో ఈ ముద్దుగుమ్మకు ఓ బంపర్ ఆఫర్ తగిలినట్టు సమాచారం. రామ్‌చరణ్, ఎన్టీఆర్‌లతో తీయబోయే మల్టీస్టారర్‌లో ఒక హీరోయిన్‌గా రాశీఖన్నా వైపు రాజమౌళి మొగ్గుచూపుతున్నట్టు తెలిసింది. చరణ్ సరసన ఆమె అయితే బాగుంటుందని భావించాడట. దీపావళి లేదా దసరాకు షూటింగ్ ప్రారంభమయ్యే ఈ ప్రతిష్టాత్మక చిత్రం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో రాజమౌళి బిజీగా ఉన్నాడు. ఒకవేళ రాశీఖన్నాకు ఈ సినిమాలో ఛాన్స్ దక్కితే మాత్రం ఆమెకు అదృష్టం తలుపుతట్టినట్టే. రాజమౌళి తన సినిమాల్లో హీరోయిన్ల పాత్రలను మంచి గుర్తింపువచ్చేటట్టు డిజైన్ చేస్తాడు. అందులోనూ ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కే ఈ చిత్రంలో రాశి నటిస్తే అది ఆమె కెరీర్‌కు ఎంతో ప్లస్ అవుతుంది. గత ఏడాది ఎన్టీఆర్‌తో 'జై లవ కుశ' చిత్రంలో నటించిన రాశీ ఇప్పుడు చరణ్ పక్కన నటిస్తే అది స్పెషల్‌గా ఉంటుంది.

రెజీనా బాలీవుడ్ ఎంట్రీ

కొందరు టాలీవుడ్ భామల అదృష్టం ఏమిటో కానీ ఈమధ్య సక్సెస్, ఫెయిల్యూర్‌తో సంబంధం లేకుండా మంచి అవకాశాలను దక్కించుకుంటున్నారు. ఎక్స్‌పోజింగ్ విషయంలో ఏమాత్రం వెనుకాడని భామలకే ఇటువంటి ఆఫర్లు వస్తున్నాయి. ఇటీవల రెజీనా కూడా అలాంటి పాత్రల్లో కనిపిస్తుండడంతో ఆమెకు సౌత్‌లో మంచి డిమాండ్ ఏర్పడింది. ఇటీవల 'అ!' సినిమాలో ఆమె చేసిన పాత్రకు మంచి గుర్తింపువచ్చింది. డ్రగ్స్‌కు బానిసగా మారిన అమ్మాయి పాత్రలో నటించిన ఆమె ప్రేక్షకులను మెప్పించింది. ఈ నేపథ్యంలో రెజీనాకు బాలీవుడ్‌లో ఓ లక్కీ ఆఫర్ దక్కినట్లు తెలిసింది. ఇప్పటివరకు తెలుగు, తమిళ చిత్రాల్లో దర్శనిమిచ్చిన ఈ హాట్ బ్యూటీ ఇప్పుడు బాలీవుడ్‌లో ప్రవేశించనుంది. షెల్లీ చోప్రా దర్శకత్వంలో 'ఏక్ లడ్కీ కో దేఖా తో ఐసా' అనే హిందీ చిత్రం తెరకెక్కనుంది. సోనమ్‌కపూర్, అనిల్ కపూర్ ప్రధాన పాత్రల్లో నటించనున్నారు. అయితే ఈ సినిమాలో ఒక డిఫరెంట్ లేడీ రోల్ కోసం చిత్ర యూనిట్ గత కొంతకాలంగా చాలా మందికి ఆడిషన్ నిర్వహించారు. అయితే చివరికి ఈ పాత్రకు రెజీనా అయితే కరెక్ట్‌గా సెట్ అవుతుందని దర్శక నిర్మాతలు ఫైనల్ చేశారట. మరి ఈ లక్కీ ఛాన్స్‌తో రెజీనా బాలీవుడ్‌లో నిలదొక్కుకుంటుందో లేదో చూడాలి.



రెజీనా

విపుల్ అంబానీ, మరో నలుగురి అరెస్ట్

న్యూఢిల్లీ: బిలియనీర్ నిరవ్ మోడీ సంస్థకు చెందిన ఆర్థిక వ్యవహారాలను చూసుకునే ఎగ్జిక్యూటివ్ విపుల్ అంబానీ, మరో నలుగురిని మంగళవారం సాయంత్రం సిబిఐ అధికారులు అరెస్టు చేశారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ మోసం కేసులో దర్యాప్తు జరిపిన అనంతరం వీరిని సిబిఐ అరెస్టు చేసింది. ఫైర్‌స్టార్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ ప్రెసిడెంట్ విపుల్ అంబానీ, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ కవితా మన్కికర్, అర్జున్ పాటిల్‌లు అరెస్టయిన వారిలో ఉన్నారు.సిబిఐ ఇప్పటికే పిఎన్‌బికి చెందిన ఐదుగురు అధికారులను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. డైమండ్ వ్యాపారీ నిరవ్ మోడీ, ఆయన మామ మెహుల్ చోక్సీలకు చెందిన ప్రైవేటు కంపెనీల సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు భారీగా బ్యాంకుల్లో మోసాలకు పాల్పడ్డారని సిబిఐ గుర్తించింది. కాగా గీతాంజర్ జెమ్స్ ప్రమోటర్లు మెహుల్ చోక్సీ, ఆయనకు చెందిన సంస్థలకు చెందిన 20 ప్రాంగణాల్లో ఆదాయం పన్ను శాఖ దాడులు నిర్వహించింది. చోక్సీ, గీతాంజలి జెమ్స్‌కు సంబంధించిన 13 కంపెనీలపై ముంబై, పుణె, సూరత్, హైదరాబాద్, బెంగళూరు, మరికొన్ని పట్టణాల్లో దాడులు నిర్వహించారు. చోక్సీ, గీతాంజలి జెమ్స్‌కు చెందిన ఆస్తులు, బ్యాంకు ఖాతాలను జప్తు చేసినట్టు అధికారులు ప్రకటించారు.

అమ్మకాలు వెల్లువెత్తడంతో నష్టపోయిన సూచీలు

ముంబై: అమ్మకాలు వెల్లువెత్తడంతో మంగళవారం స్టాక్‌మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. విదేశీ ఇన్వెస్టర్లు భారీ అమ్మకాలు, ట్రేడర్ల లాభాల స్వీకరణ, డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగింపు నేపథ్యంలో ఇన్వెస్టర్ల అప్రమత్తంగా వ్యవహరించారు. దీంతో సెన్సెక్స్ 71పాయింట్లు నష్టపోయి 33703 పాయింట్లు వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 18పాయింట్లు నష్టపోయి 10360 వద్ద స్థిరపడింది. కీలకమైన బ్యాంక్ నిఫ్టీ 184 పాయింట్లు నష్టపోయి 24,874 పాయింట్ల వద్ద ముగిసింది. సెక్టార్ల పరంగా చూస్తే బ్యాంకింగ్, రియల్టీ, ఫైనాన్షియల్, అటో, రంగాలకు చెందిన షేర్లు నష్టపోగా, పియుసి బ్యాంక్, మెటల్, మీడియా, ఐటీ రంగాలకు చెందిన షేర్లు లాభపడ్డాయి. పిఎన్‌బి కుంభకోణం ఉదంతం నేపథ్యంలో సూచీలు ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. ఓ దశలో లాభాల్లో ట్రేడ్ అయ్యాయి. ఈ సమయంలోనే సెన్సెక్స్ 33,960.95 వద్ద, నిఫ్టీ 10,429 పాయింట్ల ఇంట్రాడే గరిష్టాన్ని నమోదు చేసాయి. యారప్ మార్కెట్లు ఫ్లాట్‌గా ప్రారంభం కావడంతో సూచీలు కొంత వెనకడుగు వేశాయి. అయితే చివరి గంటలో ఎఫ్ఐఐలు భారీగా అమ్మకాలు జరిపారు. ముఖ్యంగా బ్యాంకింగ్, రియల్టీ, ఫైనాన్షియల్ సెక్టార్ రంగాలకు షేర్లు తీవ్రమైన అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఏసియన్ పెయింట్స్, ఇన్ఫ్రాటెల్, కోల్ ఇండియా, వేదాంత, అంబుజా సిమెంట్స్ షేర్లు 1 నుంచి 3 శాతం లాభపడ్డాయి. యస్ బ్యాంక్, అరబిందో ఫార్మా, కోటక్ బ్యాంక్, యాక్సిక్ బ్యాంక్, ఎంఅండ్ ఎం షేర్లు నష్టపోయాయి.



స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	33703.59	–71.07	–0.21%
నిఫ్టీ	10360.40	–18.00	–0.17%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్





బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	29220	31251.34	–0.48%
ముంబై	30210	32310.16	–0.1%
ఢిల్లీ	30000	32085.56	–0.33%
కోల్‌కతా	30350.99	32460.95	0.43%
కేరళ	28400	30374.33	–0.35%
బెంగళూరు	28850	30855.61	0%
హైదరాబాద్	29220	31251.34	–0.48%
గల్ఫ్	1432.89	1532.50	0.15%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	మంగళవారం	సోమవారం	మార్పు (%)
చెన్నై	41200.00	41600.00	–0.96
ముంబై	41200.00	41600.00	–0.96
ఢిల్లీ	41200.00	41600.00	–0.96
కోల్‌కతా	41200.00	41600.00	–0.96
హైదరాబాద్	41200.00	41600.00	–0.96



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు


హైదరాబాద్	355	విశాఖపట్నం	375
వరంగల్	367	చిత్తూరు	408
విజయవాడ	375	చెన్నై	415
గోదావరి	375	బెంగళూరు	405

ఆడిటర్లు, మేనేజ్‌మెంట్‌దే తప్పు

మోసాన్ని గుర్తించడంలో అంతర్గతంగా, బహిర్గతంగా విఫలం

- సిఎలు ఆత్మపరిశీలన చేసుకోవాలి
- పిఎన్‌బి కుంభకోణంపై


కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ



న్యూఢిల్లీ: బిలియనీర్ నీరవ్ మోడీ రూ.11,400 కోట్ల కుంభకోణంపై ఎట్టకేలకు కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ నోరు విప్పారు. ఇది మేనేజ్‌మెంట్, ఆడిటర్ల తప్పిదం ఫలితంగానే జరిగిందని, బ్యాంకింగ్ వ్యవస్థను మోసం చేసిన వారినెవరినీ ప్రభుత్వం వదలబోదని హెచ్చరించారు. యాజమాన్యానికి అధికారాలు ఇచ్చినప్పుడు వాటిని సరిగ్గా, ప్రభావవంతంగా వినియోగించుకోవాలని.. తప్పిదాలను తెలుసుకోనట్లయితే మేనేజ్‌మెంట్ ప్రశ్నలను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఎడిఎఫ్ఐఎపి(అసోసియేషన్ ఆఫ్ డెవలప్‌మెంట్ ఫైనాన్సింగ్ ఇనిస్టిట్యూషన్స్ ఇన్ ఆసియా అండ్ ద పసిఫిక్) వార్షిక సమావేశంలో జైట్లీ ఈ విధంగా అన్నారు. 'ఆడిటర్లు ఏమి చేశారు? అంతర్గతంగా, బహిర్గతంగా ఆడిటర్లు పరిశీలించాలి. అలా జరగనట్లయితే ఆ తర్వాత సిఎ వృత్తి నిపుణులు అన్ని విషయాలను క్షుణ్ణంగా పరిశీలించాలి. సూపర్‌వైజరీ ఏజెన్సీలు కూడా కంపెనీల్లో ఏమి జరుగుతుందో తప్పనిసరిగా స్వయం పరిశీలన చేసుకోవాలి' అని ఆయన అన్నారు. బ్యాంకుల పనితీరుపై జైట్లీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణదాతలు, రుణగ్రస్తులు సత్సంబంధాలను కొనసాగించాలని.. నమ్మకంపైనే బ్యాంకుల పనితీరు ఆధారపడి ఉంటుందని అన్నారు. ఎవరు మోసాలకు పాల్పడుతున్నారో గుర్తించలేనప్పుడు యాజమాన్యం మనుగడ సాధించలేదని ఆర్థికమంత్రి అన్నారు. పన్ను చెల్లింపుదారులు, వసూళ్లు పెరిగాయని, అయితే తాము వారికి దూరంగానే ఉంటున్నామని అన్నారు. దాదాపు 120 షెల్ కంపెనీలు (బోగస్ సంస్థలు) గుర్తించామని ఇంతకుముందు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) వెల్లడించిందని, వీటిలో 80 కంపెనీలకు నిరవ్ మోడీ, ఆయన మామ మెహుల్ చోక్సీ నడుపుతున్నాడని తెలిసిందని జైట్లీ అన్నారు. ఈ కుంభకోణం కేసులో గీతాంజర్ జెమ్స్ ప్రమోటర్లు మెహుల్ చోక్సీ, ఆయనకు చెందిన సంస్థలకు చెందిన 20 ప్రాంగణాల్లో ఆదాయం పన్ను శాఖ దాడులు నిర్వహించిందని తెలిపారు. చోక్సీ, గీతాంజలి జెమ్స్‌కు సంబంధించిన 13 కంపెనీలపై ముంబై, పుణె, సూరత్, హైదరాబాద్, బెంగళూరు, మరికొన్ని పట్టణాల్లో దాడులు నిర్వహించారు. చోక్సీ, గీతాంజలి జెమ్స్‌కు చెందిన ఆస్తులు, బ్యాంకు ఖాతాలను అటాచ్ చేసినట్టు జైట్లీ వివరించారు. దాదాపు 1.77 బిలియన్ డాలర్ల (రూ. 11,346 కోట్లు) మోసం పిఎన్‌బిలో జరిగింది. నీరవ్ మోడీ, గీతాంజలి గ్రూపుల సంస్థలపై ఇడి, సిబిఐలు అనేక దాడులు నిర్వహించాయి. ఇప్పటికే బ్యాంకు నియంత్రణ వ్యవస్థలను తమ అధీనంలోకి తీసుకున్నామని, వాటన్నింటినీ పరిశీలిస్తున్నామని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. పిఎన్‌బి కుంభకోణం కేసులో మాజీ డిప్యూటీ జనరల్ మేనేజర్ గోకుల్‌నాథ్ శెట్టి, సింగిల్ విండో క్లర్క్ మనోజ్ కరత్‌లను సిబిఐ అరెస్ట్ చేసింది. వీరిని స్పెషల్ కోర్టు 14 రోజుల పోలీస్ కస్టడీకి తరలించింది.

బ్రాండ్‌ను నాశనం చేశారు

- వ్యాపారాలు దెబ్బతిన్నాయి
- డబ్బు తిరిగి చెల్లించే అవకాశాన్ని తగ్గించేశారు
- పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు నీరవ్ మోడీ లేఖ



ముంబై: వేల కోట్ల బ్యాంక్ రుణాలను చెల్లించకుండా విదేశాలకు పారిపోయిన నీరవ్ మోడీ పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి)పై అక్కసు వెళ్లగక్కాడు. భారీ కుంభకోణం అంతా తప్పంటూ పిఎన్‌బిపై విమర్శలు గుప్పించాడు. 'నా బ్రాండ్, ప్రతిష్టను నాశనం చేశావ్' అంటూ డైమండ్ వ్యాపారీ నీరవ్ మోడీ పిఎన్‌బికి సుదీర్ఘ లేఖ రాశాడు. బ్యాంకు అధికారులు, జువెలరీ సంస్థకు చెందిన పతినిధుల మధ్య చర్చలు కొనసాగుతున్నాయని అన్నారు. తాను ఈ లేఖను 2018 ఫిబ్రవరి 15న రాసినట్టు నీరవ్ చెప్పుకొచ్చాడు. అయితే ఇటీవల బ్యాంక్ అధికారులు చేపట్టిన చర్యలు, మీడియా ప్రకటనలు బాధకు గురిచేశాయన్నారు. రూ.11 వేల కోట్లకు పైగా నీరవ్ మోడీ అప్పులను కల్గి ఉన్నారని మీడియాలో పేర్కొంటున్నవి అంతా తప్పు అని, బ్యాంక్‌కు తన అప్పులు తక్కువే అనే తెలుసని లేఖలో మోడీ పేర్కొన్నారు. బ్యాంకుకు అప్పులను కట్టే అవకాశాన్ని తగ్గించేశారని, బ్యాంకు చర్యల కారణంగా తాను అప్పులను కట్టగలిగే పరిస్థితి లేకుండా అన్ని మార్గాలను మూసుకుపోయాయని ఆయన పేర్కొన్నారు. తన కుటుంబసభ్యులపై కేంద్ర దర్యాప్తు సంస్థలు కేసులు నమోదు చేశాయని, వారికి దీనితో ఎలాంటి సంబంధం లేదని చెప్పుకొచ్చారు. 'నా నుంచి చెల్లించాల్సిన డబ్బును త్వరగా రాబట్టుకోవాలని తొందపడి.. మీరు నా ఆఫర్‌ను అంగీకరించడానికి బదులుగా విషయాన్ని బహిర్గతం చేశారు' అని నీరవ్ లేఖలో పేర్కొన్నారు. బహిర్గతం వల్ల తన సంస్థ బ్రాండ్ విలువ పడిపోవడమే కాకుండా వ్యాపారాలు దెబ్బతిన్నాయి. డబ్బు తిరిగి చెల్లించే అవకాశాన్ని తగ్గించేశారని నీరవ్ లేఖలో చెప్పారు. ఫిబ్రవరి 14న దాదాపు రూ.11,400కోట్ల భారీ మోసాన్ని పీఎన్‌బీ బహిర్గతం చేసింది. అయితే ఫిబ్రవరి 13 నుంచి 15 తేదీల మధ్య నీరవ్ మోడీ, బ్యాంకు అధికారుల మధ్య ఈమెయిల్స్ ద్వారా చర్చ జరిగింది. తన ఫైర్‌స్టార్ గ్రూప్, ఇతర విలువైన ఆస్తులు అమ్మడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. దేశీయంగా తన వ్యాపారం విలువ రూ.6,500కోట్లు ఉంటుందని నీరవ్ తెలిపారు. దీని ద్వారా కొంత డబ్బు చెల్లించవచ్చని, అందుకు అవకాశం లేకుండా తన బ్యాంకు ఖాతాలు, ఆస్తులు సీజ్ చేశారని తెలిపారు. తన ఫైర్‌స్టార్ ఇంటర్నేషనల్, ఫైర్‌స్టార్ డైమండ్ ఇంటర్నేషనల్ కంపెనీలు ఏ బ్యాంకుకు అప్పు తెలిపారు. ఈ కుంభకోణంతో దాదాపు రూ.11వేల కోట్లు నష్టపోయినట్లు పిఎన్‌బి ఎఫ్ఐఆర్‌లో పేర్కొందని, బ్యాంకు చెప్తున్న మొత్తం పూర్తిగా తప్పని నీరవ్ ఆరోపించారు. చివరగా తనకు బ్యాంకు సహకరించాలని, చెల్లించాల్సిన డబ్బు తిరిగి చెల్లించేందుకు బ్యాంకు మద్దతు అవసరమని అన్నారు. తన భార్యకు తన వ్యాపారంతో ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. తన మామ ఛోక్సీది వేరే వ్యాపారమని, తన బ్యాంకు లావాదేవీలతో ఆయన కంపెనీకి ఎలాంటి సంబంధం లేదని నీరవ్ చెప్పారు. తర్వాతి పరిణామాలేవైనా తాను ఎదుర్కొంటానని స్పష్టం చేశారు. తన కంపెనీలకు చెందిన దాదాపు 2,200 మంది ఉద్యోగులకు జీతాలు చెల్లించేందుకు బ్యాంకు అనుమతి ఇవ్వాలని చివరగా ఆయన లేఖలో కోరారు. మూడు భాగస్వామ్య కంపెనీలకు బయ్యర్స్ క్రెడిట్ ఫెసిలిటీ పెంచడం ద్వారా కోట్లాది రూపాయలను చార్జీల రూపంలో బ్యాంక్ పొందింది. వడ్డీతో సహా మొత్తాన్ని చెల్లించేందుకు సంస్థలకు బ్యాంకులు అవకాశం ఇచ్చింది.

ఏడు నెలలుగా ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్‌ను నియమించలేదు



న్యూఢిల్లీ : ఏడు నెలలు కావొస్తున్నా ఆర్‌బిఐ ఇప్పటి వరకు పూర్తిస్థాయి డిప్యూటీ గవర్నర్‌ను నియమించలేదు. ఈ కారణంగా ప్రభుత్వరంగ, ప్రవైటురంగ బ్యాంకుల పర్యవేక్షణ చూసే వారే లేకుండాపోయారు. జూలైలో ఎస్ఎస్ ముంద్రా పదవీ విరమణ చేసిన తర్వాత ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ పదవికీ ఖాళీ ఏర్పడిన విషయం తెలిసిందే. ఏడు నెలలుగా ఈ పదవిలో ఎవరినీ నియమించకపోవడంతో పనులు పెండింగ్‌లో పడిపోతున్నాయి. డిప్యూటీ గవర్నర్లు విరాల్ ఆచార్య, బిపి కనుంగో, ఎన్ఎస్ విశ్వనాథన్‌ల ర్యాంకుల్లో ఉన్నతస్థాయికి చేరుకున్నారు. అయినప్పటికీ బ్యాంకుల పనితీరును పర్యవేక్షించే పూర్తిస్థాయి హెడ్ లేరు. బ్యాంకుల కార్యకలాపాలను తనిఖీలు చేయడంలో బ్యాంకింగ్ పర్యవేక్షణ విభాగం పాత్ర కూడా ఉంది. ఆరేళ్లుగా కొనసాగుతున్న రూ.11,300కోట్ల భారీ మోసంపై వస్తున్న ఆరోపణలపై ఈ ఏడాది జనవరిలో పిఎన్‌బి గుర్తించేంత వరకూ కూడా ఆర్‌బిఐ కనిపెట్టడంలో ఆ సంస్థ విఫలమైనట్లు కనిపిస్తోంది. దీంతో ఆర్‌బిఐ పైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పిఎన్‌బి రేటింగ్ తగ్గిస్తాం

- పెరిగిన బ్యాంక్ నష్టాలు, తుడిచిపెట్టుకుపోయిన నికర విలువ
- అంతర్జాతీయ రేటింగ్ సంస్థలు మూడీస్, ఫిచ్ హెచ్చరికలు



ముంబై: నీరవ్ మోడీ కుంభకోణంతో అవస్థలు పడుతున్న పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి)కు మరో షాక్ తగిలింది. రేటింగ్‌ను తగ్గించనున్నట్టు అంతర్జాతీయ రేటింగ్ సంస్థలు మూడీస్ ఇన్వెస్టర్ సర్వీస్, ఫిచ్ రేటింగ్ హెచ్చరించాయి. పిఎన్‌బి విశ్వసనీయతపై ఈ రెండు సంస్థలు పలు అనుమానాలు వ్యక్తం చేశాయి. దేశంలో రెండో అతిపెద్ద ప్రభుత్వరంగ బ్యాంక్ నష్టాలు పెరగడం, బ్యాంక్ నికర విలువ తుడిచిపెట్టుకుపోవడం వంటి పరిణామాల నేపథ్యంలో రేటింగ్‌ను తగ్గించనున్నట్టు గ్లోబల్ రేటింగ్ సంస్థలు చెప్పాయి. రూ.11,400 కోట్ల కుంభకోణ నేపథ్యంలో పిఎన్‌బి రేటింగ్‌ను నెగిటివ్‌లోకి మార్చనున్నట్టు రేటింగ్ ఏజెన్సీలు ప్రకటించాయి. బ్యాంకింగ్ చరిత్రలోనే పెద్ద కుంభకోణం పిఎన్‌బిలో చోటుచేసుకుంది. బిలియనీర్ నీరవ్ మోడీ ఈ మోసానికి పాల్పడడం, ఎల్ఓయు(లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్) ద్వారా పెద్దమొత్తంలో బ్యాంక్‌కు కుచ్చుటోపీ పెట్టడం అందరినీ విస్మయానికి గురిచేసింది.

'బిబి' రేటింగ్: ఫిచ్



అంతర్గతంగా, బహిర్గతంగా బ్యాంక్ రిస్క్ కంట్రోల్‌పై అనేక సందేహాలు వెల్లువెత్తుతున్నాయని ఫిచ్ పేర్కొంది. గత కొన్నేళ్లుగా ఈ కుంభకోణం జరుగుతున్నా.. ఎవరూ గుర్తించకపోవడం నిర్వహణ పర్యవేక్షణ నాణ్యతా లోపాన్ని ఎత్తిచూపుతుందని తెలిపింది. పిఎన్‌బికి ప్రతికూల పరిశీలనలో ఆచరణ సాధ్యత రేటింగ్ 'బిబి'ను ఇస్తున్నట్టు ఫిచ్ రేటింగ్స్ ప్రకటించింది. ఇది ఆర్థిక సంస్థ క్రెడిట్ విలువను అంచనావేస్తుందని, ఇది సంస్థ విఫలమైనట్టు సూచిస్తుందని ఫిచ్ వెల్లడించింది.


ప్రతికూల రేటింగ్‌లో బ్యాంక్: మూడీస్



అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ కూడా తెలిపింది. ప్రతికూల రేటింగ్ పరిశీలనలో ఉందని.. సంస్థ రేటింగ్‌ను డౌన్‌గ్రేడ్‌లో ఉంచుతున్నట్టు తెలిపింది. ఈ మూడు అంశాలు పరిశీలిస్తున్నామని మూడీస్ పేర్కొంది. మొదటగా.. మోసపూరిత లావాదేవీలు ఎంతమేరకు ఆర్థిక ప్రభావం చూపనున్నాయి? రెండోది.. బ్యాంకు క్యాపిటలైజేషన్ మెరుగుదలకు యాజమాన్యం తీసుకుంటున్న చర్యలేమిటి? మూడోది.. బ్యాంకుపై రెగ్యులేటరీ తీసుకునే చర్యలు వంటి వాటిపై దృష్టిపెట్టిట్టు పేర్కొంది. ఈ మోసపూరిత లావాదేవీల ఫలితంగా బ్యాంకు లాభాలు తీవ్ర ఒత్తిడిలోకి వెళ్లాయని ఏజెన్సీ పేర్కొంది. అయితే అసలైన ప్రభావం సమయం, అవసరాలకు అనుగుణంగా ఉంటుందని మూడీస్ చెప్పింది. బ్యాంకు బిసి3 బేస్‌లైన్ క్రెడిట్ అసెస్‌మెంట్(బిసిఎ) కూడా తీసుకుంది. అడ్జెస్టెడ్ బిసిఎ బిఎ3గా, కౌంటర్‌పార్టీ రిస్క్ అసెస్‌మెంట్ రేటింగ్ బిఎఎ3(సిఆర్)/ పి3(సిఆర్)ను డౌన్‌గ్రేడ్ పరిశీలనలో ఉంచనున్నట్టు మూడీస్ తెలిపింది.

దశాబ్దకాలంలో మూడు రెట్లు పెరిగిన సాఫ్ట్‌వేర్ ఆదాయం

నాస్కామ్ వార్షిక నివేదిక



మన తెలంగాణ / హైదరాబాద్ : ఈ ఏడాది సాఫ్ట్‌వేర్, సేవా రంగాల ఆదాయం గణనీయంగా పెరిగి 150 బిలియన్ డాలర్లకు చేరనుందని, గడచిన దశాబ్ద కాలంతో పోల్చుకుంటే దాదాపు మూడు రెట్లకు సమానంగా ఉండవచ్చని అంచనా వేసినట్లు నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్ (నాస్కామ్) వెల్లడించింది. మొబైల్ వ్యాలెట్‌ల ద్వారా జరిగిన డిజిటల్ చెల్లింపులు సైతం దాదాపు రూ. 793 బిలియన్‌లకు చేరుకుందని పేర్కొనింది. ప్రతి ఏటా ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ రూపంలో చేస్తున్న ఖర్చు సగటున 20% పెరుగుతూ ఉందని, భారతదేశంలో ఇది సుమారు 30% ఉందని పేర్కొనింది. ఐటి సదస్సు సందర్భంగా నాస్కామ్ రూపొందించిన 'ఐటి వార్షిక నివేదిక'ను విడుదల చేసిన అనంతరం అధ్యక్షుడు చంద్రశేఖర్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, రానున్న ఆర్థిక సంవత్సరంలో ఐటి, ఐటి సంబంధిత రంగాల్లో కొత్తగా లక్షలాది ఉద్యోగాలు వస్తాయని పేర్కొన్నారు. ఆర్టిఫిసియల్ ఇంటలిజెన్స్ ద్వారా కొత్త ఉద్యోగాలకు చాలా అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సాఫ్ట్‌వేర్ ఎగుమతులు 167 బిలియన్ డాలర్స్‌కు చేరుకున్నాయని, భారతదేశం నుంచి జరిగిన మొత్తం ఎగుమతుల్లో 24% ఐటి రంగానివేనన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.8% వృద్ధిరేటు నమోదైందని, స్టార్టప్ కంపెనీల వృద్ధి రేటు కూడా దాదాపు 25 % పెరిగిందన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ 'ఈ కామర్స్', నగదు రహిత డిజిటల్ చెల్లింపులు, స్టార్టప్‌ల వృద్ధి మరింతగా పెరుగుతుందని అంచనా వేస్తున్నట్లు చంద్రశేఖర్ వెల్లడించారు. గతేడాది 'బ్రెగ్జిట్', ఆర్థికరంగంలో ఒడిదుడుకుల కారణంగా ఐటి రంగంలో కొన్ని ఉద్యోగాలు పోయినమాట నిజమేనని, అయితే ఈ కారణాలను వదిలేసి సాధారణీకరించి ఐటి రంగంలో ఉద్యోగాలు పోతున్నాయనడంలో వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు. 2018లో భారత ఆర్థిక రంగం వృద్ధి మేరకు టెక్నాలజీ ఉద్యోగాలు కూడా ఆ శాతం మేరకు పెరుగుతాయని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. టెక్నాలజీ సర్వీసు రంగంలో డిజిటల్ వినియోగంతో కొత్త ఉద్యోగాలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు.

నేటి నుంచే కమల్ రాజకీయ యాత్ర



చెన్నై: విలక్షణ నటుడు కమల్ హాసన్ బుధవారం తన రాజకీయ యాత్రకు శ్రీకారం చుట్టనున్నారు. ఆయన తన జన్మస్థలం రామనాథపురం జిల్లాకు సమీపాన ఉండే కముతి నుంచి రాజకీయ పర్యట నను ఆరంభించనున్నారు. ఆ పర్యటన బుధవారం సాయంత్రం మధురైకు చేరకుంటుంది. అక్కడ ఆయన పార్టీ జెండాను ఎగురవేయనున్నారు. అంతేకాక ఆ జెండా వెనుక ఉన్న భావం గురించి వివరించనున్నారు. కమల్ హాసన్ బుధవారం తన పార్టీని ఆరంభించనున్న నేపథ్యంలో డిఎంకె వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.కె. స్టాలిన్ రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్న సినీ స్టార్లపై విమర్శలు గుప్పిస్తూ ' వారు కాగితపు పూల వంటివారు. సీజన్‌లో పూచే కాగితపు పూలకు వాసన ఉండదు. కానీ అవి త్వరగానే వాడిపోతాయి' అని అన్నారు. దీనికి ముందు నటుడు సీమన్ సైతం తమిళేతరుడన్న కారణంగా రజనీకాంత్‌ను తీవ్రంగా వ్యతిరేకించాడు. పైగా చెన్నైలో కమల్‌ని ఆయన ఇంట్లోనే కలిశాడు. 'కమల్ నన్ను కలుసుకోవాలనుకున్నారు. కానీ తాను పెద్ద అయినందున తననే ఇంటికి వచ్చి కలుసుకుంటే బాగుంటుందని అన్నందున ఆయనను ఇంటి వద్దనే కలిశాను' అని సీమన్ విలేకరులకు చెప్పాడు. తాను కూడా రామనాథపురం జిల్లాకు చెందినవాడినేనని సీమన్ ఈ సందర్భంగా విలేకరులకు చెప్పాడు.



గీతాంజలి యూనిట్ లాకౌట్

మన తెలంగాణ/మహేశ్వరం: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రాజీవ్ జెమ్స్ పార్కులోని హైదరాబాద్ జెమ్స్ లిమిటెడ్ గీతాంజలి గ్రూప్ యూనిట్‌ను లాకౌట్ ప్రకటించడంతో అందులో పనిచేస్తున్న 700 మంది కార్మికులు ధర్నాకు దిగారు. నీరవ్ మోడీ పంజాబ్ నేషనల్ బ్యాంకుకు కుచ్చుటోపీ పెట్టడంతో ఇడి అధికారులు మూడు రోజులుగా గీతాంజలి యూనిట్‌లో సోదాలు నిర్వహిస్తూ ఆస్తులను సీజ్ చేయడంతో యాజమాన్యం కంపెనీ లాకౌట్ ప్రకటించింది. 2007లో ప్రారంభమైన ఈ కంపెనీలో యూనిట్‌లో ప్రస్తుతం ఏడువందల మంది కార్మికులు పని చేస్తున్నారు. యూనిట్ లాకౌట్‌తో వీరంతా ఉపాధి కోల్పోయారు. కార్మికులకు మద్దతుగా మాజీ హోంమంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి మహేశ్వరం ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి బిజెపి నాయకుడు బద్దంబాల్‌రెడ్డి సిఐటియు నాయకులు సాయిబాబు బి.దత్తునాయక్ ఎ. రవికుమార్ ధర్నాలో పాల్గొన్నారు. వీధిన పడిన కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

సింఘ్వి భార్యకు ఐటి నోటీసులు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అభిషేక్ మను సింఘ్వి సతీమణి అనితకు ఆదాయపు పన్ను శాఖ నోటీసులు జారీ చేసింది. ఆయన సతీమణి అనిత సింఘ్వి సుమారు 6 కోట్ల విలువైన వజ్రాభరణాలను నీరవ్ మోదీ నుంచి కొనుగోలు చేశారని, దీనికోసం రూ.1.5 కోట్లు చెక్కు ద్వారా, మిగిలిన రూ.4.5 కోట్లు నగదు రూపంలో చెల్లించారని ఆరోపించింది. నగదు రూపంలో చెల్లించిన సొమ్ముకు సరైన ఆధారాలను తెలియజేయాలని కోరినట్లు సమాచారం. నీరవ్ మోదీ రూ. 11,300 కోట్ల మేరకు కుంభకోణానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. సిబిఐ, ఇడి దర్యాప్తులో స్వాధీనం చేసుకున్న కీలక పత్రాల్లో అభిషేక్ మను సింఘ్వి సతీమణి అనిత చేసిన కొనుగోళ్ల వివరాలు లభించాయి. ఈ బిల్లుల్లోనే 'లెక్కల్లో చూపిన సొమ్ము', 'లెక్కల్లో చూపించని సొమ్ము' అనే కాలమ్స్ ఉండటం ఆశ్చర్యకరం, దారుణం. కంప్యూటరైజ్డ్ ఇన్వాయిస్‌లు, బిల్లులను ఓ ఆంగ్ల టీవీ ఛానల్ బయటపెట్టిన సంగతి తెలిసిందే.

ముగ్గురు వ్యాపారవేత్తలపై కాల్పులు

బరాసత్: పశ్చిమబెంగాల్ ఉత్తర 24 పరగణాలు జిల్లాలో మంగళవారం ఒక్కరోజే వేర్వేరు ఘటనల్లో ముగ్గురు వ్యాపారవేత్తలపై కాల్పులు జరిగాయి. మొదటి ఘటన బర్రాక్‌పోర్‌లోని సదర్ బజార్ ప్రాంతంలో చోటు చేసుకుందని పోలీసులు తెలిపారు. ఓ వ్యాపారవేత్త సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత తన ఇంటికి తిరిగి వస్తుండగా, దుండగులు అతనిపై కాల్పులు జరిపారు. చేతికి తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రిలో చేరాడు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని, వారిని విచారిస్తున్నట్లు బర్రాక్‌పోర్ పోలీస్ కమిషనర్ రాజేష్ కుమార్ చెప్పారు. కాల్పుల వెనుక ఏమైనా కుట్ర దాగి ఉందా అనేది అంకా తెలియరాలేదన్నారు. అదే విధంగా బల్ఘోరియాలో మధ్యాహ్నం ఓ బిల్డర్ నుంచి డబ్బులు వసూలు చేసేందుకు ఇద్దరు వ్యాపారవేత్తలు వెళ్లగా వారిపై దుండగులు కాల్పులు జరిపారు. డబ్బులు వసూలు సమాచారాన్ని తెలుసుకున్న దుండగులు తమకు ఇవ్వాలని వ్యాపారవేత్తలను డిమాండ్ చేశారు. అందుకు వారు నిరాకరించడంతో ఆ వ్యాపారవేత్తలపై కాల్పులు జరిపినట్లు కమిషనర్ వెల్లడించారు. క్షతగాత్రులు చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరారన్నారు.

జమ్ములో భూ ప్రకంపన

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో మంగళవారం ఓ మోస్తరుగా భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 3.3గా నమోదైనట్లు భారత వాతావరణ శాఖ అధికారి ఒకరు తెలిపారు. జమ్మూకశ్మీర్‌లో ఐదు కిలో మీటర్ల లోతులో భూకంపం కేంద్రీకృతమైందని ఆయన తెలిపారు. మధ్యాహ్నం 12.41 గంటలకు మధ్యస్తంగా భూకంపం సంభవించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఎలాంటి ఆస్తి , ప్రాణ నష్టం జరగలేదని పోలీసులు తెలిపారు. భూకంపం రావడంతో స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

పాక్ మాదక ద్రవ్యాల స్మగ్లర్ కాల్చివేత

అమృత్‌సర్: పంజాబ్‌లోని భారత్—పాక్ అంతర్జాతీయ సరిహద్దుల్లో పాకిస్థాన్‌కు చెందిన మాదక ద్రవ్యాల స్మగ్లర్‌ను కాల్చేశామని బిఎస్‌ఎఫ్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. మంగళవారం తెల్లవారు జామున పిరోజ్‌పూర్ సెక్టార్‌లోని బరెక్‌పోస్ట్ వద్ద ఘటన చోటు చేసుకుంది. మృతుడి వద్ద 10 కేజీల నార్కోటిక్స్ మాదక ద్రవ్యాలు, ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మరి కొంత మంది పాక్ స్మగ్లర్లు పారిపోయారన్నారు. సరిహద్దు ఉగ్రవాదం, డ్రగ్ స్మగ్లర్లు, చొరబాటు దార్లను అరికట్టేందుకు ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు పంజాబ్ పోలీసులు తెలిపారు. మృతదేహంతో పాటు 10 కేజీల హెరోయిన్, చైనా పిస్తోల్, మ్యాగజైన్, 17 బుల్లెట్లు, రూ. 110 విలువైన పాకిస్థాన్ నోట్లు, పాకిస్థాన్‌కు చెందిన మొబైళ్లు, సిమ్‌కార్డు, ప్లాస్టిక్ పైపు వంటి వస్తువులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

యువతిపై సామూహిక అత్యాచారం



బెర్హంపూర్: పశ్చిమ బెంగాల్‌లో ఇద్దరు వ్యక్తులు ఓ యువతిపై దారుణ అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె జననాంగంలోకి లోహపు చువ్వను చొప్పించి అనుమానుషంగా వ్యవహరించారు. పోలీసుల కథనం మేరకు.. దక్షిణ దినాజ్‌పూర్‌లోని ఓ బ్రిడ్జి కింద దాదాపు 20 ఏళ్ల వయస్సున్న ఓ యువతి స్పృహ కోల్పోయి పడివుంది. పోలీసులు వెంటనే ఆమెను మాల్దా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో చేర్చగా వైద్యులు ఆమెకు రెండు సర్జరీలు నిర్వహించారు. ఈనెల 18న మధ్యాహ్నం ఆ యువతి బ్రిడ్జి కింద అపస్మారక స్థితిలో పడివుండగా తాను చూశానని, ఆమె జననాంగం నుంచి పేగు బయటకు వచ్చి ఉందని ఓ ప్రయాణికుడు తెలిపారు. ఆమెను చూడగానే దగ్గరకు వెళ్లి మొహంపై నీళ్లు చల్లగా ఆమె కళ్లు తెరిచిందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ధాము సోరెన్ తెలిపారు. ఈ ఘటనలో ఇద్దరి ప్రమేయం ఉన్నట్టు గుర్తించామని, ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని దక్షిణ దినాజ్‌పూర్ పోలీసు సూపరింటెండెంట్ బెనర్జీ తెలిపారు. శివరాత్రి ఉత్సవాల నుంచి తిరిగి ఇంటికి వెళ్తుండగా ఈనెల 17న దేహబాంద్‌కు చెందిన ఆ యువతిపై ఈ దారుణం జరిగినట్టు పోలీసులు తెలిపారు. తన గ్రామానికే చెందిన రాం ప్రభేష్ శర్మ, కొందరు ఇతరులతో కలిసి తనను నిర్జన ప్రాంతానికి బలవంతంగా ఎత్తుకెళ్లి అత్యాచారం చేశారని బాధితురాలు చెప్పిందని సోరెన్ తెలిపారు. అనంతరం లోహపు చువ్వను ఆమె జననాంగంలోకి చొప్పించారని చెప్పారు.

రోటొమాక్ అవినీతి కలకలం

స్టేషనరీ రారాజు నుంచి ఎగవేతదారుగా కొఠారీ





కాన్పూర్: అక్రమాల చరిత్రలో రోటొమాక్ పెన్ను సరికొత్త అధ్యాయాన్నే లిఖించింది. స్టేషనరీ రారాజు దశ నుంచి భారీ స్థాయి రుణాల ఎగవేతదారుడిగా ఇప్పుడు రోటొమాక్ అధినేత విక్రమ్ కొఠారీ నిలిచారు. కాన్పూర్‌లో తిలక్‌నగర్ ప్రాంతంలోని సువిశాలమైన సంతుష్టి రాజ ప్రాసాదం తరచూ వచ్చిపొయే వారితో హడావిడిగా ఉండేది. ఇప్పుడు బ్యాంక్ రుణాల కుంభకోణం వెలుగులోకి రావడంతో తాజాగా సిబిఐ బృందాల రాకతో కొత్త రంగు పులుముకుంది. గేట్లు తెరుచుకునే ప్రతిసారీ అక్కడ కార్ల రణగొణధ్వనులు నెలకొంటున్నాయి. విలేకరుల బృందాలు అక్కడనే తిరుగుతున్నాయి. ఏం జరుగుతుందో చిత్రీకరించాలని వచ్చే టీవీ కెమెరా వారి ఫ్లాష్‌లతో ఈ ప్రాంతం తళుక్కుమంటోంది. ఈ విలాసవంతమైన భవనం వెలుపల రిపోర్టర్లు వార్తా సేకరణకు పడిగాపులు పడుతున్నారు. ప్రస్తుతం సాగుతున్న సిబిఐ, ఇడిల దర్యాప్తునకు ఈ నిలయం వేదికగా మారింది. సంతుష్టి అంటే సంతృప్తి అని అర్థం. విజయానికి ప్రతీకగా ఇంతకాలం ఈ భవనం నిలిచింది. ఇప్పుడు ఇది భారీస్థాయి ఎగవేత కేసుల ఆలవాలంగా మారింది. రోటొమాక్ పెన్నుల తయారీ వ్యక్తిగా, దేశంలోని ప్రముఖ వ్యాపారవేత్తల జాబితాలో చోటుచేసుకున్న కొఠారీ ఇప్పుడు ఎగవేతదారుడిగా అపకీర్తి మూట కట్టుకున్నారు. 1973లో విక్రమ్ తండ్రి మన్‌సుఖ్‌భాయి కొఠారీ పాన్‌మసాలా వ్యాపారం భారీ స్థాయిలో చేపట్టినట్లు సంతుష్టి పొరుగింట్లో ఉండే రాజేంద్రకుమార్ సఫర్ తెలిపారు. మన్‌సుఖ్‌ది గుజరాత్. అక్కడ కొబ్బరి నూనెను దుకాణాలకు విక్రయిస్తూ ఉండేవాడట. తరువాత ఆయన కాన్పూర్‌కు వచ్చి పాన్‌మసాలా వ్యాపారానికి దిగారు. ప్రత్యేకించి ఆయన పాన్‌పరాగ్ ఉత్పత్తిలో పేరు తెచ్చుకున్నారు. ఈ బ్రాండ్ పాన్‌మసాలా రంగంలో మంచి గిరాకీ పొందింది. పలువురు ప్రముఖ నటులు ఈ పాన్‌పరాగ్ బ్రాండ్‌కు ప్రకటనకర్తలుగా వ్యవహరించారు. పాతతరం నటులు షమ్మీకపూర్, అశోక్ కుమార్ వంటి వారు కూడా ఈ బ్రాండ్ యాడ్ చేశారు. భారతీయుల ఆహ్వానానికి పాన్‌పరాగ్‌ను వాడుకొండనే స్లోగన్ ప్రాచుర్యం పొందింది. పాన్‌పరాగ్ రాక, దానికి దక్కిన ప్రచారంతో కాన్పూర్ ఆ తరువాత పాన్ మసాలా నగరంగా మారిందని అక్కడి వారు చెపుతుంటారు. చాలాకాలం వరకూ విక్రమ్ ఆయన సోదరుడు దీపక్‌లు తండ్రికి ఈ వ్యాపారంలో సహకరించారు. అయితే 1992లో ఇద్దరు సోదరులు వేర్వేరు మార్గాలను ఎంచుకున్నారు. దేశంలో బాల్‌పెన్నుల అవసరాన్ని గుర్తించి విక్రమ్ తమ రోటొమాక్ పెన్నుల బ్రాండ్‌ను ప్రారంభించారు. ఆ తరువాత యస్ బ్రాండ్ మినరల్ వాటర్‌ను కూడా మార్కెట్‌లోకి దించారు. విక్రమ్ పూర్తి స్థాయిలో ఆ తరువాత పెన్నులు, స్టేషనరీ వ్యాపారంలోకి అడుగుపెట్టారు. తమ్ముడు దీపక్ కేవలం పాన్‌మసాలా ఉత్పత్తులకు పరిమితం అయ్యారు. దేశ విదేశాలలో రోటొమాక్ భారీగా ఆదరణ పొందింది, రాతకు దీనిని మించింది లేదనే అభిప్రాయం ఏర్పడింది. లిఖ్‌తే లిఖ్‌తే లవ్ హో జాయే వంటి ఆకర్షణీయ స్లోగన్‌లతో ఈ పెన్నులు మరింతగా అందరినీ ఆకట్టుకున్నాయి. అగ్రనటులు సల్మాన్ ఖాన్, రవీనా టాండన్‌లు పెన్నుల యాడ్ చేశారు. అంతే కాకుండా సామాజికంగా కూడా విక్రమ్ కొఠారీ మంచి గుర్తింపు దక్కించుకున్నారు. లయన్స్ క్లబ్ వారు సౌహార్ద్ర దూతగా ఆయనను ఎంచుకున్నారని సంతుష్టి పొరుగింటి వ్యక్తి చెప్పారు. కాలక్రమంలో రోటొమాక్ కంపెనీ గ్లోబల్ ప్రైవేటు లిమిటెడ్‌గా మారింది. ఈ దశలోనే జోరు మీదున్న కొఠారీ రియల్ ఎస్టేట్, స్టీల్ ఇతర రంగాలలో కూడా అడుగుపెట్టారు. నిరంతర విజయ యాత్రగా సాగిన విక్రమ్ కొఠారీ కథ ఇప్పుడు ఎగవేతల మలుపు తిరిగింది. సాఫీగా సాగిన పెన్ను దస్తూరి చివరికి గజిబిజిగా మారింది. వేలాది కోట్ల రూపాయల బ్యాంక్ రుణాలను పొంది ఎగ్గొట్టిన వ్యక్తిగా కొఠారీ ఇప్పుడు దర్యాప్తు బోనులో నిలుస్తున్నారు. బ్యాంకింగ్ రంగం తీవ్ర సంక్షోభంలో ఉన్న సమయంలో , నిరర్థక ఆస్తుల సంక్షోభం తన్నుకొచ్చిన దశలో విక్రమ్ ఇప్పుడు వీటికి కేంద్ర బిందువుగా మారాడు. దేశంలో బ్యాంకుల దివాళా కీలకమైన రాజకీయ అంశంగా, అంతకు మించి సామాజిక సంవాదంగా దారితీసిన దశలో ఇప్పుడు మాల్యా, నీరవ్ తరువాతి వరుసలో విక్రమ్ పేరు జోరు అందుకుంది. విక్రమ్‌కు ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. వారు వ్యాపార కుటుంబాలతో పెళ్లిళ్లు అయ్యాయి. కాన్పూర్ అంటే రోటొమాక్ అనుకునే స్థాయి వరకూ వెళ్లిన పేరు ఇప్పుడు ఎగవేతల విక్రమ్ ఊరు దశకు చేరింది.

14 విక్రమ్ బ్యాంక్ ఖాతాల స్తంభన



న్యూఢిల్లీ: రోటొమాక్ కంపెనీకి చెందిన 14 బ్యాంకు ఖాతాలను ఆదాయపు పన్ను శాఖ వారు అటాచ్ చేశారు. ఓవైపు సిబిఐ, ఇడిలు పలు స్థాయిల్లో విక్రమ్ కొఠారీ అక్రమ వ్యవహారాలపై దర్యాప్తు సాగుతున్న దశలోనే ఇప్పుడు ఐటి కొరడా ఝుళిపించింది. పన్ను ఎగవేతలకు సంబంధించి 14 బ్యాంకు ఖాతాలను అటాచ్ చేసినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని 11 బ్యాంక్ బ్రాంచ్‌ల ఖాతాలను గత రాత్రి అటాచ్ చేసినట్లు వివరించారు. రూ 85 కోట్ల మేర ఉన్న పన్ను బకాయిలకు సంబంధించి ఇప్పుడు అటాచ్‌మెంట్ చర్య తీసుకున్నారు. అటాచ్ చేసిన వాటిలో 11 ఖాతాలు రోటొమాక్ కంపెనీ పేరు మీద ఉన్నాయని, మిగిలిన మూడు కొఠారీ కుటుంబ సభ్యుల పేరిట ఉన్నాయని అధికా రులు తెలిపారు. సిబిఐ, ఇడి వర్గాలు ఇప్పటివరకూ వేసిన మదింపు తో ఈ కంపెనీ బ్యాంకులకు రూ. 3695 కోట్ల మేర మోసం చేసినట్లు వెల్లడైంది. ఏడు బ్యాంకుల సముదాయం ఈ మేరకు రుణాలను అందించినట్లు వెల్లడైంది. రోటోమ్యాక్స్ కంపెనీపై సిబిఐ క్రిమినల్ కేసు పెట్టింది. డైరెక్ట ర్ విక్రమ్‌పై ఆయన కుటుంబ సభ్యులపై కూడా కేసులు నమోదయ్యాయి. భార్య సాధన, కుమారుడు రాహుల్‌లు ఇప్పుడు కేసు విచారణను ఎదుర్కొంటున్నారు. అదే విధంగా కొందరు బ్యాంకు అధికారులపై కూడా కేసులు నమోదు అయ్యాయి. వీరి నివాసాలలోనూ సోమవారం అధికారులు సోదాలు జపారు. మరో వైపు అక్రమ ఆర్థిక లావాదేవీల నిరోధక చట్టం పరిధిలో ఇడి కూడా విక్రమ్ కొఠారీ కంపెనీపై కేసులు పెట్టింది.

మహానది ట్రిబ్యునల్ ఏర్పాటు

న్యూఢిల్లీ: ఒడిషా, ఛత్తీస్‌గఢ్‌ల మధ్య మహానది నదీ జలాల వివాద పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు మంగళవారం కేంద్ర మంత్రి మండలి భేటీలో తీసుకున్న నిర్ణయానికి ఆమోదం లభించింది. రెండు రాష్ట్రాల మధ్య వివాద పరిష్కారానికి ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని ఇటీవలే సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది మహానది ఎగువ ప్రాంతాలలో ఆనకట్టల నిర్మాణం ఆపేలా ఛత్తీస్‌గఢ్‌కు ఆదేశాలు వెలువరించాలని ఒడిషా ప్రభుత్వం సుప్రీంను ఆశ్రయించింది. ఈ పరిణామం ప్రక్రియలో భాగంగా ఇప్పుడు మహానది ట్రిబ్యునల్ ఏర్పాటు జరిగింది.

నక్సల్స్ ప్రాంతాలకు రైల్వే లైన్

ఒడిషాలోని నక్సల్ సమస్యాత్మక మల్కన్‌గిరి ప్రాంతానికి తొలి రైలు మార్గం 2022 నాటికి సమకూరుతుందని రైల్వే మంత్రి పియూష్ గోయల్ తెలిపారు. రూ.2676 కోట్ల ఈ రైల్వే లైన్ నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి విలేకరులకు చెప్పారు. నక్సల్స్ సమస్య ఉన్న ఈ ప్రాంతానికి రైల్వే అనుసంధానం ద్వారా సరైన మార్పు తీసుకువచ్చేందుకు వీలేర్పడుతుందని మంత్రి వివరించారు. ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో ఈ రైల్వే లైన్ నిర్మాణానికి ఆమోదం తెలిపారు. జేపోరే— మల్కాన్‌గిరి మధ్య 130 కిలో మీటర్ల మేర ఈ రైల్వే లైన్ ఉంటుందని , 2021—22 నాటికి పూర్తి అవుతుందని అంచనా వేస్తున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటివరకూ మల్కాన్‌గిరికి ఏ దిక్కు నుంచి కూడా రైల్వే అనుసంధానం లేదు. రైల్వే మార్గం అందుబాటులోకి రావడం వల్ల ఆ ప్రాంత ఆదివాసీలు, పేదలకు మేలు జరుగుతుందన్నారు.

దేశంలో విద్యుత్ ఉత్పాదనలో 70 శాతం వరకూ బొగ్గు ఆధారిత ప్రాజెక్టులతోనే జరుగుతోంది. బొగ్గు గనుల ప్రైవేటు అవకాశం ప్రకటన తరువాత స్టాక్ మార్కెట్‌లో కొన్ని ప్రైవేటు విద్యుత్పాదన కంపెనీల షేర్లు ప్రత్యేకించి వేదాంత వంటి కంపెనీల వాటాల విలువలు ఎగబాకాయి.

అగ్ని-2 క్షిపణి ప్రయోగం సక్సెస్

బాలాసోర్: అణ్వస్త్రాలను మోసుకెళ్లగలిగే సామర్థ్యం కలిగిన మధ్య శ్రేణి క్షిపణి అగ్ని—2 ప్రయోగాన్ని భారత్ విజయవంతంగా నిర్వహించింది. ఒడిశాలోని ఎపిజె అబ్దుల్ కలాం ద్వీపం నుంచి మంగళవారం నాడు దీనిని ప్రయోగించింది. సైనిక వ్యూహాత్మక దళాల సన్నాహక పరీక్షల్లో భాగంగా దీన్ని ప్రయోగించింది. దాదాపు రెండు వేల కిలోమీటర్ల దూరంలో భూతలంపై నుంచి భూతలంపై ఉన్న లక్ష్యాలను ఛేధించగల ఈ క్షిపణి ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటిఆర్) లాంచ్ కాంప్లెక్స్—4 నుంచి లక్ష్యం దిశగా దూసుకుపోయింది. 21 మీటర్ల పొడవైన ఈ క్షిపణి సుమారు 16 టన్నుల బరువు ఉంటుంది. దాదాపు వెయ్యి కిలోల బరువైన వార్‌హెడ్‌ను మోసుకుపోగలదు. దీనిని భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఓ) తయారు చేసింది.

ఇట్‌ఖోరిలో పొడవైన బౌద్ధ స్తూపం



ఛత్ర/రాంచీ: ప్రపంచంలోనే అతి పొడవైన బౌద్ధ స్థూపాన్ని జార్ఖండ్‌లోని ఇట్ ఖోరిలో నిర్మించనున్నట్టు ముఖ్యమంత్రి రఘుబర్ దాస్ తెలిపారు. బీహార్‌లోని తూర్పు చంపరన్‌లో అశోక చక్రవర్తి నిర్మించిన 104 అడుగుల బౌద్ధ స్థూపమే ఇప్పటివరకు ప్రపంచంలో అతి పొడవైనదిగా ఉంది. మార్చి చివరికి మాస్టర్ ప్లాన్ సిద్ధమవుతుందని, జులై నాటికి ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి నివేదిక రూపొందుతుందని సిఎం చెప్పారు. సోమవారం రాత్రిక్కడ జరిగిన 'ఇట్‌ఖోరి మహోత్సవ్'ను ప్రారంభించారు.

కర్నాటకలో కాంగ్రెస్ నేత హల్‌చల్

- ప్రభుత్వ ఆఫీస్‌లో పెట్రోల్ చల్లి వీరంగం



బెంగళూరు: కర్నాటకలో అసెంబ్లీ ఎన్నికలకు ఒక వైపు గడువు ముంచుకొస్తుంటే ఆ రాష్ట్ర కాంగ్రెస్ నేతలు వరుస వివాదాల్లో చిక్కుకుంటున్నారు. తాజాగా మరో కాంగ్రెస్ నేత ప్రభుత్వ కార్యాలయంలో పెట్రోల్ చల్లి నిప్పుపెడతానని అధికారులను భయభ్రాంతులకు గురిచేశాడు. కాంగ్రెస్ ఎంఎల్‌ఎ బైరతి బసవరాజ్ సన్నిహితుడుగా చెప్పుకునే నారాయణస్వామి ఇటీవల హోరమావులోని బృహత్ బెంగళూరు మహానగర పాలిక వార్డు కార్యాలయానికి వెళ్లారు. భూములకు సంబంధించిన కొన్ని పత్రాలపై సంతకాలు చేయాలని అధికారులను బెదిరించాడు. ఆఫీస్‌లో ఆయన హల్‌చల్ చేసిన విడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. ఆయన పలు భూములకు సంబంధించిన నకిలీ పత్రాలు తీసుకు వచ్చి సంతకాలు పెట్టమని బలవంతం చేయడంతో అధికారులు అందుకు నిరాకరించారు. దీంతో రెచ్చిపోయిన నారాయణస్వామి తన వద్ద ఉన్న పెట్రోల్‌ను అధికారుల క్యాబిన్‌లలో చల్లి తగలబెడతానని హెచ్చరించారు. అసిస్టెంట్ రెవెన్యూ అధికారిపై కూడా పెట్రోల్ చల్లాడు. ఇందుకు సంబంధించిన వీడియో మంగళవారం బయటకు రావడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. ఇదిలాఉంటే కాంగ్రెస్ నేత తీరుపై సర్వత్రా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. నారాయణస్వామి బెంగళూరులోని కేఆర్ పురం బ్లాక్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. మరోవైపు ఎంఎల్‌ఎ మహ్మద్ హ్యారీస్ తనయుడు నలపాడ్ మూడురోజుల క్రితమే ఓ పబ్‌లో కూర్చున్న వ్యక్తిని చితకబాది పార్టీ నుంచి ఉద్వాసనకు గురైన విషయం తెలిసిందే.

ఢిల్లీ సిఎస్‌పై ఆప్ దాడి?

- అవాస్తవం, నిరాధారం: సిఎం కార్యాలయం
- కావాలనే దాడి చేశారు : ఐఎఎస్ సంఘాలు



న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసంలో మంగళవారం నాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్షు ప్రకాశ్‌పై కొందరు ఆప్ ఎంఎల్‌ఎలు దాడి చేశారని అధికారులు తెలిపారు. అయితే, ఈ ఆరోపణలు అవాస్తవం, నిరాధారమైనవని ముఖ్యమంత్రి కార్యాలయం తోసిపుచ్చింది. సోమవారం సాయంత్రం అన్షు ప్రకాశ్ సిఎం నివాసానికి వెళ్లగా కేజ్రీవాల్, డిప్యూటీ సిఎం మనీష్ సిసోడియా సమక్షంలోనే ఈ ఘటన జరిగిందని సీనియర్ అధికారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ప్రకటనలకు సంబంధించిన అంశంపై చర్చించేందుకు ప్రకాశ్ సిఎం వద్దకు వెళ్లినట్టు అధికారులు చెప్పారు. అయితే, రేషన్ అంశంపై చర్చించేందుకు ప్రకాశ్ వెళ్లారని ఆప్ పేర్కొంటోంది. 'గత రాత్రి జరిగిన సమావేశం గరంగరంగా జరిగిందని, ఇందులో వాగ్వాదాలు చోటుచేసుకోగా ఇద్దరు, ముగ్గురు ఆప్ ఎంఎల్‌ఎలు ప్రకాశ్‌పై దాడి చేశారు. సిసి కెమెరాల అద్దాలు కూడా ధ్వంసమయ్యాయి' అని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ సీనియర్ ఐఎఎస్ అధికారి ఆరోపించారు. ఘటన అనంతరం ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్‌ను కలుసుకుని, ఘటనకు సంబంధించిన వివరాలు తెలియజేశారు. కాగా, మంగళవారం నాడు ఐఎఎస్ అధికారులు సంఘం అనిల్ బైజాల్‌ను కలుసుకుని, ఘటన పట్ల నిరసన వ్యక్తం చేసింది. అయితే, ఈ విషయంలో సమ్మెకు దిగితే ప్రజలకు అసౌకర్యం కలుగుతుందని, అందువల్ల సమ్మె చేయరాదని సంఘం నిర్ణయించుకున్నట్టు తెలిసింది.


ఆధార్ అమలులో లోపాల కారణంగా 2.5 లక్షల కుటుంబాలు రేషన్ సరుకులు అందక గత మాసం ఇబ్బందులు పడ్డారని, దీంతో ప్రజల నుంచి పార్టీ ఎంఎల్‌ఎలకు ఒత్తిళ్లు వస్తున్నాయని ఆప్ ఒక ప్రకటనలో ఆరోపించింది. 'సిఎం నివాసంలో సమావేశం జరిగింది. ఇందులో ఎంఎల్‌ఎలు అడిగిన ప్రశ్నలకు సిఎస్ సమాధానాలు ఇవ్వలేదు. పైగా ఎంఎల్‌ఎలకు తాను జవాబుదారీ కాదని, కేవలం లెఫ్టినెంట్ గవర్నర్‌కు మాత్రమే సమాధానాలు చెప్తానని వ్యాఖ్యానించారు. కొందరు ఎంఎల్‌ఎల్‌ను ప్రకాశ్ దుర్భాలాషలాడారు. ఎలాంటి సమాధానాలు చెప్పకుండానే సమావేశం నుంచి వెళ్లిపోయారు' అని ఆప్ ఆ ప్రకటనలో పేర్కొంది. సమావేశం, టివి యాడ్‌లకు సంబంధించి విషయంలో వాగ్వాదం జరిగిందనడాన్ని తప్పుడు సమాచారంగా అభివర్ణించింది. రేషన్ పొందుతున్న భారీ సంఖ్యలో ఉన్న కుటుంబాలకు సంబంధించిన అంశంపైనే చర్చ జరిగిందని పేర్కొంది. సిఎస్ చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలను, ఆయన బిజెపి ఆదేశాలకు అనుగుణంగానే పని చేస్తున్నారని తెలిపింది.

ప్రణాళిక ప్రకారమే దాడి : ఐఎఎస్ సంఘాలు

సిఎస్‌పై దాడి ఉద్ధేశపూర్వకంగా, ప్రణాళిక ప్రకారమే జరిగిందని ఐఎఎస్ సంఘాలు ఆరోపించాయి. ఈ ఘటనపై లెఫ్టినెంట్ గవర్నర్ కలుసుకున్న ఐఎఎస్, డానిక్స్ అసోసియేషన్లు, ఢిల్లీ అడ్మినిస్ట్రేటివ్ సబార్డినేట్ సర్వీసెస్ సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా ఆప్ ప్రభుత్వ పథకాలకు పబ్లిసిటీ మెటీరియల్‌ను విడుదల చేసేలా సిఎస్‌పై వత్తిడి తెచ్చేందుకే ఈ సోమవారం రాత్రి సమావేశం నిర్వహించారని ఆరోపించాయి. ఈ సమావేశం నిర్వహించడానికి ఎలాంటి ప్రజా ప్రయోజనం లేదా ఎలాంటి అత్యవసరం లేదని వ్యాఖ్యానించాయి. ఈ ఘటనకు కారకులైన అందరిపైనా సరైన చర్యలు తీసుకోవాలని ఈ సంఘాలు లెఫ్టినెంట్ గవర్నర్‌ను కోరాయి.

ఘటనపై నివేదిక కోరాం : రాజ్‌నాథ్ సింగ్

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్షు ప్రకాశ్‌పై దాడి ఆరోపణల నేపథ్యంలో ఈ ఘటనపై లెఫ్టినెంట్ గవర్నర్ నుంచి నివేదిక కోరినట్టు కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఈ ఘటన తనకు చాలా బాధ కలుగజేసిందని అన్నారు. 'ప్రజాసేవకులకు గౌరవం, నిర్భయంతో పని చేసే వాతావరణాన్ని కల్పించాలి' అని పేర్కొన్నారు. 'కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ నుంచి నివేదిక కోరింది. న్యాయం తప్పకుండా జరుగుతుంది. ఐఎఎస్‌లు, ఢిల్లీ ప్రభుత్వ ఉన్నతాధికారుల బృందం ఈరోజు (మంగళవారం) నన్ను కలిసింది. పరిస్థితులను నాకు తెలియజేసింది' అని రాజ్‌నాథ్ తెలిపారు. అయితే, ఈ ఘటనపై చర్యలు తీసుకునేంత వరకు తాము విధులకు హాజరయ్యేది లేదని ఢిల్లీ అడ్మినిస్ట్రేటివ్ సబార్డినేట్ సర్వీసెస్ ప్రెసిడెంట్ డిఎన్ సింగ్ తెలిపారు. హోం మంత్రి తనను కూడా నివేదిక కోరారని వెల్లడించారు.



వ్యాపార నిర్వహణలో భారత్ నిజాయితీ భేష్ : జూనియర్ ట్రంప్

న్యూఢిల్లీ: చైనాతో పోలిస్తే వ్యాపార నిర్వహణలో భారత దేశం మరింత సక్రమంగా, నిజాయితీగా వ్యవహరిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పెద్ద కుమారుడు డోనాల్డ్ ట్రంప్ జూనియర్ వ్యాఖ్యానించారు. ఆసియాలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ గల భారత్‌కు అమెరికా వంటి దేశాల నుంచి పెట్టుబడుల ప్రవాహం ప్రస్తుతం సాగుతున్న ఆర్థిక సంస్కరణల వల్ల పెరిగే అవకాశం ఉందని ఆయన అన్నారు. దేశంలో త్వరలో రానున్న ట్రంప్ టవర్స్ అమ్మకాలకు ఊపు నిచ్చే వారం రోజుల పర్యటనలో భాగంగా ఆయన ఇక్కడికి వచ్చారు. 'ఈజ్ ఇన్ డూయింగ్ బిజినెస్' లో భారత దేశం అమెరికా తరహాలో పురోగమిస్తోందని ఆయన అన్నారు. వ్యాపారం చేయడంలో నిజాయితీ భారత్‌లో తగినంతగా కనపడుతోందని ఆయన అన్నా రు. 2023 మార్చిలో లగ్జరీ అపార్టుమెంట్ల నిర్మాణాన్ని అమెరికా భారత్‌లో పూర్తి చేయగలదని కూడా చెప్పా రు. ఈ వారంలో త్వరలోనే ట్రంప్ జూనియర్ ప్రధాని మోడీతో ఇక్కడ ఒక వ్యాపార శిఖరాగ్ర సభలో వేదిక పంచుకొంటారు. సీనియర్ ఎడిటర్లతో సమావేశం సందర్భంగా విలేకరుల ప్రశ్నలకు ఆయన జవాబిచ్చారు. భారత్ పూర్తి స్థాయి అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోందని అన్నారు. ప్రపంచ దేశాలతో అన్ని రంగాల్లో ఈ దేశం పోటీ పడుతోందని, ఇక్కడి యువతలో టాలెంట్‌కు కొదవ లేదని ప్రశంసించారు.

సిరియా దాడుల్లో 98 మంది మృతి

డెమాస్కస్: సిరియాలో ప్రతిపక్షాల పట్టులోని తూర్పు ఘౌటాలో ప్రభుత్వ బలగాలు జరిపిన బాంబు దాడుల్లో 20 పిల్లలు సహా 98 మంది మరణించారు. వారిలో 15 మంది మహిళలు కూడా ఉన్నారు. గత మూడేళ్లలో ఇది అత్యంత భీకరమైన బాంబు దాడి మానవ హక్కుల కార్యకర్తలు మంగళవారం నాడు ఈ విషయం చెప్పారు. ఈ బాంబు దాడులతోపాటు వైమానిక దాడులు కూడా సోమవారం నాడు జరిగాయి. అమెరికా ఇంకా ఈ మరణాలను ధ్రువీకరించలేదు. వైట్ హెల్మెట్స్ పేరుగల సిరియన్ సివిల్ డిఫెన్స్, పౌరుల సారథ్యంలోని అత్యవసర సర్వీసుల వారు ఇంకా శిథిలాల క్రింద కొంత మంది ఇరుక్కుపోయి ఉన్నారని తెలిపారు. ఆదివారం నుంచి ప్రభుత్వ బాంబు దాడులలో మొత్తం 194 మంది మరణించారు. మృతులలో పౌరులు కూడా ఉన్నారు. 2011 నుంచి పౌరులు అధికంగా మరణించిన దాడులలో ఇవి అత్యంత భీకరమైనవని మానవ హక్కుల వారు వెల్లడించారు.

యుఎఇలో మరో అద్భుతం!

దుబాయి : అద్భుత నిర్మాణాలకు ఖ్యాతిగాంచిన యుఎఇ మరో భారీ ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. దుబాయ్ తీరంలో 'పామ్ ఐలాండ్' పేరుతో నిర్మించిన దీవి.. ప్రపంచ పర్యాటకులను ఎంతగా ఆకర్షిస్తున్నదో తెలిసిందే. అదే తరహాలో 'సన్ ఐలాండ్' పేరుతో సము ద్ర భాగంలో చిన్నచిన్న ఎనిమిది ద్వీపాలను కలుపుతూ ఏకంగా నగరాన్నే నిర్మించ తలపెట్టింది. మొదటి విడతలో ఖరీదైన 231 విల్లాలతో నిర్మిస్తున్న ఈ వాటర్ ఫ్రంట్ సిటీకి సన్ ఐలాండ్ గా నామకరణం చేసింది. తాజాగా ఈ సన్ ఐలాండ్ నమునా చిత్రాన్ని విడుదల చేశారు దీని డెవలపర్లు. మొదటి దశలో ఖరీదైన 231 విల్లాలో కొన్ని మూడు, నాలుగు బెడ్‌రూంలతో, మరికొన్ని ఐదు, ఆరు బెడ్‌రూంలతో నిర్మించనున్నారు.

ఇరాన్ విమాన అవశేషాలు లభ్యం

టెహ్రాన్: రెండు రోజుల క్రితం 66 మంది ప్రయాణికులతో అదృశ్యమైన విమానం శిథిలాలను జాగ్రోస్ పర్వతాల్లో ఇరాన్ పరిశోధక బృందం కనుగొందని ప్రతినిధి తెలిపారు. అస్మాన్ ఎయిర్‌లైన్స్ విమానం ఇపి 3704 ఆదివారం ఉదయం చేసిన 45 నిమిషాలకే జాగ్రోస్ పర్వత శ్రేణువుల్లో మాయమైంది. హిమపాతం, పొగమంచు రెండు రోజుల తర్వాత తొలగిపోయి మంగళవారం తేటపడడంతో ఇరాన్‌కు చెందిన రెవెల్యూషనరీ గార్డుల హెలికాప్టర్లు ఆ విమాన అవశేషాలను దేనా పర్వతం వద్ద కనుగొన్నాయి' అని ప్రతినిధి రమేజాన్ ప్రభుత్వ టివి ఐఆర్ఐబికి తెలిపారు. ఆ విమాన శిథిలాలు ఉన్న చోటే ప్రయాణికుల మృత దేహాలు కూడా చెల్లాచెదరుగా పడిఉండడాన్ని పైలట్లు గుర్తించినట్లు ఆయన చెప్పారు. ప్రమాదం నోఫొల్ గ్రామానికి దాదాపు 4000 మీటర్ల దూరంలో దీనా పర్వతంలో జరిగినట్లు గుర్తించారు.

ఎపిలో పిజి కోర్సుల ప్రవేశ పరీక్షల తేదీలు ఖరారు



రాజమహేంద్రవరం: ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్, మెడిసిన్, వివిధ పిజి కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే వివిధ ప్రవేశపరీక్షల తేదీలను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. ఆయా ప్రవేశ పరీక్షల తేదీలను మంగళవారం రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు రాజమహేంద్రవరంలో వెల్లడించారు. ఏప్రిల్ 19న ఎడ్‌సెట్, లాసెట్, ఏప్రిల్ 22 నుంచి 25 వరకు ఎంసెట్ ఇంజినీరింగ్, ఏప్రిల్ 26న ఎంసెట్ (బైపిసి) పరీక్షను నిర్వహించనున్నట్టు ప్రకటించారు. మే 2న ఐసెట్, 3న ఇసెట్, మే 10 నుంచి 12 వరకు పిజిఇసెట్, మే 4 నుంచి పిఇ సెట్ నిర్వహించనున్నారు. నన్నయ్య విశ్వవిద్యాలయంలో అవినీతి, అక్రమాల ఆరోపణలపై సమగ్ర విచారణకు ఆదేశించినట్టు మంత్రి తెలిపారు. కాగా, బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు ఏర్పాట్లు పూర్తయ్యాయని మంత్రి గంటా తెలిపారు. ఈనెల 21 నుంచి మార్చి 2 వరకు ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. మార్చి 17న టెట్ ఫలితాలను విడుదల చేస్తామన్నారు. బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు టెట్ నిర్వహిస్తామని తెలిపారు. ఎపిపిఎస్‌సి ద్వారా డిఎస్‌సి నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్టు చెప్పారు.

చంద్రబాబుకు అపురూప జ్ఞాపిక

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి మిస్డ్‌కాల్ అండ్ ఎలైడ్ ప్రాజెక్టు సంస్థ వ్యవస్థాపకులు అపురూప జ్ఞాపికను బహూకరించారు. ఆయన చదువుకున్నప్పటి ఛాయాచిత్రాలతో కూడిన మొమెంటోను చంద్రబాబు నాయుకుడు ఇచ్చారు. 1958లో చంద్రబాబు తిరుపతిలో కలిసి చదువుకున్నప్పటి చిత్రాలతో రూపొందించిన ఈ జ్ఞాపికను కిశోర్ శ్రీరామ్ భట్ల, శేషాచలపతి, చంద్రశేఖర్, గిరిధర్, రాజశేఖర్ అమరావతిలో సిఎంను కలిసి ఇచ్చారు. సిఎంకు చదువు చెప్పిన గురువు కెవి నరసింహం చిత్రంతో ఈ జ్ఞాపిక రూపొందించిన ప్రతినిధులు చంద్రబాబు నాడు ఒక ఏడాది క్లాస్ లీడర్‌గా ఉన్నారని గుర్తుచేశారు. తాను చదువుకున్నప్పటి జ్ఞాపకాలను ఇస్తున్నందుకు చంద్రబాబు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

అందరి అభిప్రాయాలు తీసుకున్నాకే...

విభజనకు అనుకూల నిర్ణయం

విజయవాడ: అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయం తర్వాతే విభజనకు అనుకూలంగా ఆనాడు ప్రధానిగా ఉన్న మన్మోహన్ సింగ్ నిర్ణయం తీసుకున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి పల్లంరాజు స్పష్టం చేశారు. మన్మోహన్ రాజ్యసభ సాక్షిగా ప్రత్యేక హోదా ప్రకటన చేస్తే.. నాలుగేళ్లయినా ఎన్‌డిఎ ప్రభుత్వం ఆ వాగ్దానాన్ని నెరవేర్చలేక పోయిందన్నారు. విభజన హామీల అమలు కోరుతూ మార్చి 2న రాస్తారోకో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఢిల్లీలో మార్చి 7, 8 తేదీల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. విభజన హామీలపై పార్లమెంట్లో చర్చ జరపాలని ఇప్పటికే నోటీసు ఇచ్చామన్నారు.

హోదా దక్కే వరకు పోరాటం : బొత్స

గుంటూరు: కేంద్రం చివరి బడ్జెట్లోనూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మొండి చేయి చూపించినా.. ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని వైసిపి సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ఆఖరి అస్త్రమంటూ తాజాగా కొత్త నాటకానికి తెర తీశారని ఎద్దేవా చేశారు. ప్రత్యేకహోదా కోసం గుంటూరులో విశ్రాంత ఉద్యోగుల చేపట్టిన దీక్షకు బొత్స సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రత్యేకహోదా సాధన కోసం అన్నివర్గాలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి చట్టబద్ధంగా రావాల్సిన ప్రత్యేకహోదా దక్కేవరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అవిశ్రాంతంగా పోరాడుతుందని స్పష్టం చేశారు.

హిందూ మహాసముద్రంలో

చైనా యుద్ధ నౌకలు?



- **అలాంటిదేమీలేదన్న భారత్**

బీజింగ్: తూర్పు హిందూ మహాసముద్రం ప్రాంతానికి చైనా 11 యుద్ధ నౌకలను తరలించినట్లు తెలుస్తోంది. కొన్ని సాధారణ యుద్ధ నౌకలు, ఓ భారీ యుద్ధ నౌక, 30 వేల టన్నుల యాంఫీబియస్ ట్రాన్స్‌పోర్ట్ డాక్, 3 ట్యాంకర్లు ఈ మహాసముద్రంలో ప్రవేశించాయని సమాచారం. ఈ వివరాలను చైనా న్యూస్ పోర్టల్ సైనీ. కామ్. సీఎన్ వెల్లడించింది. ఈ యుద్ధ నౌకలు, ఇతర సామగ్రి ని పరిశీలిస్తే భారతదేశం, చైనా నావికా దళాల మధ్య తేడా పెద్దగా లేదని స్పష్టమవుతుందని ఈ న్యూస్ పోర్టల్ తెలిపింది. వీటిని ఈ ప్రాంతంలో మోహరించడానికి కారణాన్ని మాత్రం వెల్లడించలేదు. అంతేకాకుండా వీటిని ఎప్పుడు మోహరించారు? ఎంత కాలం ఇక్కడ ఉంటాయి? అనే వివరాలను కూడా పేర్కొనలేదు. మాల్దీవులపై ఆధిపత్యం చెలాయించాలని చైనా ప్రయత్నిస్తోంది. ఆసియా, తదితర ప్రాంతాలకు రవాణా సదుపాయాలను విస్తరించేందుకు చైనా ప్రారంభించిన బెల్ట్ అండ్ రోడ్ పథకంలో భాగస్వామి అయ్యేందుకు మాల్దీవుల అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ అంగీకరించిన సంగతి తెలిసిందే. చైనా యుద్ధ నౌకలు హిందూ సముద్రంలోకి ప్రవేశించాయన్న వార్తలను భారత నౌకాదళం కొట్టిపారేసింది. ఏ దేశ యుద్ధ నౌకలు కూడా తూర్పు హిందూ మహాసముద్రంలోకి ప్రవేశించలేదని ఒక ప్రకటనలో పేర్కొంది.

నేపాల్‌లో వామపక్షాల విలీనం

- **సిపిఎన్ పేరిట కొత్త పార్టీ**



ఒప్పందాలపై సంతకాలు చేస్తున్న ప్రధాని కె.పి. శర్మ ఓలీ, ప్రచండ

ఖాట్మండు: నేపాల్‌లో సిపిఎన్—యుఎంఎల్, సిపిఎన్—మావోయిస్ట్ సెంటర్ వీలనమయ్యాయి. ఈ రెండు వామపక్ష వర్గాల విలీనంతో కొత్త శక్తివంత కూటమి ఏర్పడింది. ఫెడరల్, ప్రాంతీయ ఎన్నికల్లో భారీ మెజారిటీతో చారిత్రక విజయం సాధించడంతో ఈ కూటమిని ఏర్పాటు చేశారు. సిపిఎన్—యుఎంఎల్ వర్గానికి ప్రధాని కె.పి. శర్మ ఓలీ నేతృత్వం వహిస్తుండగా, సిపిఎన్—మావోయిస్ట్ సెంటర్‌కు మాజీ ప్రధాని ప్రచండ నేతృత్వం వహిస్తున్నారు. 275 స్థానాలున్న నేపాల్ పార్లమెంటులో డిసెంబర్ నెలలో 174 స్థానాలను వామపక్షాలు గెలుచుకున్నాయి. దీంతో నేపాల్‌లో ఓ రాజకీయ సుస్థిరత ఏర్పడింది. అయితే వామపక్షానికి చెందిన రెండు వర్గాలు సోమవారం రాత్రి సమావేశమై విలీనం అంగీకారానికి వచ్చాయి. పార్టీ ఏకీకరణ సమన్వయ కమిటీ(పియుసిసి) సమావేశం బలువతర్‌లో 7 అంశాలపై జరిగింది. ఆ తర్వాతే ఏకీకరణ ప్రక్రియ చోటు చేసుకుంది. ఏకమైన రెండు వామపక్ష వర్గాలు ఇకపై 'కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్(సిపిఎన్)'గా చెలామణి కానున్నదని నేపాల్‌లోని 'ఖాట్మండు పోస్ట్' దినపత్రిక వెల్లడించింది. ప్రభుత్వంలోని పోర్ట్‌ఫోలియోను, ఇతర శక్తిమంత స్థానాలను పంచుకునే విషయాన్ని ఖరారు చేసుకోడానికి ఉభయ వామపక్ష వర్గాలు సమావేశం అవుతాయని పియుసిసి సభ్యుడు నారాయణ్ కాజి శ్రేష్ఠ చెప్పారు. అంగీకారం ప్రకారం ఓలీ, ప్రచండ ఇద్దరూ సమాన ఉన్నత హోదాను పంచుకుంటారు. వారిద్దరూ ఐదేళ్ల ప్రధాని పదవిని కూడా పంచుకోనున్నారని సమాచారం. వామపక్ష ఏకీకరణ కూటమి విధానంలో మార్క్సిజం, లెనినిజం భావాలు ప్రతిబింబించనున్నాయి. పోటీచేసిన 165 స్థానాల్లో కేవలం 23 స్థానాలే నేపాలీ కాంగ్రెస్(ఎన్‌సి)గెలువడంతో మాజీ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బా ఘోర పరాభవాన్ని మూటకట్టుకున్నారు. ఎన్నికలకు ముందే గత ఏడాది అక్టోబర్‌లో అనూహ్యంగా ఏకీకరణ ప్రకటనను వామపక్ష వర్గాలు ప్రకటించడం ఇక్కడ గమనార్హం.

హైకోర్టుకు పాక్ సీరియల్ కిల్లర్

- **మరణ శిక్షకు గురైన నిందితుడి అప్పీలు**


లాహోర్: ఏడేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసి మరణశిక్షకు గురైన నిందితుడు పాకిస్థాన్‌లోని లాహోర్ హైకోర్టుకు అప్పీల్ చేసుకున్నాడు. ఉగ్రవాద వ్యతిరేక కోర్టు ఎలాంటి న్యాయ విధానాలు పాటించకుండా ఆదరాబాదర విచారణ జరిపేసిందని పేర్కొన్నాడు. పాకిస్థాన్‌లో నాలుగు రోజుల్లోనే ముగిసిన అతిస్వల్పకాల విచారణగా అతడి కేసు విచారణ చరిత్రకెక్కింది. బాలికను చంపినందుకు, అపహరించినందుకు, అత్యాచారం చేసినందుకు, మైనర్‌పై అసహజ నేరానికి పాల్పడ్డాడన్న నాలుగు అంశాలపై 23 ఏళ్ల ఇమ్రాన్ అలీకి ఉగ్రవాద వ్యతిరేక కోర్టు నాలుగు రోజుల్లోనే తీర్పు చెప్పింది. అయితే అతడు హైకోర్టుకు చేసుకున్న తన అప్పీల్‌లో తాను 'నేరం చేయలేదని' పేర్కొన్నాడు. ఉగ్రవాద వ్యతిరేక కోర్టు ఇచ్చిన తీర్పును మార్చాలని కోరుకున్నాడు. ఇమ్రాన్‌కు మరణశిక్ష విధించడంతో పాటు ఏడేళ్ల కారాగారం, రూ. 10 లక్షల జరిమానా కూడా కోర్టు విధించింది. ఏడేళ్ల బాలిక హత్యాచారం జరిగిన రెండు వారాలకు జనవరిలో అతడిని అరెస్టు చేశారు. పాకిస్థాన్‌లో ఏడేళ్ల చిన్నారిపై జరిగిన హత్యాచార ఉదంతం ప్రపంచవ్యాప్తంగా సంచలనమైంది. తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోడానికి అతడికి అనేక అవకాశాలు ఇచ్చామని, కానీ అతడు నేరాన్ని అంగీకరించాడని ప్రాసిక్యూషన్ లాయర్ అన్నారు. మొత్తం 56 మంది సాక్షులు అతడికి వ్యతిరేకంగా వాంగ్మూలం ఇచ్చారు. అంతేకాక అతడికి వ్యతిరేకంగా ఫోరెన్సిక్ సాక్ష్యాలు, డిఎన్ఎ, పోలిగ్రాఫ్ పరీక్షలు రుజువులుగా ప్రవేశపెట్టారు. నిందితుడిపై విచారణ స్వేచ్ఛగా, న్యాయంగా జరగాలని, అతడు తన నిర్దోషిత్వాన్ని చెప్పుకునేందుకు తగిన అవకాశాన్ని ఇవ్వాలని న్యాయవాది అసద్ జమాల్ వాదించారు.

నాడు కాంగ్రెస్... నేడు బిజెపితో

రాష్ట్రానికి అన్యాయం

- **సమన్వయ కమిటీ సమావేశంలో చంద్రబాబు ఆవేదన**

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వడానికి అంగీకరించని కేంద్రం, ఇప్పుడు వేరే రాష్ట్రాలకు ఎలా ఇస్తోందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు ప్రశ్నించారు. ఇతరులకు ఇచ్చినప్పుడు తమకు కూడా ఇవ్వాల్సిందేనని తేల్చి చెప్పారు. అయితే ప్రత్యేక హోదా ఎవరికీ ఇవ్వడం లేదని 14వ ఆర్థిక సంఘం చెప్పిందని కేంద్రం వివరిస్తేనే ప్యాకేజీకి ఒప్పుకున్నామన్నారు. హోదానా? లేదా ప్యాకేజీనా? ఏ పేరుతో ఇచ్చినా ఫర్వాలేదని.. హోదాలో ఉన్న ప్రయోజనాలు మాత్రం రాష్ట్రానికి దక్కాల్సిందేనని చంద్రబాబు స్పష్టం చేశారు. తన నివాస ప్రాంగణంలోని ప్రజా దర్బారు హాల్లో చంద్రబాబు సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి పలు కీలక అంశాలను నేతలతో ప్రస్తావించారు. విభజన హామీల పట్ల ఆయా పార్టీల అజెండా ఎలా ఉన్నా.... మనం మాత్రం ప్రజల మనోభావాలకు అనుగుణంగా వెళ్దామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజ




నాలే ప్రధాన అజెండా అని, వైసిపి రోజుకో మాట మాట్లాడుతోందని దుయ్యబట్టారు. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టగానే బాగుంది అని తొలుత పొగిడింది వైసిపేనని గుర్తుచేశారు. ప్రత్యేక హోదా విషయంలో తెలుగుదేశం పార్టీ ఎక్కడా రాజీపడలేదన్నారు. ఆనాడు ప్రత్యేక హోదా ద్వా రా ఏయే ప్రయోజనాలు మన్మోహన్ సింగ్ ఇస్తామన్నారో ఆ ప్రయోజనాలు మనకు దక్కాల్సిందేనన్నారు. ప్రత్యేక హోదాను ఓ సెంటిమెంట్‌గా సృష్టించి ప్రతిపక్ష నేత ప్రజల్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ముఖ్యమంత్రి మండిపడ్డారు. రాష్ట్రానికి ఎలాగైనా న్యాయం జరగకూడదనే దుర్బుద్ధితోనే జగన్ రాజీనామాల నాటకం ఆడుతున్నారని ఆక్షేపించారు. అవి ఇచ్చాం.. ఇవి ఇచ్చామంటూ ఈ మధ్య బిజెపి కూడా ప్రకటనలు చేస్తోందని.. ఆ పార్టీ నేతలు ఢిల్లీకి వెళ్లి రాష్ట్రానికి కావాల్సినవి అడగకుండా తెలుగుదేశాన్ని ప్రశ్నించమేమిటని తప్పుబట్టారు. అన్యాయాన్ని సరిదిద్దాలన్నది 5కోట్ల మంది ప్రజల డిమాండని చంద్రబాబు తేల్చి చెప్పారు. రాష్ట్ర పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లైందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అన్యాయం చేసింది కదా బిజెపి న్యాయం చేస్తుంది అనుకుంటే ఆ పార్టీ కూడా అలానే ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయ కుండా జాతీయ స్థాయిలో రెండు పార్టీలు ఎలా మనుగడ సాధించగలుగు తాయని ప్రశ్నించారు. కేంద్రంతో పోరాడుతూనే రాష్ట్రాభి వృద్ధి కోసం కసిగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

మొయినాబాద్ బ్యాంక్ కేసు

సిబిఐకి అప్పగింత

మన తెలంగాణ/హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అజీజ్‌నగర్ శాఖలో వెలుగు చూసిన రూ.9 కోట్ల కుంభకోణం కేసును పోలీసులు మంగళవారం సిబిఐకి అప్పగించారు. దీంతో సిబిఐ అధికారులు అజీజ్‌నగర్‌కు వెళ్ళి రికార్డులను పరిశీలించారు. కుంభకోణానికి సూత్రధారి అని భావిస్తున్న బ్యాంక్ క్లర్క్ జైపాల్‌రెడ్డి కోసం వారు తీవ్రంగా గాలిస్తున్నారు. ఈ కుంభకోణంలో ఇతర బ్యాంక్ ఉద్యోగుల పాత్రపై ఆరా తీస్తున్నారు. ఈ బ్యాంక్‌కు చెందిన ఇతర శాఖలలో కూడా ఇదే పద్ధతిలో ఖాతాదారుల డిపాజిట్లు గల్లంతయ్యాయ అనే కోణంలో ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. రైతులు బ్యాంక్‌లో ఫిక్స్ డిపాజిట్స్ రూపంలో దాచుకున్న నగదు గల్లంతైన విషయంలో నెల రోజుల క్రితం బైటపడింది. ఓ రైతు తన డిపాజిట్ డబ్బులను తీసుకునేందుకు వెళ్లగా ఈ సంగతి తెలిసింది. నీ అకౌంట్‌లో నగదేమి లేదని బ్యాంక్ అధికారులు చెప్పడంతో సదరు రైతు నిర్ఘాంతపోయాడు. అతడిచ్చిన ఫిర్యాదుపై సైబరాబాద్ పోలీసులు దర్యాప్తు చేయగా రూ.9 కోట్ల కుంభకోణం గుట్టు రట్టయింది. ఖాతాదారుల డిపాజిట్లను కొల్లగొట్టిన జైపాల్‌రెడ్డి హైదరాబాద్‌తో పాటు శివార్లలో వ్యవసాయ భూములను కొనుగోలు చేసినట్లు తెలిసింది. దీంతో పాటు పలువురు పారిశ్రామిక వేత్తలకు వడ్డీపై రుణాలు ఇచ్చినట్లు తెలిసింది. ఇతను ఖరీదు చేసిన ప్లాట్లు, కారు, ఇతర భూములను ఇప్పటికే పోలీసులు సీజ్ చేసినట్లు సమాచారం. మంగళవారం సిబిఐ అధికారులు మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్ బ్రాంచ్‌లో తనిఖీలు నిర్వహించి కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. సుమారు రెండు వందల మంది ఖాతాదారులకు చెందిన డిపాజిట్లు గల్లంతయినట్లు తెలుస్తుంది. బాధితులు ఆందోళన చెందవద్దని వారి డిపాజిట్లు త్వరలో వారికి అందించడం జరుగుతుందని బ్యాంక్ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

ఎస్‌సి కమిషన్‌కు కాంగ్రెస్ ఫిర్యాదు



మన తెలంగాణ/హైదరాబాద్ : దళిత వ్యతిరేక రాష్ట్ర ప్రభుత్వంపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎంఎల్ఎ ఎస్.ఎ.సంపత్‌కుమార్ జాతీయ ఎస్‌సి కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌కు వచ్చిన ఎస్‌సి కమిషన్ చైర్మన్ ఎల్.మురుగన్‌ను కలిసి ఈ మేరకు ఆయన ఫిర్యాదు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. మూడున్నరేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం దళితులకు రాజ్యాంగ బద్ధంగా, చట్టపరంగా రావాల్సిన నిధులను దారి మళ్ళిస్తోందని, హక్కులను కాలరాస్తోందన్నారు. కాబట్టి సిఎం కెసిఆర్‌ను ముద్దాయిగా చేర్చి ప్రభుత్వంపై ఎస్‌సి అత్యాచార నిరోధక చట్టం క్లాజ్ 45 కింద కేసు నమోదు చేయాలని కోరారు.

ఈ వేసవికల్లా ప్రతి గ్రామానికి భగీరథ నీళ్లు



- **డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కోసం ప్రత్యేక ప్రణాళిక**
- **మిషన్‌భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంతరెడ్డి**

మన తెలంగాణ/హైదరాబాద్ : ఈ వేసవిలోనే ప్రతి గ్రామానికి మిషన్ భగీరథ నీళ్లు అందిస్తామని, ప్రధాన పనులన్నీ దాదాపుగా పూర్తయ్యాయని, ఇక ఇంట్రా (గ్రామాల్లో అంతర్గత పైప్‌లైన్) పనులను పూర్తి చేయడంపై దృష్టి పెడతామని మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. సచివాలయంలోని తన కార్యాలయంలో మంగళవారం మిషన్ భగీరథపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగపు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయించాలని ఆదేశించారు. స్థానిక భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా ఓహెచ్ఎస్ఆర్ డిజైన్లను మార్చుకునేందుకు ప్రభుత్వం ఇచ్చిన అనుమతి మేరకు పనులు చేయాలని స్పష్టంచేశారు. పనులకు ఎలాంటి ఆటకం కలగకుండా స్థానిక ఎమ్మెల్యేల సహకారం తీసుకోవాలని, కాంట్రాక్టర్లతో పాటు కూలీలను సమకూర్చుకోవడంలో చీఫ్ ఇంజనీర్లు క్రియాశీలకంగా పనిచేయాలన్నారు. ఏ గ్రామంలోనూ తాగునీటి కొరత ఏర్పడకుండా చూడాలని ఆదేశించారు. సిఎంఒ కార్యదర్శి స్మితాసబర్వాల్ మాట్లాడుతూ ఈ పనుల కోసం కలెక్టర్లు పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు. డబుల్ బెడ్ రూం కాలనీలు వచ్చే ప్రాంతాల్లో తాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రత్యేక ప్రణాళిక తయారుచేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ అండ్ ఎస్ ఈఎన్‌సి సురేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు జ్ఞానేశ్వర్, చీఫ్ ఇంజనీర్లు కృపాకర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, విజయ్‌పాల్‌రెడ్డి, విజయ్‌ప్రకాష్, కన్సల్టెంట్లు పాల్గొన్నారు.

కేంద్రాన్ని నిందించొద్దు :వీర్రాజు

- **కేవలం 15% నిధులే ఇవ్వాలి**

రాజమండ్రి : విభజన చట్టంలో పేర్కొన్నట్లుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రం అన్ని నిధులు కేటాయించిందని, కేవలం 15శాతం మాత్రమే ఇంకా ఇవ్వాల్సి ఉందని బిజెపి ఎంఎల్‌సి సోము వీర్రాజు పేర్కొన్నారు. మంగళవారం రాజమహేంద్రవరంలో జరిగిన మహిళా మోర్చా సమావేశంలో ఆయన మట్లాడారు. టిడిపి, వైసిపి, వామపక్షాలపై విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాల్లో 80 శాతం కేంద్రప్రభుత్వ నిధులతో జరుతున్నవేనని, అధికార, ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నట్లుగా కేంద్రం నిధులు కేటాయించలేదన్నది అవాస్తవమని తెలిపారు.

పోలవరం ఖర్చు మొత్తం కేంద్రమే భరిస్తుందని పార్లమెంట్‌లో స్పష్టం చేశామని చెప్పారు. ప్రాజెక్టు గురించి బడ్జెట్‌లో ప్రస్తావించాల్సిన అవసరం లేదన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులతో సంతృప్తి చెందిన సిఎం చంద్రబాబు గతంలో పత్రికాముఖంగా స్పందించిన వార్తల క్లిప్పింగ్స్‌ను ఆయన చూపించారు. ఏ రాష్ట్రం సాధించని నిధులు మనమే సాధించామని ఒకసారి, కేంద్రం అన్ని ఇచ్చింది ఇంతకు మించి అడగలేమని ఇంకోసారి సిఎం గతంలో పేర్కొన్నారని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం కేంద్రం ఏమి చేయలేదని ఎలా అంటున్నారని సోము వీర్రాజు ప్రశ్నించారు.

బాధ్యతగా ఆడండి : డుమిని



సెంచూరియన్: ఇప్పటికే తొలి మ్యాచ్‌లో ఓడి సిరీస్‌లో వెనుకబడిన తమకు భారత్‌తో బుధవారం జరిగే మ్యాచ్ చావోరేవో వంటిదని సఫారీ కెప్టెన్ జెపి.డుమిని అభిప్రాయపడ్డాడు. కనీసం ఈ మ్యాచ్‌లోనైన బాధ్యతతో ఆడాలని సహచరులకు సూచించాడు. తొలి మ్యాచ్‌లో గెలిచే అవకాశాలు లభించినా సద్వినియోగం చేసుకోలేక పోవడం బాధాకరమన్నాడు. ఈ మ్యాచ్‌లో పొరపాట్లకు తావివ్వకుండానే సమష్టిగా ముందుకు పోవాలని సూచించాడు. అప్పుడే సిరీస్‌లో నిలిచే అవకాశాలు ఉంటాయన్నాడు. తొలి మ్యాచ్‌లో ఓటమికి సమష్టి బాధ్యత వహించక తప్పదన్నాడు. ఈ మ్యాచ్‌లో ఏమాత్రం నిర్లక్ష్యంగా ఆడినా మరో పరాజయం ఖాయమన్నాడు. కాగా, తొలి మ్యాచ్‌లో ఓటమిపై డుమిని ఆగ్రహంతో ఉన్నాడు. గెలుపు కోసం ఏ ఆటగాడు సీరియస్‌గా ప్రయత్నించక పోవడం తనను ఎంతో బాధకు గురి చేసిందన్నాడు. ఇదిలావుండగా డుమిని వ్యాఖ్యలపై నెటిజన్లు మండి పడుతున్నారు. ఆటగాడిగా, కెప్టెన్‌గా పూర్తిగా విఫలమైన డుమిని సహచరులను బాగా ఆడాలని కోరడం విడ్డూరంగా ఉందని వారు పేర్కొంటున్నారు. వన్డేల్లో చెత్త ఆటతో నిరాశ పరిచిన డుమినికి టి–20లో సారథ్య బాధ్యతలు ఎందుకు అప్పగించారో తమకు అంతుబట్టకుండా మారిందని వారు వ్యాఖ్యానించారు.

సిరీస్‌పై భారత్ గురి

సఫారీలకు చావోరేవో, నేడు రెండో టి–20



సెంచూరియన్: వరుస విజయాలతో దూకుడు మీదున్న టీమిండియాపై బుధవారం దక్షిణాఫ్రికాతో జరిగే రెండో టి–20 మ్యాచ్‌కు సమరోత్సాహంతో సిద్ధమైంది. ఈ మ్యాచ్‌లోనూ గెలిచి మరో పోటీ మిగిలివుండగానే సిరీస్ దక్కించుకోవాలనే లక్ష్యంతో భారత్ కనిపిస్తోంది. మరో వైపు కిందటి మ్యాచ్‌లో ఎదురైన పరాజయానికి ప్రతీకారం తీర్చుకొని సిరీస్ అవకాశాలను సజీవంగా ఉంచుకోవాలనే లక్ష్యంతో ఆతిథ్య దక్షిణాఫ్రికా బరిలోకి దిగనుంది. కాగా, కిందటి మ్యాచ్‌లో గాయపడిన కెప్టెన్ విరాట్ కోహ్లి బరిలోకి దిగుతాడా లేదా అన్నది ఇంత వరకు తేలలేదు. ఒక వేళ కోహ్లి బరిలోకి దిగక పోతే రోహిత్ శర్మ జట్టుకు సారథ్యం వహిస్తాడు. కాగా, ఇప్పటికే వన్డే సిరీస్‌ను సొంతం చేసుకున్న టీమిండియా టి–20లలో కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించాలని భావిస్తోంది. ఇందు కోసం అన్ని అస్త్రాలతో రెండో మ్యాచ్‌కు సిద్ధమైంది.

రోహిత్ ఈసారైనా..

వరుస వైఫల్యాలతో సతమతమవుతున్న ఓపెనర్ రోహిత్ శర్మ కనీసం ఈ మ్యాచ్‌లోనైనా బ్యాట్ ఝులిపిస్తాడా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. టెస్టు, వన్డే సిరీస్‌లలో రోహిత్ ఆశించిన స్థాయిలో బ్యాటింగ్ కొనసాగించలేక పోయాడు. కేవలం ఒక వన్డేలో మాత్రమే సెంచరీతో ఆకట్టుకున్నాడు. అది తప్ప మరో మెరుగైన ఇన్నింగ్స్‌ను ఆడనే లేదు. తొలి టి–20లో జోరు మీద కనిపించినా తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరి నిరాశ పరిచాడు. కనీసం ఈ మ్యాచ్‌లోనైన స్థాయికి తగ్గ ఆటను కనబరచాల్సిన అవసరం రోహిత్‌పై ఉంది. ఇక, మరో ఓపెనర్ శిఖర్ ధావన్ ఈ పర్యటనలో ఆకాశమే హద్దుగా చెలరేగి పోతున్నాడు. కళ్లు చెదిరే బ్యాటింగ్‌తో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. తొలి టి–20లో కూడా అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. చూడచక్కని బ్యాటింగ్‌తో సిరీస్‌కే ప్రత్యేక ఆకర్షణగా మారాడు. ఈ మ్యాచ్‌లో కూడా మెరుపులు మెరిపించాలనే పట్టుదలతో ఉన్నాడు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన ధావన్ చెలరేగితే ఈ మ్యాచ్‌ను కూడా గెలుచుకోవడం భారత్‌కు కష్టమేమి కాదు. ఇక, తొలి మ్యాచ్‌లో తక్కువ స్కోరుకే ఔటైన సీనియర్ ఆటగాడు సురేశ్ రైనా ఈసారి భారీ ఇన్నింగ్స్‌పై కన్నేశాడు. వాండరర్స్‌లో కొద్ది సేపు మెరుపులు మెరిపించినా భారీ స్కోరు సాధించడంలో విఫలమయ్యాడు. కానీ, ఈసారి మాత్రం ప్రత్యర్థి బౌలర్లపై చెలరేగేందుకు తహతహలాడుతున్నాడు.

కోహ్లి అనుమానమే..

మరోవైపు తొలి మ్యాచ్‌లో గాయం బారిన పడిన కెప్టెన్ విరాట్ కోహ్లి ఈ మ్యాచ్‌లో ఆడతాడా లేదా అనేది ఇంకా తేలలేదు. జట్టు యాజమాన్యం మాత్రం కోహ్లి బరిలోకి దిగుతాడనే నమ్మకంతో ఉంది. కోహ్లి కూడా మ్యాచ్ ఆడేందుకు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. అయితే మంగళవారం రాత్రి వరకు కూడా కోహ్లి ఆడే విషయంపై స్పష్టత రాలేదు. అసాధారణ ఫాంలో ఉన్న కోహ్లి బరిలోకి దిగక పోతే టీమిండియాకు అది పెద్ద లోటుగా పరిణమించే అవకాశం ఉంది. అయితే కీలకమైన ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగేందుకే కోహ్లి మొగ్గు చూపే అవకాశాలున్నాయి.

బౌలింగే బలం..

సిరీస్‌లో భారత్ సాధిస్తున్న విజయాల్లో బౌలర్లదే కీలక పాత్ర అని చెప్పక తప్పదు. వన్డే సిరీస్‌లో స్పిన్ ద్వయం చాహల్, కుల్దీప్‌లు అసాధారణ రీతిలో చెలరేగి పోయారు. వీరిద్దరు రాణించడంతో దక్షిణాఫ్రికాపై భారత్ భారీ తేడాతో సిరీస్‌ను సొంతం చేసుకుంది. వీరి బౌలింగ్‌ను ఎదుర్కొవడంలో సఫారీ బ్యాట్స్‌మెన్ తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ మ్యాచ్‌లో కూడా భారత బౌలర్ల నుంచి సఫారీ ఆటగాళ్లకు ప్రమాదం పొంచి వుందనే చెప్పాలి. చాహల్, కుల్దీప్‌లతో పాటు బుమ్రా, భువనేశ్వర్ కుమార్ కూడా జోరు మీదున్నారు. కిందటి మ్యాచ్‌లో భువనేశ్వర్ ఐదు వికెట్లు తీసి సత్తా చాటిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో కూడా భారత్ బౌలర్లపైనే ఆశలు పెట్టుకుంది.



చివర్లో వేగం పెంచాలి..

టాప్ ఆర్డర్ అందిస్తున్న శుభారంభాన్ని భారీ స్కోరుగా మలచడంలో మిడిలార్డర్ విఫలమవుతుందనే చెప్పాలి. కిందటి మ్యాచ్‌లో ధావన్, కోహ్లిలు మెరుగ్గా ఆడి భారీ స్కోరుకు పునాది వేశారు. అయితే మధ్య, చివరి ఓవర్లలో భారత్ వేగంగా పరుగులు సాధించడంలో విఫలమవుతోంది. తొలి టి–20లో కూడా ఈ విషయం స్పష్టమైంది. కీలక సమయంలో మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ వేగంగా ఆడడంలో విఫలమవుతున్నారు. దీంతో జట్టు ఊహించిన దానికంటే తక్కువ స్కోరుకే పరిమితమవుతోంది. కిందటి మ్యాచ్‌లో మనీష్ పాండే, మహేంద్ర సింగ్ ధోనిలు వేగంగా ఆడలేక పోయారు. దాదాపు ఆరేడు ఓవర్లు ఆడినా మనీష్ పాండే కేవలం ఒక్క సిక్స్ మాత్రమే సాధించాడు. అతని బ్యాట్ నుంచి ఒక్క బౌండరీ కూడా రాలేదు. దీన్ని బట్టి అతను ఎంత రక్షణాత్మక బ్యాటింగ్‌ను కనబరిచాడో ఊహించుకోవచ్చు. ధోనిలో కూడా మునుపటి వేగం కనిపించడం లేదు. ఒకప్పుడూ చివరి ఓవర్లలో కళ్లు చెదిరే షాట్లతో చెలరేగి పోయే ధోని ప్రస్తుతం ఆ స్థాయిలో బ్యాట్‌ను ఝులిపించలేక పోతున్నాడు. అతను తన దూకుడును పెంచాల్సిన అవసరం ఉంది. హార్దిక్ పాండ్య, భువనేశ్వర్‌లు కూడా వేగంగా ఆడితే భారత్‌కు భారీ స్కోరు సాధించడం అసాధ్యమేమి కాదు.



సఫారీలకు చావోరేవో..

మరోవైపు తొలి మ్యాచ్‌లో ఓటమి పాలైన ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టుకు ఈ మ్యాచ్ చావోరేవోగా మారింది. సిరీస్ అవకాశాలను నిలబెట్టుకోవాలంటే దక్షిణాఫ్రికా ఈ మ్యాచ్‌లో కచ్చితంగా గెలవాల్సిందే. ఇందులో ఓడితే సిరీస్‌ను కోల్పోవడం ఖాయం. దీంతో విజయమే లక్ష్యంగా సౌతాఫ్రికా పోరుకు సిద్ధమైంది. కాగా, విధ్వంసక ఆటగాళ్లు డివిలియర్స్, డికాక్, డుప్లెసిస్, ఆమ్లా తదితరులు లేకుండా బరిలోకి దిగుతున్న దక్షిణాఫ్రికాకు ఈ మ్యాచ్‌లో విజయం సాధించడం అంత సులువు కాదనే చెప్పాలి. సమష్టిగా పోరాడితే కానీ విజయం సాధించే అవకాశాలు అంతగా కనిపించడం లేదు. కిందటి మ్యాచ్‌లో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సౌతాఫ్రికా విఫలమైంది. దీంతో టీమిండియా ఘన విజయం సాధించింది. ఈసారి మాత్రం ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా ఆడాలన్నదే దక్షిణాఫ్రికా లక్ష్యం. కిందటి మ్యాచ్‌లో రాణించిన హెన్‌డ్రిక్స్, బెహార్డిన్‌లపై జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. కెప్టెన్ డుమిని కూడా బ్యాట్‌ను ఝులిపించేందుకు సిద్ధమయ్యాడు. మిల్లర్, మోరిస్, స్మట్స్ తదితరులతో సౌతాఫ్రికా బ్యాటింగ్ బలంగానే ఉంది. అయితే సమష్టిగా రాణించడంలో విఫలమవుతున్నారు. దీంతో వరుస ఓటములు తప్పడం లేదు. కాగా, ఈ మ్యాచ్‌లో మాత్రం విజయమే లక్ష్యంగా సఫారీలు పోరుకు సిద్ధమయ్యారు. ఇదిలావుండగా భారత కాల మానం ప్రకారం రాత్రి 9.30 గంటలకు మ్యాచ్ ప్రారంభమవుతోంది.



కోహ్లిని అడ్డుకోవడం చాలా కష్టం: గంగూలీ

కోల్‌కతా: సమకాలిన క్రికెట్‌లో భారత కెప్టెన్ విరాట్ కోహ్లిని మించిన క్రికెటర్ మరోకడు లేడంటే అతిశయోక్తి కాదని మాజీ సారథి సౌరవ్ గంగూలీ అభిప్రాయపడ్డాడు. బ్యాట్స్‌మన్‌గా, కెప్టెన్‌గా కోహ్లికి ఎదురు లేకుండా పోయిందన్నాడు. ప్రస్తుతం కోహ్లి జోరును అడ్డుకునే శక్తి ప్రపంచంలో ఏ జట్టుకు లేదని పేర్కొన్నాడు. అంతలా కోహ్లి ఆధిపత్యం చెలాయిస్తున్నాడని ప్రశంసించాడు. కొంత కాలంగా కోహ్లికి ఎదురే లేకుండా పోయింది. ఫార్మాట్ ఏదైనా అతను తన జోరును ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగిస్తున్నాడన్నాడు. కెప్టెన్సీ చేపట్టిన తర్వాత కోహ్లిలో అనూహ్య మార్పు కనిపించిందన్నాడు. ధోని వారసుడిగా తన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తున్నాడని తెలిపాడు. భవిష్యత్తులో కోహ్లి ఎన్నో రికార్డులను తన పేరిట లిఖించుకోవడం ఖాయమన్నాడు. ప్రస్తుతం ప్రపంచ క్రికెట్‌లో కోహ్లి ఓ ప్రకంపనం అన్నాడు. అతనికి పోటీ రాగల క్రికెటర్ కనిపించడం లేదన్నాడు. మూడు ఫార్మాట్‌లలో కూడా కోహ్లి తన ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నాడని గంగూలీ వివరించాడు. దక్షిణాఫ్రికా వంటి బలమైన జట్టును వారి సొంత గడ్డపై ఓడించడం ఏ జట్టుకైనా చాలా కష్టమన్నాడు. అయితే కోహ్లి తన అద్భుత కెప్టెన్సీతో ఇది సాధ్యం చేసి చూపించాడన్నాడు. వన్డే సిరీస్‌లో జట్టును ముందుండి నడిపించిన తీరు తనను ఎంతో ఆకట్టుకుందన్నాడు. భవిష్యత్తులో జరిగే విదేశీ సిరీస్‌లలో భారత్‌ను ఒంటిచేత్తో గెలిపించే సత్తా కోహ్లికి ఉందన్నాడు. అతని సారథ్యంలో భారత జట్టు ప్రపంచ క్రికెట్‌ను శాసించడం ఖాయమని గంగూలీ జోస్యం చెప్పాడు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో గంగూలీ ఈ విధంగా స్పందించాడు.

జట్ల వివరాలు

భారత్: విరాట్ కోహ్లి (కెప్టెన్), రోహిత్ శర్మ, ధావన్, రైనా, మహేంద్ర సింగ్ ధోని, మనీష్ పాండే, దినేష్ కార్తీర్, హార్దిక్ పాండ్య, భువనేశ్వర్ కుమార్, బుమ్రా, శార్దూల్ ఠాకూర్, చాహల్, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, జైదేవ్ ఉనద్కట్, లోకేష్ రాహుల్.

దక్షిణాఫ్రికా: డుమిని (కెప్టెన్), రీజా హెండ్రిక్స్, స్మట్స్, మిల్లర్, క్లాసెన్, క్రిస్ మోరిస్, ఫెలుక్‌వాయో, జూనియర్ డాలా, ప్యాటర్సన్, అరోన్ ఫంగి సో, ఫర్హాన్ బెహార్డిన్, క్రిస్టియాన్ జోన్కర్, తబ్రెస్ షంసి.



విరుష్క ఫొటో హల్‌చల్



టీమిండియా సారథి విరాట్ కోహ్లి, అనుష్క శర్మల ఫొటో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ప్రస్తుతం సఫారీ టూర్‌లో ఉన్న కోహ్లి తన బార్యకు ప్రేమతో ముద్దు పెట్టినట్టుగా ఉన్న ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. ఇది వైరల్‌గా మారిపోయింది. కొన్ని గంటల్లోనే 25 లక్షలకు పైగా లైక్‌లను సొంతం చేసుకుంది...

సిరీసే లక్ష్యంగా..

నేడు మహిళల నాలుగో టి–20



సెంచూరియన్: కిందటి మ్యాచ్‌లో ఓటమి పాలైన భారత మహిళా జట్టు బుధవారం జరిగే మ్యాచ్‌లో గెలిచి ప్రతీకారం తీర్చుకోవాలనే పట్టుదలతో ఉంది. అంతేగాక ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకోవాలని తహతహలాడుతోంది. మరోవైపు ఆతిథ్య దక్షిణాఫ్రికా కూడా విజయమే లక్ష్యంగా పోరుకు సిద్ధమైంది. ఈ మ్యాచ్‌లోనూ గెలిచి భారత్ ఆధిక్యాన్ని సమం చేయాలతో ఉద్దేశంతో కనిపిస్తోంది. కిందటి మ్యాచ్‌లో సమష్టి పోరాటంతో సౌతాఫ్రికా విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించి సిరీస్ అవకాశాలను సజీవంగా ఉంచుకోవాలని భావిస్తోంది. రెండు జట్లలోనూ ప్రతిభావంతులైన క్రికెటర్లు ఉండడంతో పోరు హోరాహోరీగా సాగడం ఖాయం. ఇదిలావుండగా తొలి రెండు మ్యాచుల్లో ఘన విజయాలు సాధించి టీమిండియా మూడో వన్డేలో ఆ జోరును కొనసాగించడంలో విఫలమైంది. స్టార్ క్రికెటర్ మిథాలీరాజ్ డకౌట్‌గా వెనుదిరగడం భారత్‌పై ప్రభావం చూపింది. డాషింగ్ ఓపెనర్ మందన మెరుపులు మెరిపించినా, హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడినా ఫలితం లేకుండా పోయింది. సౌతాఫ్రికా బౌలర్ ఇస్మాయిల్ ఐదు వికెట్లు తీసి భారత్‌ను తక్కువ స్కోరుకే కట్టడి చేయడంలో సఫలమైంది. ఈ మ్యాచ్‌లో కూడా ఇస్మాయిల్ నుంచి భారత్‌కు ప్రమాదం పొంచి ఉంది. అయితే భారత్ మాత్రం కిందటి మ్యాచ్‌లో ఎదురైన ఓటమికి బదులు తీర్చుకోవాలనే లక్ష్యంతో మ్యాచ్‌కు సిద్ధమైంది. మరోవైపు దక్షిణాఫ్రికా కూడా విజయం కోసం తహతహలాడుతోంది. దీంతో మ్యాచ్‌లో ఎవరు గెలుస్తారో అంతుబట్టకుండా మారింది. అయితే పరిస్థితులు మాత్రం భారత్‌కే అనుకూలంగా కనిపిస్తున్నాయి. కానీ, కిందటి మ్యాచ్‌లో గెలిచి జోరుమీదున్న ఆతిథ్య దక్షిణాఫ్రికాను కూడా తక్కువ అంచనా వేయలేం. దీంతో భారత్ పూర్తి సామర్థ్యం మేరకు ఆడక తప్పదు.



ట్రోఫీపై ఆస్ట్రేలియా కన్ను

నేడు కివీస్‌తో తుది పోరు

ఆక్లాండ్: ముక్కోణపు టి–20 సిరీస్‌లో వరుస విజయాలతో జోరుమీదున్న ఆతిథ్య ఆస్ట్రేలియా బుధవారం జరిగే ఫైనల్లోనూ జయకేతనం ఎగురవేయాలనే పట్టుదలతో ఉంది. ఇంగ్లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరుగుతున్న ఈ టోర్నీలో కంగారూలు ఒక్క ఓటమి లేకుండానే ఫైనల్‌కు చేరారు. మరోవైపు కివీస్ ఏకైక విజయంతో తుది పోరుకు అర్హత సాధించింది. ఇంగ్లాండ్ కూడా ఒక మ్యాచ్‌లో విజయం సాధించినా రన్‌రేట్‌లో వెనుకబడి పోవడంతో ఫైనల్‌కు చేరకుండానే నిష్క్రమించింది. కాగా, కివీస్‌తో జరిగే ఫైనల్లో ఆస్ట్రేలియా ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో ఆస్ట్రేలియాకు ఎదురేలేకుండా పోయింది. కిందటి మ్యాచ్‌లో కివీస్ ఉంచిన 245 పరుగుల భారీ లక్ష్యాన్ని సైతం ఆస్ట్రేలియా అలవోకగా ఛేదించింది. దీంతో కంగారూలను ఓడించి ట్రోఫీని సాధించడం కివీస్‌కు అనుకున్నంత తేలిక కాదనే చెప్పాలి. డేవిడ్ వార్నర్ సారథ్యంలో ఆసీస్ అసాధారణ ఆటను కనబరుస్తోంది. లీగ్ దశలో ఆడిన అన్ని మ్యాచుల్లోనూ విజయం సాధించి అజేయంగా ఫైనల్‌కు చేరింది. వార్నర్, మాక్స్‌వెల్, అరోన్ ఫించ్ వంటి మ్యాచ్ విన్నర్లు జట్టుకు అందుబాటులో ఉన్నారు. మరోవైపు కివీస్‌ను కూడా తక్కువ అంచనా వేయలేం. కెప్టెన్ విలియమ్సన్ అద్భుత ఫాంలో ఉన్నాడు. మార్టిన్ గుప్టిల్ కూడా టోర్నీలో నిలకడైన ఆటతో చెలరేగి పోతున్నాడు. దీంతో కివీస్ కూడా విజయంపై కన్నేసింది.

నిజామాబాద్ నైట్స్‌పై మెదక్ మావెరిక్స్ విజయం

మన తెలంగాణ/ హైదరాబాద్: హెచ్‌సిఎ ఆధ్వర్యంలో జరుగుతున్న తెలంగాణ ప్రీమియర్ లీగ్ టి–20 క్రికెట్ టోర్నమెంట్‌లో మెదక్ మావెరిక్స్ మరో విజయాన్ని అందుకుంది. మంగళవారం హైదరాబాద్‌లోని ఎఒసి గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో మెదక్ ఐదు పరుగుల తేడాతో నిజామాబాద్ నైట్స్ జట్టును ఓడించింది. చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో మెదక్ అద్భుత విజయాన్ని దక్కించుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన మెదక్ నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది. మైఖేల్ జైస్వాల్, అభిరథ్ రెడ్డిలు అద్భుత బ్యాటింగ్‌తో మెదక్‌ను ఆదుకున్నారు.

దూకుడుగా ఆడిన జైస్వాల్ 34 బంతుల్లోనే 4సిక్స్‌లు, మరో రెండు ఫోర్లతో 52 పరుగులు చేశాడు. మరోవైపు అభిరథ్ రెడ్డి రెండు సిక్సర్లు, మరో మూడు ఫోర్లతో 29 బంతుల్లోనే 36 పరుగులు సాధించాడు. దీంతో మెదక్ స్కోరు 160కి చేరింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన నిజామాబాద్ నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 155 పరుగులు మాత్రమే చేసి పరాజయం పాలైంది. సయీద్ జైది 37 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కాగా మెదక్ జట్టులో ప్రణీత్ రాజ్ రెండు వికెట్లు పడగొట్టాడు. జైస్వాల్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది. ఇదిలావుండగా జట్టు విజయంపై మెదక్ మావెరిక్స్ జట్టు యాజమాన్యం జగన్మోహన్ రావు, విపుల్ కుమార్, సంజీవ్ రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.